మరవరాని మన చరిత్ర
రూ॥40/-
పేజీలు:40
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

సంపుటి 07, సంచిక: 346 | ఆదివారం | 17-11-2024 | మహబూబ్‌నగర్ | Published from: **Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar** | పేజీలు: 12 | వెల రూ. 5.00

## నటి కస్తూరి అరెస్ట్



తెలుగువారిపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన కన్నడ నటి కస్తూరిని హైదరాబాద్‌లోని పుప్పాలగూడలో శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. '300 ఏళ్ల క్రితం ఒక రాజు వద్ద అంతఃపుర మహిళలకు సేవ చేసేందుకు వచ్చిన తెలుగు వారు.. ఇప్పుడు మాది తమిళ జాతి అంటున్నారని చెన్నైలో ఆమె వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. దీనిపై ఫిర్యాదులు వెల్లువెత్తాయి. మద్రాస్ హైకోర్టు ముందస్తు బెయిల్ తిరస్కరించింది. దీంతో హైదరాబాద్‌లో చెన్నై పోలీసులు ఆమెను అరెస్ట్ చేశారు.

# నేతల అరెస్టుకు రంగం సిద్ధం




ఫోన్ ట్యాపింగ్ కేసులో బిఆర్‌ఎస్ నేతలకు ఉచ్చు ?

కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను విచారించిన అధికారులు

నేడో, రేపో మరికొందరి విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు పోలీసు అధికారులను అరెస్టు చేసిన దర్యాప్తు అధికారులు త్వరలో రాజకీయ నేతల అరెస్టుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలిసింది. రెండు రోజుల క్రితం ఈ కేసులో బిఆర్‌ఎస్ నేత, నకిరేకల్ మాజీ ఎంఎల్‌ఎ చిరుమర్తి లింగయ్యను విచారించిన అధికారులు శనివారం కల్వకుర్తి మాజీ ఎంఎల్‌ఎ గుర్క జైపాల్ యాదవ్‌ను విచారించారు. జైపాల్ యాదవ్ కూడా ఈ కేసులో ఉన్నట్లు దర్యాప్తు అధికారుల వద్ద ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు సమాచారం. ఈ కేసులో అరెస్టు అయిన పోలీసు అధికారులు భుజంగరావు, రాధాకృష్ణ, తిరుపతన్న, ప్రణీత్‌రావులతో జైపాల్ యాదవ్‌కు సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే తరువాయి 2లో

# దండకారణ్యం మళ్లీ రక్తసిక్తం



ఛత్తీస్‌గఢ్ బస్తర్ రేంజ్‌లో ఎన్‌కౌంటర్

ఐదుగురు మావోయిస్టులు మృతి

ఇద్దరు భద్రతా సిబ్బందికి తీవ్ర గాయాలు

సరిహద్దుల్లో హై అలెర్ట్

ప్రజాపక్షం/భద్రాచలం

ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరో సారి రక్తసిక్తమైంది. ఆ రాష్ట్రంలోని బస్తర్ రేంజ్‌లో గల నారాయణ్‌పూర్ జిల్లా కాకూర్ అటవీ ప్రాంతంలో శనివారం చోటు చేసుకున్న ఎదురు కాల్పుల్లో ఐదుగురు మావోయిస్టులు మృతి చెందగా ఇద్దరు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి. నారాయణ్‌పూర్ కాంకేర్ జిల్లాల సరిహద్దుల్లోని ఉత్తర అబూజ్‌మడ్‌లో మావోయిస్టుల ఏరివేతకు భద్రతా బలగాలు పెద్ద ఎత్తున కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో వారికి మావోయిస్టు దళాలు తారసపడటంతో ఎన్‌కౌంటర్ జరిగింది. సుమారు ఇరు వర్గాల మధ్య నాలుగు గంటల పాటు కాల్పులు జరగగా పోలీసుల తూటాలకు తాళలేక మావోయిస్టులు అడవుల్లోనికి జారుకున్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలం వద్ద ఐదు మావోయిస్టు మృత దేహాలు తరువాయి 2లో

# ఆసుపత్రిలో అగ్నిప్రమాదం




## నవజాత శిశువులు సహా 10మంది చిన్నారులు సజీవ దహనం



మరో 16 మంది చిన్నారులకు గాయాలు

యుపిలోని మహారాణి హాస్పిటల్‌లో ఘటన

**లక్నో/ఝాన్సీ :** ఉత్తరప్రదేశ్‌లో పెను విషాదం చోటు చేసుకుంది. ఝాన్సీ జిల్లాలోని మెడికల్ కాలేజీలో శుక్రవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో చిన్నారుల చికిత్సా విభాగంలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో 10 మంది శిశువులు సజీవదహనమయ్యారు. మృతుల్లో రోజుల వయస్సు చిన్నారులు కూడా ఉన్నారు. ప్రమాద సమయంలో ఆసుపత్రిలో 52 నుంచి 54 మంది చిన్నారులు ఉన్నారు. అందులో 10 మంది ప్రాణాలు కోల్పోగా, గాయపడిన 16 మంది చికిత్స పొందుతున్నారు. అయితే ఇతరులను గుర్తించేందుకు చర్యలు చేపడుతున్నామని పోలీసులు తెలిపారు. పిల్లల వార్డు గదుల్లో ఆక్సిజన్ సిలిండర్ పేలడంతో పూర్తిగా వ్యాపించి ఉండటం వల్ల మంటలు భారీగా విస్తరించాయని ఆస్పత్రి సూపరిండెంట్ సచిన్‌మహోర్ తెలిపారు. మంటల ధాటికి వార్డులోని తరువాయి 2లో



ఆరు మహానగరాల్లో బిజెపికి స్థానం లేదు

ముంబయిని దోచుకునేందుకు గుజరాత్ నుంచి వస్తున్న ప్రధాని, అదానీ

మహారాష్ట్ర ఎన్నికల ప్రచార సభల్లో తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి

# ఏక్‌నాథ్ షిండే–అజిత్ పవార్ గుజరాత్ గులాములు

**ముంబయి :** మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే, డిప్యూటీ సిఎం అజిత్ పవార్‌లు గుజరాత్ గులాములుగా మరారని, ఇలాంటి వెన్నుపోటు దారులకు బుద్ధి చెప్పాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ముంబాయిని దోచుకోవడానికే గుజరాత్ నుంచి ప్రధాని, అదానీ వస్తున్నారని హెచ్చరించారు. దేశంలో ఉన్న ఆరు మహానగరాలైన ఢిల్లీ, బెంగళూర్, చెన్నై, కోలకత్తా, హైదరాబాద్ లో బిజెపికి స్థానం లేదని, ముంబయిలో కూడా బిజెపికి స్థానం ఉండబోదన్నారు. ముంబయి నగరం మహావికాస్ ఆఘాడీతో ఉంటుందన్నారు. మహారాష్ట్ర శాసనసభ ఎన్నికలలో భాగంగా శనివారం ఆయన పలు చోట్ల కాంగ్రెస్ అభ్యర్థుల తరుపున ప్రచారం తరువాయి 2లో

రేపు శ్రీలంక ప్రధానమంత్రి

# నియామకం

21న పార్లమెంటులో కీలక విధాన ప్రకటన

**కొలంబో :** శ్రీలంక 10వ పార్లమెంటులో ఎన్‌పిపి (నేషనల్ పీపుల్స్ పవర్) వామపక్ష అధికార కూటమి 61.56 శాతం ఓట్లతో మూడింట రెండు వంతుల మెజారిటీ సాధించి మంచి జోష్‌లో ఉంది. ఈ నేపథ్యంలో కొత్త ప్రధానమంత్రి నియామకం సోమవారంనాడు జరుగుతుందని అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే వర్గాలు తెలియజేశాయి. అదేవిధంగా ఈనెల 21వ తేదీన 10వ పార్లమెంటు మొట్టమొదటి సమావేశం జరుగుతుంది. ఈ ప్రారంభ సమావేశంలో అధ్యక్షుడు దిస్సనాయకే ప్రసంగిస్తారు. ఒక కీలక ప్రభుత్వ విధానప్రకటన కూడా చేస్తారని పార్లమెంటు మీడియా కార్యాలయం శనివారం తెలియజేసింది. 225 మంది సభ్యులుగల పార్లమెంటులో ఈసారి 160 మంది మొదటిసారి ఎన్నికై సభలో కాలుపెడుతున్నారు. ఈనెల 25,26,27 తేదీలలో కొత్త ఎంపీల ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుంది. రాజ్యాంగంలోని 46వ అధికరణ ప్రకారం కొత్త మంత్రివర్గంలో మంత్రుల సంఖ్య 30 కంటే మించకూడదు. ఉప మంత్రులతోసహా ఈ సంఖ్య 40కి దాటకూడదు. ఐతే "మేం సోమవారం మంత్రివర్గాన్ని ఏర్పాటు చేస్తాం, మంత్రుల సంఖ్య 25 కే పరిమితం చేస్తాం, వీలైతే అంతకంటే తక్కువగా 23 లేదా 24 మందికే పరిమితం చేస్తాం, మంత్రులకు తరువాయి 12లో

# సిఆర్ గొప్ప మానవతావాది

ఫౌండేషన్ రజతోత్సవ సభలో వక్తలు

రాష్ట్రంలో సిఆర్ ఫౌండేషన్ సేవలు విస్తరణ

విజయవాడలో స్ఫూర్తి విజ్ఞాన కేంద్రం




విజయవాడ: దేశ సమైక్యతకోసం నిరంతరం కృషి చేసిన గొప్ప మానవతావాది చంద్ర రాజేశ్వరరావు అని వక్తలు కొనియాడారు. చంద్ర రాజేశ్వరరావు(సీఆర్) ఫౌండేషన్ రజతోత్సవ సభ స్థానిక గాంధీనగర్లోని శ్రీ రామా ఫంక్షన్ హాల్లో శనివారం జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి ఆకుల వెంకట శేషసాయి ప్రసంగిస్తూ పార్టీలు, సిద్ధాంతాలు వేరైనా అంతా భారతీయులమంటూ దేశ సమైక్యతను తన నడివడిక ద్వారా నిరూపించిన గొప్ప నాయకుడు సీఆర్ అన్నారు. పాకిస్తాన్ యుద్ధం సమయంలో సరిహద్దులో ఉన్న సైన్యం వద్దకు వెళ్లి వారిలో ఉత్తేజాన్ని నింపారని చెప్పారు. విలువలు మరువని దేశభక్తుడు అన్నారు. సీఆర్ రాసింది వీలునామా కాదని విలువలనామా అని కొనియాడారు. ఆనాడు పార్టీల మధ్య చర్చలు మాత్రమే జరిగేవని, ఇప్పటిలా వ్యక్తిత్వ హననం లేదన్నారు. దేశభక్తులు, స్వాతంత్ర సమరయోధుల జీవిత చరిత్రలను పాఠ్యాంశాలుగా చేర్చాలని సూచించారు. సభకు అధ్యక్షత వహించిన సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ అంతర్జాతీయ విప్లవ ఉద్యమం గుర్తించిన నేత, వామపక్ష ఉద్యమానికి లెజెండరీ సీఆర్ అన్నారు. సీఆర్ కృషితోనే భూమి సమస్యలు జాతీయ స్థాయి అజెండాగా మారాయన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో హైదరాబాద్ తరువాయి 2లో



# రెచ్చగొడుతున్న కెటిఆర్

19న వరంగల్‌లో ఇందిరాశక్తి సభ

టిపిసిసి చీఫ్ మహేశ్‌కుమార్

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

ఫార్మా కంపెనీల పేరుతో కెటిఆర్ ప్రజలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. హనుమకొండ డిసిసి అధ్యక్షులు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అధ్యక్షతన హనుమకొండ నయీంనగర్‌లోని శ్రీ రస్తు కన్వెన్షన్ హాల్ లో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అభాసు పాలు చేసేందుకు కెటిఆర్, హరీశ్ రావులు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అభివృద్ధి తెలిపేందుకే వరంగల్‌లో విజయోత్సవ సభ నిర్వహిస్తున్నామని, గత బిఆర్‌ఎస్ 10 ఏండ్లలో చేయని అభివృద్ధిని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 11 నెలల్లో చేసి చూపించిందన్నారు. అందుకే ఇద్దరు మహిళా మంత్రులున్న, రాణి రుద్రమదేవి ఏలిన ఖిల్లా ఓరుగల్లులో మొట్ట మొదటి విజయోత్సవ సభ నిర్వహించుకోవాలని ప్రభుత్వ నిర్ణయించిందని మహేశ్‌కుమార్ గౌడ్ తరువాయి 12లో

## 18 నుంచి బిసి కమిషన్ మలివిడత బహిరంగ విచారణ

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ వెనుకబడిన తరగతుల (బిసి) కమిషన్ జిల్లాలలో మలివిడత బహిరంగ విచారణలను ఈ నెల 18వ తేదీ నుండి 26వ తేదీ వరకు నిర్వహించనుంది. ఈ నెల 18న నల్గొండ, 19న ఖమ్మం, 21న రంగారెడ్డి, 22న మహబూబ్‌నగర్, 23న హైదరాబాద్ జిల్లా కలెక్టరు కార్యాలయాలలో ఈ కార్యక్రమాలు జరగనున్నాయి. జిల్లా కేంద్రాలలో నిర్వహించిన బహిరంగ విచారణకు హాజరు కాలేనివారు ఈ నెల 25, 26 తేదీలలో హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో జరగనున్న బహిరంగ విచారణకు హాజరు కావచ్చని కమిషన్ తెలియజేసింది. వ్యక్తిగతంగా హాజరు కాలేనివారు పోస్టు ద్వారా తమ విజ్ఞాపనలను ఖైరతాబాద్ కమిషన్ కార్యాలయానికి ఈ నెల 26వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు చేరేవిధంగా పంపవచ్చని ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ప్రజలందరికీ కమిషన్ విజ్ఞప్తి చేసింది.

# నేడు గ్రూప్–3 పరీక్షలు

5.36 లక్షల అభ్యర్థులు

రాష్ట్ర వ్యాప్తంగా 1401 కేంద్రాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న గ్రూప్–3 పరీక్షల నిర్వహణకు ప్రభుత్వం అంతా సిద్ధం చేసింది. ఆదివారం ఉదయం 10 గంటలకు గ్రూప్ –3 పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఆదివారం రెండు విడతలు , సోమవారం ఒక విడత నిర్వహించనున్న ఈ పరీక్షలకు రాష్ట్ర వ్యాప్తంగా 5,36,000 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. ఇందుకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 1401 పరీక్ష కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పేపర్1 (జనరల్ స్టడీస్ అండ్ జనరల్ ఎబిలిటీస్ )పరీక్ష జరగనుండగా, మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్ 2( హిస్టరీ, పోలిటి అండ్ సొసైటీ) పరీక్షలు జరగనున్నాయి. సోమవారం 10 గంటల నుండి మధ్యాహ్నం 12.30 గంటల తరువాయి 2లో

# అంతా దోపిడే !

కొనుగోలు కేంద్రాల్లోనూ తరుగు పేరుతో కోత

నష్టపోతున్న రైతులు

పట్టించుకోని అధికారులు



ప్రజాపక్షం/సూర్యాపేట ప్రతినిధి

అన్నం పెట్టే రైతును అందరూ దోచుకుంటున్నారు. తాము పండించిన పంటను అమ్ముకునేందుకు ఎక్కడి వెళ్లినా ఇదే పరిస్థితి ఎదురవుతుంది. మిల్లుల నుండి మొదలుకొని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కూడా నిర్వాహకులు దోపిడికి తెరలేపారు. తరుగు పేరుతో తూకాల్లో కోతలు విధిస్తున్న పరిస్థితి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అయినా సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కోసం 310 కేంద్రాలను ఏర్పాటు చేసింది. సన్న ధాన్యం కొనుగోలు కోసం ప్రత్యేకంగా ఇందులో 133 కేంద్రాలు, దొడ్డు రకం ధాన్యం కొనుగోళ్లకు 177న కేంద్రాలను ఏర్పాటు చేశారు. ప్రభుత్వం కొనుగోలు చేసే ధాన్యానికి ఏ గ్రేడ్‌కు రూ. 2320, బి గ్రేడ్ ధాన్యానికి రూ. 2300లుగా ధర నిర్ణయించగా సన్నధాన్యానికి అదనంగా రూ. 500 బోనస్‌ను ప్రకటించింది. రైతులు తాము పండించిన ధాన్యాన్ని తరువాయి 2లో

# ధర పెరిగిన డిఎపి .. భారమవుతున్న సాగు



తగ్గిన దిగుబడి... పెరిగిన పెట్టుబడులకు అన్నదాత కుదేలు

ప్రజాపక్షం/ ఖమ్మం

సాగు రోజు రోజుకు భారమవుతుంది. వ్యవసాయం కష్టాల, నష్టాల కార్ఖానాగా తయారైంది. ఇది చాలదన్నట్లు యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్న వేళ మరోసారి డిఏపి ధరలు పెంచారు. గతంలో రూ.1350 ఉన్న 50 కేజీల డిఏపి బస్తా ఇప్పుడు రూ.1650కు పెరిగింది. మారిన పరిస్థితుల్లో రసాయనిక ఎరువుల వాడకం పెరిగిన నేపథ్యంలో పెట్టుబడి భారమవుతుంది. రసాయనిక ఎరువులు, క్రిమి సంహారక మందుల వాడకం తప్పనిస్థితి అయింది. భూముల్లో గతంలో మాదిరి పశువుల ఎరువులు వాడకపోవడం, భూసారాన్ని పెంచేందుకు రసాయనిక ఎరువులు తప్ప మరో ప్రత్యామ్నాయ మార్గాన్ని అన్వేషించకపోవడంతో రసాయనిక ఎరువుల వాడకం తప్పనిసరైంది. గడిచిన ఐదేండ్లలో రసాయనిక ఎరువుల ధరలు క్రమేపీ పెరుగుతూ పోతున్నాయి. దీనికి తోడు వ్యవసాయ రంగంలో పెరిగిన యాంత్రీకరణ కూడా వ్యవసాయ పెట్టుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పెరిగిన డీజిల్ ధరలు, ట్రాక్టర్ విడి భాగాల ధరలు కూడా రైతులకు భారమవుతున్నాయి. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పైర్లకు వచ్చే తెగుళ్లు విపరీతంగా పెరిగాయి. గతంలో వాణిజ్య పంటలకు మాత్రమే క్రిమి సంహారక మందులను వినియోగించే వారు కానీ ఇప్పుడు వరి, ఇతర అపరాల పంటలకు కూడా క్రిమి సంహారక మందులను వాడక తప్పని పరిస్థితి ఏర్పడింది. దీనితో తరువాయి 2లో

# ట్రంప్ బాధ్యతలు చేపట్టాక దౌత్యమార్గాల్లో ఉక్రేన్ యుద్ధం ముగుస్తుంది : జెలెన్‌స్కీ




**కీవ్ :** డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన తర్వాత త్వరలో దౌత్యమార్గాల ద్వారా ఉక్రేన్‌లో యుద్ధం ముగుస్తుందని ఆ దేశ అధ్యక్షుడు వ్లాదిమీర్ జెలెన్‌స్కీ ప్రకటించారు. ఉక్రేన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ ''సస్‌పిల్న్''తో జెలెన్‌స్కీ మాట్లాడుతూ, రష్యా సేనలు ముందుకు కొనసాగుతూ ఉన్నందువల్ల యుద్ధ రంగం చాలా సంక్లిష్టంగా ఉందన్నారు. ''ఇక ఇప్పుడు వైట్‌హౌస్‌కు నాయకత్వం వహించి విధానాలు నడిపించబోయే అధికార యంత్రాంగం యుద్ధ నివారణపైనే దృష్టి పెడుతుంది, నిశ్చయంగా ట్రంప్ అధ్యక్షుడయ్యాక ఉక్రేన్‌లో వచ్చే ఏడాదిలో యుద్ధానికి తెరపడుతుంది'' అని జెలెన్‌స్కీ తాజా ప్రకటనలో చెప్పారు.ట్రంప్ విజయం సాధించిన తర్వాత జెలెన్‌స్కీ ఫోన్ ద్వారా ట్రంప్‌తో సంభాషణలు చేశారు. అటు రష్యా కూడా ట్రంప్ గెలిచారన్న వార్తలు వచ్చినప్పటినుండీ ఉక్రేన్‌లో యుద్ధం ముగుస్తుందన్న ఆశాభావంతోనే ఉంది. పుతిన్–ట్రంప్ మధ్య సానుకూలమైన సంబంధాలు ఉన్నాయని ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా ప్రచారం జరిగింది. ట్రంప్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉక్రేన్‌లో ఖచ్చితంగా రష్యా తన యుద్ధాన్ని ముగిస్తుందని తాను ఆశాభావంతో ఉన్నానని జెలెన్‌స్కీ అన్నారు. ట్రంప్ విజయం సాధించిన తర్వాత మరునాడు తాను ఆయనతో ఫోన్ సంభాషణ చేశాననీ, అనేక నిర్మాణాత్మకమైన విషయాలు మాట్లాడాననీ ఆయన అన్నారు. ఐతే రష్యా అధ్యక్షుడితో సంభాషణలు చేయాలనే డిమాండ్లు ట్రంప్ ఏమైనా జెలెన్‌స్కీ వద్ద ప్రస్తావించారా? అనే విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. ఐతే ట్రంప్ మాత్రం ఎన్నికల ప్రచార సమయం నుండీ కూడా తరచుగా ఉక్రేన్‌లో యుద్ధం ముగించి తీరుతామని చెబుతూ వస్తున్నారు. ఆయన అధ్యక్షుడుగా ఈనెల ఆరో తేదీన ఘన విజయం సాధించిన తర్వాత నుండీ ఈ అంచనాలు మరింతగా పెరిగిపోయాయి. మరోవైపు ఇరాన్ కూడా ఇజ్రాయెల్ యుద్ధం విషయంలో ఆశావహ దృక్పథంతో ఒక ప్రకటన చేసింది. ట్రంప్ 2017లో మొదటిసారి అధికారం చేపట్టిన తర్వాత దాదాపు యుద్ధాలకు దూరం పాటిస్తూ వచ్చారు. అమెరికా వనరులను ఒక ప్రవాహంలాగా ఉక్రేన్ యుద్ధంలోకి మళ్ళించడం తనకు ఇష్టం లేదని కూడా ట్రంప్ చెబుతూ వస్తున్నారు.ఐతే జెలెన్‌స్కీ–ట్రంప్‌మధ్య ఐదేళ్ళక్రితం సంబంధాలు బాగా గందరగోళంలో పడ్డాయి. జో బైడెన్ కుటుంబాన్ని అపఖ్యాతిపాల్జేసే సమాచారాన్ని తవ్వితీయాలని జెలెన్‌స్కీపై ఒత్తిడి చేసినట్లు ట్రంప్‌పై 2019లో దోషారోపణలు వచ్చాయి. ఆ తర్వాత కొన్ని సంవత్సరాలకు జెలెన్‌స్కీతో తనకు ఎలాంటి విభేదాలు లేవని ట్రంప్ ప్రకటించి సర్దుబాటు చేసుకున్నారు. ఈ ఏడాది సెప్టెంబరునెలలో జెలెన్‌స్కీతో ట్రంప్ న్యూయార్క్‌లో సమావేశమయ్యారు. ఆ తర్వాత మీడియాతో ట్రంప్ మాట్లాడుతూ, ''ఈ సమావేశం ద్వారా తాను చాలా విషయాలు తెలుసుకున్నా, యుద్ధాన్ని చాలా త్వరగా ముగించేస్తా, ఇది యుద్ధానికి అంతం పలికే సమయం'' అన్నారు. తాను అధ్యక్ష ఎన్నికల్లో గెలవకపోతే ఉక్రేన్‌లో యుద్ధం ఎప్పటికీ ముగిసిపోదని, చివరకు ఈ యుద్ధం తృతీయ ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందని కూడా ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ ఏడాది ఆరంభంలో ఉక్రేన్‌కు 61 బిలియన్ డాలర్లు సైనిక సహాయం అందజేసేదుకు అమెరికా దిగువసభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. రష్యాపై పోరాటానికి పూర్తి సహాయ సహకారాలను బైడెన్ ప్రభుత్వం అందజేస్తూ వస్తున్నది. ట్రంప్ అధికారం చేపట్టేవరకూ బైడెన్ విధానాలే కొనసాగుతాయి. 2022 ఫిబ్రవరి నుండీ 2024 జూన్ వరకూ ఉక్రేన్‌కు ఆయుధాలు భారీగా సరఫరా చేసిన దేశం అమెరికాయే. నిజానికి 2014 ఫిబ్రవరిలో రష్యా–ఉక్రేన్ మధ్య యుద్ధం మొదలైంది. ఐతే 2022 ఫిబ్రవరిలో రష్యా పూర్తిస్థాయి యుద్ధం ప్రారంభించింది.




**ఉక్రేన్‌లో జపాన్‌మంత్రి పర్యటన**

ఉత్తరకొరియా సైన్యం రష్యాకు సహాయంగా యుద్ధంలో జత కలవడంపై చర్చించేందుకు జపాన్ విదేశాంగమంత్రి తకెషి ఇవయ శనివారంనాడు ఉక్రేన్‌లో పర్యటించారు. రష్యాతో సైనిక ఒప్పందం చేసుకున్న ఉత్తర కొరియా 12 వేలమంది సైనికులను కుర్స్క్ ప్రాంతంలో మోహరించింది. వారంతా ఇప్పుడు రష్యాతో కలిసి యుద్ధంలో ముందుకు వెళ్ళనున్నారు. ఈ విషయాలపై ఉక్రేన్ విదేశాంగమంత్రి ఆండ్రీ సైబిహాతో తకెషి ఇవయా చర్చించారు. ఉక్రేన్‌కు తమ గట్టి మద్దతు ఉంటుందని చెప్పారు. ఉత్తర కొరియా, రష్యామధ్య రోజు రోజుకూ సైనిక బంధం బలపడటంపై రెండు దేశాల విదేశాంగమంత్రులూ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. రష్యాపై తదుపరి మరిన్ని ఆంక్షలు అమలు చేసే విషయాలను తాము ఉక్రేన్‌తో చర్చిస్తామని తొలుత తకెషి ఇవయ చెప్పారు.

# పాకిస్థాన్ పంజాబ్‌లో హెల్త్ ఎమర్జెన్సీ,లాక్‌డౌన్

## గాలి కాలుష్యం సరిహద్దు సమస్య పాక్ సీనియర్ మంత్రి ప్రకటన



**లాహోర్ :** పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రంలోని కొన్నిప్రాంతాలలో హెల్త్ ఎమర్జెన్సీ విధించారు. గాలికాలుష్యం ఉగ్రరూపం దాల్చడంతో స్కూళ్ళు, కార్యాలయాలు మూసివేశారు. శుక్రవారంనుండీ ఆదివారం వరకూ మూడు రోజులు లాక్‌డౌన్ ప్రకటించారు. ఈ రాష్ట్రంలో కాలుష్య వాతావరణం సరికొత్త రికార్డు సృష్టించింది. గాలి కాలుష్యం భారత్–పాకిస్థాన్ మధ్య సరిహద్దు సమస్యగా ఉందని, రెండు దేశాలూ దీనిని పరిష్కరించుకోవాల్సి ఉందని రాబోయే పదిరోజులపాటు పంజాబ్‌లో నిర్మాణ కార్యకలాపాలను పూర్తిగా నిలిపివేశారు. నిర్మాణాలకు సంబంధించిన సామాగ్రిని తరలించే వాహనాలపై నిషేధం విధించారు. భారీ వాహనాల రాకపోకలపై నిషేధం విధించారు. పోలీసు వాహనాలు, వారి కార్యకలాపాలకు పూర్తి అనుమతి ఇచ్చారు. పాలు, పెట్రోలు పంపులు, పండిమరలు, మందుల దుకాణాలను లాక్‌డౌన్ నుండి మినహాయించారు. మరోవైపు వందలాదిమంది లాహోర్‌లో వర్షాలు కురవాలని, కాలుష్యం పోవాలని కోరుతూ మసీదులవద్ద ప్రార్థనలు చేశారు. మరో పదిరోజులపాటు స్కూళ్ళకు సెలవులు ఇచ్చారు. ఈనెల 24న స్కూళ్ళు తిరిగి తెరచే అవకాశం ఉంది. శ్వాసకోశ సమస్యలతో వచ్చే రోగులకు చికిత్సలు చేసేందుకు ఆసుపత్రులలో భారీ ఏర్పాట్లు చేశారు. జెహ్లమ్, గుజార్‌ఖాన్‌లలో వర్షాలు కురిపించేందుకు ప్రభుత్వం విజయవంతంగా క్లౌడ్ సీడింగ్ కార్యక్రమాలు నిర్వహించింది. లాహోర్, ముల్తాన్‌లలో పంజాబ్ ప్రభుత్వం ఎమర్జెన్సీని ప్రకటించింది. ఈ రెండూ చోట్లా సంపూర్ణమైన లాక్‌డౌన్‌ను అమలు చేస్తారు. గాలి కలుషితమైంది. వాతావరణంలో దట్టమైన పొగ ఆవరించుకుంది. గడచిన కొద్ది వారాలుగా పంజాబ్‌లోని అనేక నగరాల్లో వాతావరణంలో గాలి కాలుష్యం, గాలి నాణ్యతా ప్రమాణాలు క్షీణించిపోవడంవల్ల దట్టమైన పొగ ఆవరించుకుని ఉంటోందని ప్రభుత్వం ప్రకటించింది. లాహోర్, ముల్తాన్‌లలో ఇప్పటికే రెండుసార్లు గాలి నాణ్యతా ప్రమాణాలు 2,000 పాయింట్లు దాటిపోయాయి. సాధారణంగా 450 పాయింట్లు దాటితే పరిస్థితి చేయిదాటిపోయిందని, వెరీ డేంజరస్ అనీ ప్రకటిస్తారు. కానీ ఈ ప్రమాణాలు 2000 పాయింట్లు దాటిపోయాయి. దీంతో ఆ ప్రాంత ప్రజలకు తీవ్ర శ్వాసకోశ సమస్యలు వచ్చే ప్రమాదం తలెత్తడంతో ఆసుపత్రులలో ముందస్తు ఏర్పాట్లు చేశారు. సీనియర్ మంత్రి మర్రియమ్ అరంగ్‌జెబ్ శనివారం మీడియాతో మాట్లాడుతూ, కాలేజీలు, విశ్వవిద్యాలయాల విద్యార్థులకు మాత్రం ఆన్‌లైన్‌లో క్లాసులు జరుగుతాయని చెప్పారు. యాభైశాతం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల సిబ్బంది వర్క్ ఫ్రమ్ హోం చేస్తారని చెప్పారు. రెస్టారెంట్లు సాయంత్రం నాలుగు గంటలకే మూతపడతాయని, తపడతాయని ఎవే సర్వీసులు రాత్రి ఎనిమిది గంటలవరకూ నడిపేందుకు అనుమతించామనీ అన్నారు. వివాహాలపై ఎలాంటి నిషేధం విధించలేదనీ, కానీ వాటిని వచ్చే సంవత్సరానికి వాయిదా వేసుకోవడం మంచిదని సలహా ఇచ్చారు. పౌరులు బహిరంగ ప్రదేశాలకు వెళ్ళడం, పర్యటనలు చేయడం వంటివి తగ్గించుకోవాలని కోరారు. లాహోర్,ముల్తాన్‌లలో భారీ ఎత్తున గ్రీనరీ పెంచేందుకు, చెట్లు నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి మర్రియమ్ అరంగ్‌జెబ్ చెప్పారు. లాహోర్ హైకోర్టు తీర్పును ఉటంకిస్తూ, కాలుష్య నియంత్రణకు పది సంవత్సరాల ప్రణాళిక అమలు చేయాల్సి ఉందన్నారు.

# కిమ్ – పుతిన్ బంధంపై చైనాను ఒత్తిడి చేయనున్న బైడెన్



**లీమా (పెరూ):** పెరూలో ఆరురోజులు పర్యటన ప్రారంభించిన అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ తన చివరి విదేశీ పర్యటనలో చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో సమావేశం జరుపుతారు. ఈ సమావేశంలో అమెరికాకు ఆందోళన కలిగిస్తున్న రష్యా–ఉత్తర కొరియామధ్య పెరుగుతున్న అనుబంధం గురించి ప్రధానంగా చర్చకు పెడతారని అంచనావేస్తున్నారు. ఉక్రేన్‌లో యుద్ధం మరింత తీవ్రం కాకుండా ఉత్తర కొరియా దూరంగా ఉండేట్లు చేయాలని అడిగేందుకు బైడెన్ తన శాయశక్తులా జిన్‌పింగ్‌పై ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంది. ఈ విషయంలో ఏదైనా చేయాలని జిన్‌పింగ్‌పై బైడెన్ ఒత్తిడి చేసే అవకాశం ఉంది. ఆసియా–పసిఫిక్ ఎకనామిక్ కోపరేషన్ (ఎపెక్) సదస్సుకోసం పెరూ వెళ్ళిన బైడెన్ ఈ సందర్భంగా జిన్‌పింగ్‌తో సమావేశం కానున్నారు. అమెరికా దేశాధ్యక్షుడుగా జో బైడెన్‌కు ఇదే చిట్టచివరి విదేశీ పర్యటన. రష్యాకు సైన్యాన్ని పంపి యుద్ధంలో చేరాలని నిర్ణయం తీసుకున్న ఉత్తర కొరియా నేత కిమ్ చర్యలను జో బైడెన్ దక్షిణ కొరియా అధ్యక్షుడు యూన్ సియోక్ యుల్, జపాన్ ప్రధాన మంత్రి షిగెరు ఇషిబాలతో కలిసి తీవ్రంగా ఖండించారు. ఇది సహకార విచ్ఛిన్నానికి దోహదం చేసే ప్రమాదకరమైన చర్య అన్నారు.

# ఎలాన్‌మస్క్ – ఇరాన్ దౌత్యవేత్త మధ్య సమావేశం జరగలేదు



**టెహ్రాన్ :** అమెరికా సంపన్నుడు ఎలాన్ మస్క్, ఇరాన్ దౌత్యవేత్తమధ్య సమావేశం జరిగిందన్న వార్తలను ఇరాన్ విదేశాంగమంత్రిత్వశాఖ తీవ్రంగా ఖండించింది. అలాంటి సమావేశం ఏదీ జరగలేదని శనివారంనాడు ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. డోనాల్డ్ ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడు, కొత్త ప్రభుత్వ నాణ్యతా ప్రమాణాలు పెంచే నూతన శాఖ బాధ్యతలు చేపట్టనున్న ఎలాన్‌మస్క్ రాబోయేకాలంలో ట్రంప్ పాలనలో కీలకపాత్ర వహిస్తారని సర్వత్రా భావిస్తున్న తరుణంలో, మస్క్–ఇరాన్ దౌత్యవేత్త మధ్య ఒక సమావేశం జరిగిందని ''న్యూయార్క్ టైమ్స్'' పత్రిక ఒక కథనం ప్రచురించింది. ఈ సమావేశం ఈ వారారంభంలోనే జరిగిందని కూడా పత్రిక తెలియజేసింది. జరగని సమావేశం జరిగిందని అమెరికా మీడియా ఆ వార్తను ఏ విధంవగా కవర్ చేసిందని ఇరాన్ విదేశాంగ మంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి ఇస్మాయిల్ బాఘై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇరాన్ అధికార పత్రిక 'ఇర్నా' ఈ ఖండన వార్త ప్రచురించింది. గడచిన సోమవారంనాడు న్యూయార్క్‌లోని ఒక రహస్య ప్రదేశంలో గంటసేపు మస్క్, ఇరాన్ దౌత్యవేత్త అమీర్ ఇరవని మధ్య సమావేశం జరిగిందని న్యూయార్క్ టైమ్స్ పేర్కొంది. ఇరాన్–అమెరికా ధ్య ఉద్రిక్తతలు ఏ విధంగా సడలించాలనే విషయంపై ఈ సమావేశం జరిగిందని కూడా ఆ పత్రిక పేర్కొంది. ''డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియన్సీ'' అనే కొత్త శాఖకు ఎలాన్ మస్క్, వివేక్ రామస్వామి సారథ్యం వహిస్తారని గడచిన మంగళవారంనాడు ట్రంప్ ప్రకటించారు.

## గ్రూప్–3 పరీక్షలు

(మొదటి పేజీ తరువాయి)

వరకు పేపర్ 3 ( ఎకానమీ అండ్ డెవలప్మెంట్) పరీక్ష నిర్వహించనున్నారు. అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు సకాలంలో చేరుకోవాలిఅధికారులు సూచించారు. పరీక్ష ఉదయం 10.30 గంటలకు అయినప్పటికీ 9 గంటలకు గేట్లు మూసి వేస్తారని, అభ్యర్థులు 8.30 గంటల వరకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 2గంటలకు గేట్లు మూసివేయనున్న నేపథ్యంలో మధ్యాహ్నం జరిగే పరీక్షకు 1.30 గంటలకు పరీక్ష కేంద్రాల్లో ఉండాలన్నారు. పరీక్షకు హాజరైయ్యే అభ్యర్థులు హాల్ టికెట్‌తో పాటు ఒరిజినల్ ఐడి తీసుకుని రావాలని సూచించారు. సెల్ ఫోన్స్, క్యాలిక్యులేటర్ తో పాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి లేదని అధికారులు వెల్లడించారు.

**హైదరాబాద్‌లో 102 పరీక్షా కేంద్రాలు : హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

టిజిపిఎస్‌సి ఆధ్వర్యంలో ఆదివారం,సోమవారం రెండు రోజుల పాటు నిర్వహించనున్న గ్రూప్–3 పరీక్షలకు హైదరాబాద్ జిల్లాలో ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ అనుదీప్ తెలిపారు.జిల్లాలో పరిధిలో 102 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ వెల్లడించారు.

## అంతా దోపిడే !

(మొదటి పేజీ తరువాయి)

దళారులకు అమ్ముకొని నష్టపోవద్దని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేయడంతో వారు తమ సమీపంలోని కొనుగోలు కేంద్రాలకు తమ పంటను అమ్ముకునేందుకు తీసుకెళ్తున్నారు.దొడ్డు ధాన్యానికి 17శాతం, సన్నధాన్యానికి 14శాతంకు మించి తేమ శాతం ఎక్కువగా ఉంటే కొనుగోలు కేంద్రాల నిర్వహకులు రైతులను రోజుల తరబడి తూకాలు వేయకుండా నిరాకరిస్తున్న పరిస్థితి. ఇక చేసేది ఏమి లేక రైతులు తమ ధాన్యాన్ని అక్కడే ఆరబెట్టుకొని తేమశాతం దగ్గిన తరువాతనే అమ్ముకుంటున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా తేమ శాతం తగ్గిన తరువాత తూకాలు వేసుకుంటున్న నిర్వహకులు బస్తాకు కిలో నుండి రెండు కిలోల వరకు ఎక్కువగా తూకం వేసుకుంటున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే బస్తా తూకం 40కిలోలు కాగా 42కేజీల వరకు తూకం వేస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే బస్తా తూకం కింద కిలో తరుగు కింద మరో కిలో అంటూ బహిరంగంగానే దోచుకుంటున్నారు. ఇది ఇలా ఉంటే రైతుల ధాన్యం నుండి హమాలీలు, స్వీపర్లు అంటూ డబ్బా(10 నుండి 15కిలో)ల ధాన్యాన్ని ముక్కుపిండి వసూళ్లు చేస్తున్నారు.

**నష్టపోతున్న రైతులు.. పట్టించుకోని అధికారులు**

కొనుగోలు కేంద్రాల నిర్వహకుల దోపిడితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతు ఎకరం పంట సాగు చేయగా దాదాపు 30 క్వింటాల దిగుబడి వస్తుంది. ఈ లెక్కన చూస్తే రైతులు సుమారుగా 75కిలోల ధాన్యం నష్టపోతున్నారు. దీనికి తోడు హమాలీలు, స్వీపట్లు 10 నుండి 15 కిలోల ధాన్యాన్ని రైతుల నుండి బలవంతంగా తీసుకుంటున్నారు. ఇలా రైతులు మొత్తం క్వింట ధాన్యం వరకు నష్టపోతున్నారు. దీనిని నగదురూపంలో చూస్తే రూ. 2300పై మాటే. ఇదంతా సంబంధిత అధికారులకు తెలిసినా పట్టించుకోని పరిస్థితి. దీంతో అన్నదాతలు ఆర్థికంగా చితికిపోతున్నారు. ఇప్పటికైన కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న దోపిడిని అరికట్టి రైతులను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

## గుజరాత్ గులాములు

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేసిన మాణిక్‌రావ్ ఠాక్రే పోటీ చేస్తున్న డిగ్రాజ్ నియోజకవర్గంలో జరిగిన సభ, నాగ్‌పూర్‌లో రోడ్‌షోలో పాల్గొన్నారు. రాజురా నియోజకవర్గంలో బహిరంగసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రసంగిస్తూ మీరంతా మా సోదరులని, ఎందుకంటే మనమంతా ఒకప్పుడు హైదరాబాద్ సంస్థానానికి చెందిన వాళ్లమేనని అన్నారు. రాష్ట్రాలు వేరైనా మనమంతా ఒకే కుటుంబమని, మనమంతా కలికట్టుగా ముందుకు నడవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ ఎన్నికల్లో సుభాష్ బావూను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఛత్రపతి శివాజీ గురించి మనం పుస్తకాల్లో చదువుకున్నామని, రాజ్యాంగాన్ని రచించిన అంబేడ్కర్, బడుగుల ఆశాజ్యోతి పూలే ఈ గడ్డపై పుట్టినవారేనని చెప్పారు.

**గుజరాత్‌లో 50 వేల ఉద్యోగాలు ఇచ్చారా?**

రైతులు బాగుంటునే రాష్ట్రం బాగుంటుందని, అందుకే తాము 25 రోజుల్లోనే రూ.18వేల కోట్లు ఖర్చు చేసి రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేసామని,తెలంగాణ ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని రేవంత్ రెడ్డి నిరూపించామన్నారు. అధికారంలోకి వచ్చిన 10 నెలల్లోనే 50 వేల ఉద్యోగ నియామకాలు పూర్తి చేశామని చెప్పారు.ఈ వేదికగా ప్రధానికి నేను సవాల్ విసురుతున్నా... గుజరాత్ లో ఏడాదిలో 50వేల ఉద్యోగాలు ఇచ్చారా? అని అన్నారు. తెలంగాణలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించామని, ఇప్పటి వరకు 1.10 కోట్ల మంది మహిళలు ఉచిత బస్సు ప్రయాణాన్ని ఉపయోగించుకున్నారని, రూ.500 లకే వంటగ్యాస్ సిలిండర్ అందించి ఆడబిడ్డలను ఆదుకున్నాని, 25 లక్షల పేద కుటుంబాబలకు 200 యూనిట్ల చొప్పున ఉచిత విద్యుత్ అందించామని వివరించారు. తెలంగాణలో ఆరు గ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, మహారాష్ట్రలోనూ మహావికాస్ ఆఘాడీ కూటమి అధికారంలోకి రాగానే 5 గ్యారంటీలను అమలు చేస్తుందని ప్రకటించారు. ఎన్నికలు వస్తుంటాయని, పోతుంటాయని, ఇప్పుడు మహారాష్ట్రలో జరిగేవి ఎన్నికలు కావని, ఇది ఒక పోరాటమని అన్నారు. ఈ పోరాటంలో కూటమిని గెలిపించేందుకు ప్రతీ కార్యకర్త ఒక వీరుడుగా మారాలని, మహావికాస్ ఆఘాడీ కూటమిని గెలిపించాలని పిలుపునిచ్చారు. ప్రచార సభల్లో చంద్రాపూర్, రాజురా, డిగ్రాస్ అభ్యర్థులు ప్రవీణ్ పడవే కర్, సుభాష్ రామచంద్ర ధోతే, మాణిక్ రావ్ ఠాక్రే, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

**సిఎం ప్రచారానికి జనస్పందన**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రచార సభలు, నాగ్పూర్ రోడ్ షోకు మహారాష్ట్ర ప్రజల నుంచి భారీ స్పందన లభించింది. రేవంత్ రెడ్డి సభల వేదికలపైకి రాగానే, రోడ్ షోలో కనిపించగానే రేవంతన్న.. రేవంతన్న అంటూ కేరింతలు కొట్టారు.. ప్రచార కార్యక్రమం ముగిసిన తర్వాత ఆయన తన వాహనంలోకి ఎక్కే సమయంలో స్థానిక యువత ఆయనతో కరచాలనం చేసేందుకు, సెల్ఫీలు తీసుకునేందుకు పెద్ద ఎత్తున పోటీ పడ్డారు. నాగ్ పూర్ రోడ్ షోలో సిఎం రేవంత్ రెడ్డి వెంట నాగ్ పూర్ సెంట్రల్ అభ్యర్థి బంటీ బాబా షెల్కే పాల్గొన్నారు.

## రంగం సిద్ధం (మొదటి పేజీ తరువాయి)

జైపాల్ యాదవ్‌కు నోటీసు ఇవ్వడంతో ఆయన విచారణకు హాజరయ్యారు. నిందితులతో జైపాల్ యాదవ్‌కు ఉన్న సంబంధాలపై అధికారులు విచారించారు. ఫోన్ ట్యాప్ నిందితులతో ఫోన్‌లో మాట్లాడిన జైపాల్ యాదవ్ ఎవరెవరి ఫోన్‌లు ట్యాప్ చేయించారు.. ఈ కేసులో జైపాల్ యాదవ్ పాత్రపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. ఓ వివాదం విషయమై అప్పటి అదనపు ఎస్పి తిరుపతన్నకు తాను రెండు ఫోన్ నెంబర్లు ఇచ్చానని... ఆ నెంబర్లను ట్యాపింగ్ చేసిన సంగతి తనకు తెలియదని జైపాల్ యాదవ్ అన్నారు. రెండు కుటుంబాల మధ్య విభేదాల కారణంగా రెండు నెంబర్లు ఇచ్చినట్లు దర్యాప్తు అధికారులకు జైపాల్ యాదవ్ వివరించారు. జైపాల్ యాదవ్ వాంగ్మూలాన్ని వీడియో రికార్డింగ్ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఓ వివాదం పరిష్కారం కోసం తాను తిరుపతన్నను కలిశానని తెలిపారు. ఆయన కూడా తమ సామాజిక వర్గానికి చెందిన వాడేనని, అందుకే కలిసినట్లు చెప్పారు. రెండు కుటుంబాల మధ్య విభేదాల నేపథ్యంలో వారి ఇద్దరి నెంబర్లు తాను తిరుపతన్నకు ఇచ్చానని వెల్లడించారు. తిరుపతన్న ద్వారా ఫోన్ ట్యాపింగ్ చేయించాననే ఆరోపణలతో పోలీసులు తనకు నోటీసులు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కేసులో విచారణకు ఎప్పుడు పిలిచినా తాను సహకరిస్తానన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న స్పెషల్ ఇంటెలిజెన్స్ బ్యూరో (ఎస్ఐబి) చీఫ్ ప్రభాకర్‌రావు అమెరికాలో ఉన్నారు. ఆయనను రప్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తోంది. కాగా, ఈ కేసులో ఇప్పటికే అరెస్ట్ అయిన నలుగురి కాల్ డేటాలు విశ్లేషిస్తున్న పోలీసులు అందులోని వివరాల ఆధారంగా ఒక్కొక్కరికీ నోటీసులు ఇస్తూ విచారిస్తున్నారు.

**త్వరలో అరెస్టుల పర్వం...**

ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇప్పటి వరకు పోలీసు అధికారులను అరెస్టు చేసిన అధికారులు త్వరలో రాజకీయ నేతలను అరెస్టు చేయనున్నారు. మాజీ ఎంఎల్‌ఎలు లింగయ్య, జైపాల్ యాదవ్‌లను విచారించిన అధికారులు త్వరలో మరికొంత మంది మాజీ ఎంఎల్‌ఎలతో పాటు మాజీ మంత్రులను కూడా విచారించనున్నారు. ఈ కేసులో ఎవరోఒకరు అప్రూవర్‌గా మారే అవకాశాలు లేకపోలేదు. అప్రూవర్‌గా మారిన వారి వాంగ్మూలం మేరకు త్వరలో అరెస్టులు జరిగే అవకాశాలు ఉన్నాయి. సాధారణంగా ఈ కేసులో నోటీసులు రాగానే న్యాయనిపుణుల సలహా తీసుకునేందుకు విచారణకు ఆలస్యంగా హాజరవుతారు. అయితే అందుకు భినంగా నోటీసులు అందుకున్న వెంటనే జైపాల్ యాదవ్ విచారణకు హాజరు కావడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది.

## భారమవుతున్న సాగు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టుబడి గణనీయంగా పెరగగా అదే సమయంలో దిగుబడులు తగ్గుతున్నాయి. పెట్టుబడికి అనుగుణంగా దిగుబడులు రాక రైతులు ప్రతి యేటా నష్టపోతున్నారు. అతివృష్టి, అనావృష్టి, తెగుళ్ల దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. గతేడాది ఖమ్మంజిల్లాలో పత్తి సగటు దిగుబడి ఎనిమిది నుంచి 10 క్వింటాళ్లు రాగా ఏడాది నాలుగు క్వింటాళ్లకు మించి లేదు. ఈ ఏడాది వరి దిగుబడులు ఫర్వాలేదనిపించిన పెట్టుబడులు మాత్రం విపరీతంగా పెరిగాయి. దీనికి తోడు ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర లభించక పోగా బోనస్‌పై రైతులకు ఆశలు చచ్చిపోతున్నాయి. పాలక వర్గాలు వ్యవసాయ రంగాన్ని ఆదుకోకపోవడం, మోడీ ప్రభుత్వం వ్యవసాయ రంగ సబ్సిడీలను ఎత్తివేయడం, రసాయనిక ఎరువులు, పురుగు మందుల ధరలపై నియంత్రణ లేకపోవడం రైతులు ఈ దుస్థితికి చేరేందుకు కారణమవుతుంది. ఈ ఏడాది పత్తి క్వింటాకు రూ.7521 నిర్ణయించగా ఏ ఒక్క రైతు వద్ద ఈ మద్దతు ధరకు కొనుగోలు చేసిన దాఖలాలు లేవు. కనీస మద్దతు ధర అంటే ఆ ధరకు మించి కొనాలి కానీ అసలు ఆ ధరకు కూడా కొనుగోలు చేసే పరిస్థితి లేదు. కాటన్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఖమ్మంజిల్లాలో ఒక్క శాతం పత్తిని కూడా రూ.7521 చొప్పున కొనుగోలు చేయలేదంటే అతిశయోక్తి కాదు. ధాన్యానికి క్వింటా ఏగ్రేడ్ రకం రూ. 2320 నిర్ణయించగా బి గ్రేడ్‌ను రూ.2300లుగా నిర్ణయించారు. కానీ ఇది కూడా ఎక్కడ అమలు కావడం లేదు. నూటికి 65 శాతం మంది ఆధారపడి పనిచేస్తున్న వ్యవసాయ రంగాన్ని ఇప్పటికైనా పరిశ్రమగా గుర్తించి ప్రోత్సహకాలు అందిస్తే తప్ప వ్యవసాయ రంగం ఈ సంక్షోభం నుంచి బయటపడే పరిస్థితి లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో రైతనే వాడు కనపడని విపత్కర పరిస్థితి చోటు చేసుకునే అవకాశం ఉంది.

## అగ్నిప్రమాదం (మొదటి పేజీ తరువాయి)

పిల్లల బెడ్లు, ఇతర సామాగ్రి అగ్నికి ఆహుతయ్యాయి. అటు చిన్నారుల మృతితో ఆస్పత్రి ప్రాంగణంలో కన్నవారి రోదనలు మిన్నంటాయి. ఘటన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం శనివారం మృతి చెందిన చిన్నారుల తల్లిదండ్రులకు ఒక్కక్కొరి చొప్పున రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. ఘటనపై మూడంచల దర్యాప్తునకు ఆదేశించింది. మహారాణి లక్ష్మీ బాయి వైద్య కళాశాలలో జరిగిన అగ్నిప్రమాదంలో నవజాత శిశువుల మరణ వార్త బాధాకరమని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము అన్నారు. గాయపడిన చిన్నారులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు ఎక్స్ వేదికగా రాష్ట్రపతి సంతాపం ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీ మృతులకు సంతాపం తెలిపారు. వారి కుటుంబాలకు ఒక్కొక్కరి చొప్పున రూ. 2 లక్షల సహాయాన్ని ప్రకటించారు. కాగా, ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ రీజియన్‌లో అతి పెద్ద ఆసుపత్రుల్లో ఒకటైన మహారాణి లక్ష్మీ బాయి మెడికల్ కాలేజీలోని నియోనాటల్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఎన్ఐసియు)లో శుక్రవారం రాత్రి మంటలు చెలరేగినట్లు జిల్లా మేజిస్ట్రేట్ అవినాశ్ కుమార్ తెలిపారు. విద్యుదాఘాతం వల్లే మంటలు చలేరేగాయని భావిస్తున్నామన్నారు. ప్రమాదం సమయంలో ఎన్ఐసియులో, వెలుపల భాగంలో ఉన్న చిన్నారులను సురక్షితంగా కాపాడారు. ఘటన పట్ల ముఖ్యమంత్రి ఆదిత్యనాథ్ యోగి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. సిఎం ఆదేశాల మేరకు మృతి చెందిన శిశువుల తల్లిదండ్రులకు ఒక్కొక్కరి చొప్పున రూ. 5 లక్షలు, గాయపడిన వారి కుటుంబాలకు రూ. 50 వేల చెప్పున సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఇవ్వనున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. 12 గంటల్లో ఘటనపై నివేదిక అందించాలని సిఎం ఝాన్సీ డివిజనల్ కమిషనర్, డిప్యూటీ ఐజిలను ఆదేశించారు. ప్రయోగ్‌రాజ్ లోని ఫల్పూర్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఉన్న సిఎం మాట్లాడుతూ విద్యుదాఘాతం వల్లే మంటలు వచ్చాయన్నారు. అనేకమంది చిన్నారులను కాపాడామని, శుక్రవారం రాత్రంతా సహాయక చర్యల్లో నిమగ్నమైన అధికారులతో ఎప్పటికప్పుడు సమాచారం అడిగి తెలుసుకుంటున్నామన్నారు. కాగా, అగ్నిప్రమాదం సమాచారం అందిన వెంటనే సిఎం, డిప్యూటీ సిఎం బ్రిజేష్ పతాక్, ఆరోగ్యశాఖ ప్రిన్స్‌పల్ సెక్రటరీ హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకున్నట్లు ప్రభుత్వం ఒక ప్రకటనలో తెలిపింది. మెడికల్ కాలేజీలోని మరో వార్డులో 12 మంది చిన్నారులు చికిత్స పొందుతున్నారని పతాక్ పిటిఐకి చెప్పారు. మంటల్లో చిక్కుకుని సజీవదహనమైన చిన్నారుల్లో మూడు, నాలుగు రోజుల వయస్సున్న చిన్నారులు కూడా ఉన్నారన్నారు. ఈ కేసులో దోషులగా తేలిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఘటనపై మూడంచల దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేసినట్లు డిప్యూటీ సిఎం ఎక్స్‌లో తెలిపారు. ఝాన్సీ డివిజన్ కమిషనర్, డిఐజికి ఈ అంశంపై విచారణ చేయాలని చెప్పామని, ఇదే కాకుండా మేజిస్టీరియల్ విచారణ చేట్టాలని కూడా ఆదేశాలు ఇచ్చామన్నారు. అదే విధంగా మంటల్లో గాయడిన చిన్నారుల కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని హామీనిచ్చినట్లు, బాధిత తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడానని పతాక్ ఎక్స్‌లో పేర్కొన్నారు. కాగా, మంటల్లో చిక్కుకుని మృతి చెందిన నవజాత శిశువులను గుర్తించేందుకు అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని పతాక్ మీడియాతో చెప్పారు. ఘటనగల కచ్చితమైన కారణాలను కనుగొంటామని, ఎవరి నిర్లక్ష్యం వల్లే జరిగిందో కూడా తెలుసుకుంటామన్నారు. క్షతగాత్ర చిన్నారులకు మెరుగైన చికిత్స అందించడమే తొలి ప్రాధాన్యమన్నారు. మహారాణి లక్ష్మీ బాయి మెడికల్ కాలేజీ ప్రిన్స్‌పల్ డాక్టర్ నరేంద్ర సెంగార్ మాట్లాడుతూ ప్రమాదంలో 16 మంది చిన్నారులకు ఎలాంటి హాని జరగలేదని, కానీ వారిని చికిత్స కోసం ఎన్ఐసియు వార్డులో చేర్చి జాగ్రత్తగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అయితే శనివారం ఉదయం ఎస్ఎస్‌పి సుధా సింగ్ మీడియాతో మాట్లాడుతూ 16 మంది చిన్నారులు గాయపడ్డారని, వారికి చికిత్స అందిస్తున్నారని, ప్రాణాలు కాపాడేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నట్లు చెప్పడం గమనార్హం. ఇదిలా ఉండగా, ప్రమాదం తరువాత కొంతమంది తల్లిదండ్రులు వారి చిన్నారులను ఇళ్లకు తీసుకువెళ్లినట్లు సమాచారం ఉందని, ఎన్ఐసియులో ఉన్న చిన్నారుల సంఖ్యను గుర్తించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారన్నారు.

## మళ్లీ రక్తసిక్తం

(మొదటి పేజీ తరువాయి)

లభ్యమైనట్లు ఆ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు వెల్లడించారు. తప్పించుకున్న మావోయిస్టుల కోసం ముమ్మర గాలింపు చర్యలు జరుగుతున్నాయని తెలిపారు. సంఘటనా స్థలం వద్ద మందుగుండి సామాగ్రితో పాటు విప్లవ సాహిత్యం సైతం లభ్యమైంది. బస్తర్ టవీ రేంజ్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో ఇప్పటి వరకు జరిగిన ఎన్ కౌంటర్లలో 197 మంది మావోయిస్టులు మృతి చెందారు.

హై అలెర్ట్ /// ఎన్ కౌంటర్ తర్వాత మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ నుండి తెలంగాణ రాష్ట్రంలోని అటవీ ప్రాంతాల్లోకి చొరబడే అవకాశం ఉన్న నేపథ్యంలో పెద్ద ఎత్తున సరిహద్దుల్లో అలెర్ట్ ప్రకటించారు. అటవీ ప్రాంతాల నుండి ప్రధాన రహదారికి చేరుకునే కచ్చా దార్లపై నిఘా పెట్టారు. గోదావరి ఫెర్రీ పాయింట్ల వద్ద నిఘా కట్టుదిట్టం చేశారు. వచ్చిపోయే వాహనాలకు సోదాలు చేస్తూ ఆరా తీస్తున్నారు. ఇదిలా ఉండగా 2026 మార్చి 31 నాటికి మావోయిస్టు పార్టీయే లేకుండా అంతం చేస్తామని కేంద్ర హోం మంత్రి అమీత్‌షా ఇప్పటికే పలుమార్లు ప్రకటన చేశారు. ఇందులో భాగంగా ఛత్తీస్‌గఢ్ దండకారణ్యాన్ని భద్రతా బలగాలు పూర్తిగా ఆదీనంలోనికి తీసుకుంటున్నారు. ఆపరేషన్ కగార్‌లో భాగంగా చోటు చేసుకుంటున్న వరసు ఎన్‌కౌంటర్లతో ఆ ప్రాంతం అట్టుడికిపోతోంది. మావోయిస్టు పార్టీ ఈ ఏడాది ఇప్పటి వరకు 197 మందిని కోల్పోగా, వేర్వేరు సందర్భాల్లో పెద్ద ఎత్తున లొంగిపోతున్నారు. చోటు చేసుకుంటున్న ఎన్‌కౌంటర్ల నేపథ్యంలో దండకారణ్యంలోని గిరిజన గ్రామాలు బిక్కుబిక్కుమంటూ ఒణికిపోతున్నాయి. ఏ క్షణం ఏమి జరుగుతుందో తెలియక ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని కాలం వెల్లదీస్తున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటికే పూంపర్తి ఏరియాలో కేంద్ర హోంశాఖ బెటాలియన్ ఏర్పాటు చేసింది. బస్తర్ అటవీ రేంజ్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉన్న మావోయిస్టుల స్థూపాలను ప్రొక్లైనర్ల సహాయంతో కేంద్ర బలగాలు కూల్చేస్తున్నాయి.



## సేవల ఫలితంగానే సిపిఐకి ప్రజాదరణ

* ప్రతి సమస్యకు పరిష్కారం చూపేవరకూ విశ్రమించను
* కొత్తగూడెం ఎంఎల్ఎ కూనంనేని సమక్షంలో సిపిఐలో 100 కుటుంబాలు చేరిక

**ప్రజాపక్షం/పాల్వంచ/లక్ష్మీ దేవిపల్లి:** ప్రజాక్షేతరంలో ఉంటూ అన్ని వర్గాల ప్రజలకు అందిస్తున్న సేవల ఫలితంగానే సిపిఐకి రోజురోజుకు జనాదరణ పెరుగుతోందని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణ పరిధిలోని కరకవాగు(బంజారా కాలనీ)లో జరిగిన ఆత్మీయ సమ్మేళన సభ జరిగింది. ఈ సభ సందర్భంగా బంజారా కాలనీకి చెందిన వంద కుటుంబాలు బోడ బీమా నాయక్, బట్టు రాం దాస్ నాయక్, శ్రీనివాస్, బానోతు దివ్య, బానోత్ స్వామి నేతృత్వంలో కూనంనేని సమక్షంలో చేరాయి. లక్ష్మీ దేవిపల్లి మండలం గట్టుమల, మైలారం ఏజెన్సీ గ్రామాల నుంచి 50 కుటుంబాల వారు సిపిఐలో చేరారు. వీరికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ గడిచిన పదకుండు నెలలుగా నియోజకవర్గ అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేశానని అన్నారు. ప్రజల మౌళిక అవసరాలైన త్రాగునీరు, వైద్యం, రహదారుల సౌకర్యం వంటివి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రభుత్వంపై వత్తిడి తెస్తున్నాన్నారు. పార్టీలో చేరుతున్న వారు సిపిఐ, అనుబంధ ప్రజా సంఘాల బాధ్యతలు తీసుకొని ప్రజా సమస్యల పరిష్కరం కోసం కృషి చేయాలన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల ను గుర్తించి అవసరమైతే పోరాటాలు నిర్వహించాలని సూచించారు. కార్యకర్త లు పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ ఈ దేశంలో 100 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, డిసెంబర్ 26నాటికి పార్టీ వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంలో గ్రామ గ్రామాన వందేళ్ల ఉత్సవాలు ఘనంగా నిర్వహించి, పార్టీ చరిత్రను , త్యాగాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి గ్రామం, బస్తీలో ఉత్సవాలు ఘనంగా జరిగేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. తాడిత పీడిత ప్రజల పక్షాన భూమి భుక్తి కోసం అనేక పోరాటాలు నిర్వహించిన పేదలకు వేల ఎకరాల భూమిని పంచిన చరిత్ర సిపిఐకి ఉందని, పేద ప్రజల కోసం ప్రజా పోరాటాల్లో ప్రాణాలర్పించిన అమరవీరుల ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కంకణభర్దులు కావాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందరరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, వీ పద్మజ, ఏఐటియూసి నాయకులు అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్, వై వెంకట్రామయ్య, మన్నెం వెంకన్న, ఎస్‌కే రెహమాన్, కరీం, జకరయ్య, సత్యనారాయణ, వైఎస్ గిరి, వేములపల్లి శేఖర్, మాజీ సర్పంచ్ భూక్యా విజయ్, మాజీ ఎంపిటిసి ఉంద్రాతి రవి, మాజీ కౌన్సిలర్ చెన్నయ్య, కొంగర అప్పారావు, బాణోత్ రంజిత్, సాయిలు శ్రీను, శ్రీనివాసరావు, వెంకన్న, రేగు కృష్ణమూర్తి, రాము, కృష్ణ, ఆదినారాయణ, ఎస్‌కే లాల్ పాషా, గురుమూర్తి, చంద్రశేఖర్, రాందాస్, ఎస్‌కే కసీం, విజయ్‌కుమార్, అల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నల్లగొండపై మరిన్ని పరిశోధనలు

## జిల్లా చరిత్రలతో రాష్ట్ర సమగ్ర స్వరూప పుస్తకాన్ని ఆవిష్కరించిన చైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** నల్లగొండపై మరిన్ని పరిశోదనలు రావాలని జిల్లా చరిత్రల్లోనే రాష్ట్ర సమగ్ర స్వరూపం ఆవిష్కృతం అవుతుందని తెలంగాణ మీడియా అకాడమి చైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శనివారం నాగార్జున ప్రభుత్వ కళాశాలలో నల్లగొండ జిల్లా సమగ్ర స్వరూపం పుస్తకా విష్కరణ జరిగింది. పుస్తకాన్ని ఆవిష్కరించిన శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సారస్వత పరిషత్ 33 జిల్లాల సమగ్ర సర్వస్వాన్ని వెలువరించడం అభినందనీయమని అన్నారు. జిల్లా సాంస్కృతిక, సాహిత్య, ఆర్థిక, రాజకీయ చరిత్రను తెలుసుకోవడానికి ఈ గ్రంథం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. నల్లగొండ పేరు ఎలా వచ్చిందో ఇప్పటి తరానికి తెలియాలంటే ఇలాంటి పుస్తకాలు పఠించాలని సూచించారు. గతంలో అనేక మంది వ్యక్తులు, సంస్థలపై కొన్ని జిల్లాలలో సారస్వాలు వచ్చినప్పటికీ తెలంగాణ సారస్వత పరిషత్ రూపొందించిన నల్లగొండ జిల్లా స్వరూపం సమగ్రంతో కూడుకొని ఉందని ,తెలంగాణ సారస్వత నల్లగొండ తీసుకు వచ్చిన ఈ గ్రంథంలో అన్ని అంశాలను పొందుపరిచారని భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన తెలంగాణ సారస్వత పరిషత్‌ను అభినందించారు.

సభాధ్యక్షులు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి మాట్లాడుతూ 33 జిల్లాల సమగ్ర స్వరూపం నేటి తరానికి అందించాలనే సంకల్పం మేరకు తెలంగాణ సారస్వత పరిషత్ ఈ పుస్తక ప్రచురణ చేపట్టిందని తెలిపారు. అన్ని జిల్లాల కలెక్టర్లు పుస్తకాన్ని కొనుగోలు చేయడానికి ముందుకు వస్తే జిల్లాలోని అన్ని పాఠశాలలకు, జూనియర్ కళాశాలలకు ఈ పుస్తకాలు చేరుతాయని అన్నారు. దీని కోసం పరిషత్ డిస్కౌంట్ కూడా ఇస్తుందని అన్నారు. వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య సూర్యా ధనుంజయ్ మాట్లాడుతూ ఒక పుస్తకం ప్రచురించాలంటే ఎన్నో పురిటి నొప్పులు పడాలని అలాంటిది 33 జిల్లాల సమగ్ర స్వరూపాలు తీసుకురావడం సాధారణ విషయం కాదని అన్నారు. ఇలాంటి గొప్ప సాహిత్య సేవను చేస్తున్న తెలంగాణ సారస్వత పరిషత్ కృషిని ఆమె అభినందించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షులు డాక్టర్ సాగి కమలాకర శర్మ మాట్లాడుతూ ఈ పుస్తకం పోటీ పరీక్షలకు కూడా ఉపయుక్తమని అన్నారు. నల్లగొండ జిల్లాలో ఎన్నో చారిత్రిక, సాంస్కృతిక కట్టడాలు, గ్రంథా లు, వ్యక్తులు ఉన్నారని వారందరి గురించి తెలుసుకోవడానికి ఈ సర్వస్వం దోహద పడుతుందని అన్నారు. తెలంగాణ సారస్వత పరిషత్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జుర్రు చెన్నయ్య మాట్లాడుతూ ఈ గ్రంథం ఎంతో మంది నల్లగొండ సాహితీ వేత్తలు కలిసి రూపొందించిన గ్రంథమని పాఠకులు ఆదరించాలని కోరారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ శ్రీరంగాచార్య మాట్లాడుతూ తాను మహబూబ్ నగర్ లో నివసిస్తున్నా ఈ జిల్లాలో పుట్టినందుకు ఈ జిల్లా సమాచారంతో ఎన్నో గ్రంథాలు వెలువరించానని అన్నారు.

నేటి తరాలు తనను గుర్తించడం లేదని ఆవేదన చెందారు. నాగార్జున ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ఉపేందర్ మాట్లాడుతూ నల్లగొండ జిల్లా సమగ్ర స్వరూపం లాంటి బృహత్తర గ్రంథం తమ కళాశాలలో ఆవిష్కరించడం గర్వకారణమని అన్నారు. కార్యక్రమ అనంతరం వ్యాసకర్తలను దుశ్శాలువాతో సన్మానించి, పుస్తకాన్ని బహుకరించారు.

కార్యక్రమంలో సమాచారశాఖ సంయుక్త సంచాలకులు కన్నెగంటి వెంకట రమణ, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ వెల్దండి శ్రీధర్, గ్రంథ రచనా కోర్ కమిటీ సభ్యులు డాక్టర్ భిన్నూరి మనోహరి, డాక్టర్ తందు కృష్ణ కౌండిన్య, డాక్టర్ బండారు సుజాతా శేఖర్, పున్న అంజయ్య, డాక్టర్ సాగర్ల సత్తయ్య, సాహితీవేత్తలు డాక్టర్ సుంకిరెడ్డి నారాయణ రెడ్డి,భూతం ముత్యాలు లవేందర్ రెడ్డి, కందుకూరి దుర్గాప్రసాద్, డాక్టర్ పురుషోత్తమాచార్య, మేరెడ్డి యాదగిరి రెడ్డి, పెరుమాళ్ళ ఆనంద్, డాక్టర్ ఉప్పల పద్మ, అధ్యాపకులు విద్యార్థినీ, విద్యార్థులు తదితర సాహితీ వేత్తలు పాల్గొన్నారు.



## నవచేతన పుస్తక ప్రదర్శన సందర్శించిన గ్రంథాలయ సంస్థ చైర్మన్

**ప్రజాపక్షం/హనుమకొండ :** జాతీయ పుస్తక వారోత్సవాలను పురస్కరించుకుని హనుమకొండ అశోకా కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన నవచేతన పుస్తక ప్రదర్శనను శనివారం రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి రియాజ్ సందర్శించారు. ఈ సందర్భంగా నవచేతన పబ్లిషింగ్ హౌస్ ప్రచురించిన సుంకిరెడ్డి నారాయణ రెడ్డి రచించిన తెలంగాణ చరిత్ర పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అలాగే ప్రముఖ న్యాయవాది ఏరుకొండ జయశంకర్ రచించిన చెదిరిన స్వప్నం రాజీవ్ పుస్తకాన్ని జయశంకర్ తో కలిసి విడుదల చేశారు. అనంతరం గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ రియాజ్ మాట్లాడుతూ పుస్తక పఠనం ద్వారానే మెరుగైన సమాజ నిర్మాణం సాధ్యపడుతుందని, ప్రతి ఒక్కరూ పుస్తక పఠనం పెంపొందించుకోవాలని అన్నారు.

ప్రతి సంవత్సరం నవచేతన సంస్థ హనుమకొండలో పుస్తక ప్రదర్శనను నిర్వహించడం, ఎంతోమంది ప్రముఖుల రచనలను అందుబాటులో ఉంచడం అభినందించదగిన విషయమని అన్నారు. నవచేతన బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు మాట్లాడుతూ ఈ నెలాఖరు వరకు జరుగనున్న ఈ పుస్తక ప్రదర్శనలో అన్ని రకాల పుస్తకాలపై 10 నుండి 30 శాతం ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి వరంగల్ జిల్లాలోని విద్యాసంస్థలు, గ్రంథాలయాలు, పుస్తక ప్రియులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, న్యాయవాది ఏరుకొండ జయశంకర్, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, బుక్ హౌస్ మేనేజర్ ఎర్ర నాగరాజు, సిబ్బంది తాండూరు గోపి, అకినపల్లి రమేశ్, టి. సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయాలి

## తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ




**ప్రజాపక్షం/కరీంనగర్ ప్రతినిధి:** జనగణన, నియోజకవర్గాల పునర్విభజనలతో సంబంధం లేకుండా మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ, ఎన్ఎఫ్ఐడబ్ల్యూ తెలంగాణ వర్కింగ్ ప్రెసిడెంట్ డా.మంద సదాలక్ష్మిలు డిమాండ్ చేశారు. భారత జాతీయ మహిళా సమా ఖ్య కరీంనగర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కిన్నెర మల్లవ్వ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో పశ్య పద్మ, డాక్టర్ సదాలక్ష్మి, కొట్టె అంజలి, గరిగె శారదలు మాట్లాడారు. మహిళలకు రాష్ట్ర శాసనసభ ల్లో, పార్లమెంటు ఉభయ సభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని భారతదేశ మహిళలు 27 సంవత్సరాలకు పైగా పోరాడి సాధించుకున్నారన్నారు. కేంద్ర బిజెపి పాలకుల నిర్లక్ష్యాన్ని సవాల్ చేస్తూ భారత జాతీయ మహిళా సమాఖ్య సుప్రీం కోర్టులో కేసు నమోదు చేసిందన్నారు. దేశవ్యాప్త మహిళా ఉద్యమాలు పోరాటాలు, పాలకులపై ఉంచిన ఒత్తిడి, సుప్రీం కోర్టులో నమోదైన కేసు ప్రభావం పార్లమెంటులో చట్టం చేయక తప్పని పరిస్థితి ఏర్పడిందన్నారు. మహిళా రిజర్వేషన్ల చట్టం 2023ను అమలు చేయడానికి కేంద్ర పాలకులు జనగణన, నియోజకవర్గాల పునర్విభజన చేయాలంటూ కుంటి సాకులు చెబుతున్నారని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్ల చట్టం 2023 అమలుచేయడంలో కేంద్ర పాలకులు పెట్టిన రెండు షరతులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశ ప్రారంభంలో భారత జాతీయ మహిళా సమాఖ్య జెండాను డాక్టర్ సదాలక్ష్మి ఎగురవేశారు. కేంద్ర పాలకులు పెట్టిన షరతులను తొలగించేంత వరకు పోరాటాలను ఉధృతం చేయాలని డాక్టర్ సదాలక్ష్మి మహిళా లోకానికి పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి మహిళలను సమీకరించుకుని ఉద్యమాలకు పోరాటాలకు సిద్ధమైతేనే పాలకులపై ఒత్తిడిని పెంచగలుగుతామని శాసనసభల్లో పార్లమెంటు ఉభయ సభలలో 50 శాతం మహిళా రిజర్వేషన్లను ఆచరణలో అమలు చేయించుకోగలుగుతామ ని అన్నారు. సెమినార్ అనంతరం జరిగిన నిర్మాణ కౌన్సిల్ సమావేశం లో 9 మండలాల నుంచి పాల్గొన్న నాయకులు, మహిళా సమాఖ్య సభ్యత్వం, గ్రామ మండల కమిటీల ఏర్పాటు గురించి చర్చించారు. జిల్లా అధ్యక్షురాలు కిన్నెర మల్లవ్వ మాట్లాడుతూ ఇప్పటికే మండలాల కమిటీలను ఏర్పాటు చేసినట్లు, సభ్యత్వాన్ని పూర్తి చేయడానికి కార్యక్రమంపై మాట్లాడారు. జిల్లా కమిటీలోకి నూతనంగా కమిటీ సభ్యులను తీసుకోవడం జరిగిందన్నారు. గత కమిటీలో ఉన్న అధ్యక్ష కార్యదర్శులతో పాటు శారదను జిల్లా కార్యదర్శిగా, పట్టణ కార్యదర్శిగా ఎలిసెట్టి స్వప్న ను ఎన్నుకోవ డం జరిగింది. డిసెంబర్ 14,15 తేదీలలో జిల్లా మహిళా సమాఖ్య రాజకీయ శిక్షణ తరగతులను కరీంనగర్‌లో నిర్వహించడానికి నిర్ణయం తీసుకోవడం జరిగిందన్నారు. సమావేశంలో లక్ష్మి , వంకాయ లక్ష్మి , స్వరూప, సుగుణ, రాజేశ్వరి, శారద, పద్మలతో పాటు దాదాపు 100 మంది మహిళలు తదితరులున్నారు.

## లగచర్లలో గ్రీన్ ఫార్మా పేరిట ప్రజలను తప్పదోవ పట్టిస్తున్న కెటిఆర్

### చరణ్ కౌశిక్ యాదవ్, డాక్టర్ లింగం యాదవ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లగచర్లలో గ్రీన్ ఫార్మా ఏర్పాటు చేస్తున్నారని కెటిఆర్ ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నారని టిపిసిసి ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ అన్నారు. గాంధీ భవన్‌లో శనివారం ఆయన టిపిసిసి అధికార ప్రతినిధి డాక్టర్ లింగం గౌడ్‌తో కలిసి మాట్లాడారు. కొడంగల్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతులతో మాట్లాడలేదు అని కెటిఆర్ అంటున్నాడని, ఇప్పటి వరకు 30 సార్లు సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడారన్నారు. లగచర్లలో గ్రీన్ ఫార్మా ఏర్పాటు చేస్తున్నారని కెటిఆర్ ప్రజలను తప్పదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. కేవలం అక్కడ ఏర్పాటు చేసేది ఇండస్ట్రియల్ పార్క్ మాత్రమే అన్నారు. రైతులకు ఎకరాకు 40 లక్షల పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందని కౌశిక్ యాదవ్ తెలిపారు. డాక్ట ర్ లింగం యాదవ్ మాట్లాడుతూ కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మూసీలో ఒక్కరోజు నిద్ర పోతానని అంటుండని, ఒక్కరోజు నిద్ర మాత్రమే కాదు ఉదయం లేచి మూసీ నీళ్లతో స్నానం కూడా చేయాలని కోరారు. రూ.7వేల కోట్లతో గంగానదిని శుద్ధి చేస్తున్న మోదీ మూసీ ఏమి పాపంచేసిందో బిజెపి నేతలు చెప్పాలన్నారు. మూసీ అభివృద్ధికి రూ. 7వేల కోట్లు తెచ్చే దమ్ము కిషన్ రెడ్డికి ఉందా? అని ప్రశ్నించారు. విభజన చట్టంలోని హామీలను ఇప్పటి వరకు అమలు చేయలేని అసమర్థ పాలనసాగిస్తున్న కేంద్రంలోని ప్రభుత్వమని విమర్శించారు. లగచర్లలో ముందస్తు ప్రణాళిక ప్రకార మై కలెక్టర్‌పై దాడి జరిగిందన్నారు. చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని, ప్రభుత్వాన్ని అస్థిర పరచాలని చూస్తే చట్టం ప్రకారం శిక్ష తప్పదని హెచ్చరించారు. అభివృద్ధి వికేంద్రీకరణలో భాగంగానే లగచర్లలో ఇండస్ట్రియల్ పార్క్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేయనుందన్నారు.





## జిఎస్‌టి పేరుతో సామాన్యప్రజల నడ్డివిరుస్తున్న నరేంద్రమోదీ ప్రభుత్వం

### సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు చాడవెంకటరెడ్డి

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌టౌన్ :** దేశంలో బిజెపి ప్రభుత్వం 2017లో జీఎస్టి ట్యాక్స్ విధానం తీసుకొచ్చి సామాన్యప్రజల నడ్డివిరుస్తోంది. పెట్రోల్, డిజిల్ ఇందన విషయంలో జీఎస్టి పన్ను విధించకుండా సామాన్యప్రజలమీద ఆర్థిక భారం మోపుతున్నారని చాడ విమర్శించారు. నాగర్‌కర్నూల్ నియోజకవర్గం తెలకపల్లి మండలం గౌరెడ్డిపల్లి గ్రామంలో ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎం.పర్వతరెడ్డివారి తల్లిమాడుగుల కౌసల్య దశదినకర్మ కార్యక్రమంలో సిపిఐజాతీయ కార్యదర్శివర్గ సభ్యులు చాడవెంకటరెడ్డి పాల్గొని నివాళులర్పించారు. వారితో పాటు సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా, ఎస్‌టియు ప్రధాన కార్యదర్శి సదానందగౌడ్, ఎస్‌టియు మాజీకార్యదర్శి కరుణాకర్‌రెడ్డి, సిపిఐ రాష్ట్రసమితి నాయకులు హెచ్.ఆనంద్‌జి, వార్లవెంకటయ్య పాల్గొన్నారు. అనంతరం సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యులు చాడవెంకటరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వ పన్ను కేంద్రప్రభుత్వ పన్నుపేరు మీద సామాన్యప్రజలకు ఇందనభారంపడే విధంగా ప్రవేశపెట్టిందన్నారు. జమిలి ఎన్నికలు రావాలని బిజెపిప్రభుత్వం కోరుకుంటుందని ఒకేదేశం ఒకే ఎన్నికలు ఉండాలని అదేవిధంగా పన్ను విధానంకూడా ఒకేవిధంగా ఉండాలన్నారు. ఈదేశంలో కులతత్వాన్ని, మతోన్మాదాన్ని సృష్టిస్తుందని వారు విమర్శించారు. ప్రధానమంత్రి నరేంద్రమోడి ప్రపంచంలో మూడో ధనికదేశంగా నిలుపుతానని ప్రగల్భాలు పలుకుతున్నారని ఈదేశంలో నేటికి మహిళలమీద అత్యాచారాలు జరుగుతున్నాయని వాటిని అరికట్టే విషయంలో పూర్తిగా విఫలమవుతున్నారని విమర్శించారు. తెలంగాణలో టిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో నిరుద్యోగ సమస్య ఉన్నందునే ఆ ప్రభుత్వాన్ని ప్రజలు గద్దెదించారని అన్నారు. టిఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యంవలనే కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడిందన్నారు. ఈప్రభుత్వంకూడా సామాన్యప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలుపర్చకపోతే మాపార్టీ తరపున పోరాటం చేస్తామని అన్నారు. ఈప్రభుత్వం ప్రజలకు పక్కా ఇల్లుకాని రుణమాఫీ అమలుచేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటువంటి సంక్షేమ పథకాలన్నీ అమలుపర్చాలని గతప్రభుత్వంలో అనేకమంది సర్పంచులు చేసినటువంటి పనులకు నిష్పక్ష పాతంగా బిల్స్‌అన్నింటిని మంజూరుచేయాలన్నారు. రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టులన్నింటిని పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో జిల్లాకౌన్సిల్ సభ్యులు శంకర్‌గౌడ్, శివశంకర్, తెలకపల్లి సిపిఐ మండల కార్యదర్శి రవీందర్,శంకర్, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు దేశమోని ఆంజనేయులు, జిల్లా ఉపాధ్యక్షులు కేశములశివకృష్ణ, సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నా రు.

# రాజ్యాంగ విలువలు పరిరక్షించడం న్యాయవాదుల కర్తవ్యం

## ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** నేటి ఆందోళనకర పరిస్థితుల్లో భారత దేశ రాజ్యాంగ విలువలను పరిరక్షించడం న్యాయవాదుల కర్తవ్యం అని తెలంగాణ హైకోర్టు ప్రముఖ న్యాయవాది, ఇండియన్ అసోసియేషన్ అఫ్ లాయర్స్ (ఐఎఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ అన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) గ్రేటర్ హైదరాబాద్ 7వ మహాసభలు శనివారం హైదరాబాద్ లక్డీకాపుల్‌లో ఘనంగా జరిగాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలలోని వివిధ కోర్టుల నుండి సుమారు 300 న్యాయవాదులు మహాసభకు ప్రతినిధులుగా హాజరయ్యారు. ఐఎఎల్ గ్రేటర్ హైదరాబాద్ నగర అధ్యక్షులు ఎ.వి.కృష్ణారావు అధ్యక్షత వహించగా జిల్లా మాజీ జడ్జి నడింపల్లి ఆనంద్‌రావు ముఖ్యఅతిథిగా హాజరు కాగా, బొమ్మగాని ప్రభాకర్ మహాసభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ ప్రసంగిస్తూ దేశంలోని ప్రజలకు మార్గనిర్దేశం చేసే రాజ్యాంగం ఉపోద్ఘాతం న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతోపాటు దేశ సమగ్రత కూడా నేడు ప్రమాదంలో పడిందని ఆందోళన వ్యక్తం చేసారు. రాజ్యాంగంతోపాటు ప్రజల హక్కులను రక్షించడంలో న్యాయవాదులు కీలక పాత్ర పోషిస్తూ ఆదర్శవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు. పౌరులందరికీ న్యాయం జరిగేలా, వారి హక్కులను పరిరక్షించడంలో కీలక పాత్ర పోషిస్తున్నన్యాయవాదులు బెదిరింపులు, దాడులు, వేధింపులతో సహా అనేక సవాళ్లను ఎదుర్కొంటారని, న్యాయవాదుల హక్కులు, భద్రతను పరిరక్షించడానికి న్యాయవాదుల రక్షణ చట్టం అవసరమని, తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు న్యాయవాదుల రక్షణ చట్టం అమలు చేయాలని అయన డిమాండ్ చేసారు. న్యాయవాదులకు సంక్షేమ నిధులు అందించడంతోపాటు పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. రాష్ట్రంలో టీచర్స్‌కు ఎంఎల్‌సి స్థానాలు కేటాయించినట్లుగా అడ్వొకేట్లకు కూడా ఎంఎల్‌సి స్థానాలు కేటాయించాలని బొమ్మగాని ప్రభాకర్ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు. నడింపల్లి ఆనంద్‌రావు మాట్లాడుతూ న్యాయవాద వృత్తి నిరంతరం అభివృద్ధి చెందుతోందని, సమాజంలో మార్పులు, సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పుడు కొత్త అవకాశాలతోపాటు కొత్త సవా ళ్లు కూడా పుట్టుకొస్తున్నాయని తెలిపారు. న్యాయవాదులు తమ విద్యను కొనసాగించడానికి, వారి పరిపక్వత, సమాజాన్ని అర్థం చేసుకోవడం, కేసు ల దాఖలు, వాదించడంలో మెళకువలను, వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవడానికి ప్రభు త్వం అడ్వొకేట్ ట్రైనింగ్ అకాడమీ ప్రారంభించాలని కోరారు. సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న న్యాయవాద వృత్తి గౌరవాన్ని కాపాడుకోవడానికి అన్ని వృత్తిపరమైన వ్యవహారాలలో నైతిక ప్రమాణాలకు కట్టుబడి ఉండటం, నిజాయితీ, న్యాయబద్ధత నిలబెట్టడం చాలా అవసరమని నడింపల్లి ఆనంద్ రావు పేర్కొన్నారు. మహాసభలో తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు దుస్స జనార్దన్, తెలంగాణ ఫెడరేషన్ అఫ్ బార్ అసోసియేషన్స్ అధ్యక్షులు వై.కొండల్ రెడ్డి, వివిధ కోర్టుల బార్ అసోసియేషన్ల అధ్యక్షులు పి.గోవర్దన్‌రెడ్డి (కూకట్‌పల్లి బార్ అసోసియేషన్), వి.వసంత్‌కుమార్ (సికింద్రాబాద్ బార్ అసోసియేషన్), జి.రాజవర్ధన్‌రెడ్డి (నాంపల్లి బార్ అసోసియేషన్), డి.హర్షవర్ధన్ (సిటీ సివిల్ కోర్ట్ బార్ అసోసియేషన్), మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు కెవిఎల్, ప్రధాన కార్యదర్శి డి.జయశ్రీనివాస్, సభ్యులు పి. రాములు, జి.రాజశేఖర్‌రెడ్డి, లీలాకుమారి, జి.విజయక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రాబందుల మాదిరిగా తెలంగాణను దోచుకున్న కెసిఆర్ కుటుంబం

### తుంగతుర్తి ఎంఎల్ఎ మందుల సామేల్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాబందుల మాదిరిగా కెసిఆర్ కుటుంబం పదేళ్లలో తెలంగాణను పీక్కుతిన్నారని తుంగతుర్తి ఎంఎల్‌ఎ మందుల సామెలు విమర్శించారు. తెలంగాణ రాకముందు కెసిఆర్ కుటుంబాని ఆస్తులు ఎన్ని ఇప్పుడు ఎన్ని ఆస్తులని ప్రశ్నించారు. సిఎల్‌పి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మందుల సామెలు మాట్లాడుతూ లగచర్లపై బిఆర్ఎస్ చేసిన దుర్మార్గపు చర్యలు బయటపడ్డాయని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో టిఆర్‌ఆర్ ఎక్కడున్నారని ప్రశ్నించారు. కెటిఆర్ తండ్రి చాటు పిలగాడన్నారు. తండ్రిని అడ్డుపెట్టుకుని కెటిఆర్ అరాచకం చేశారని విమర్శించారు. రాబందుల రాజ్యం కెసిఆర్ కుటుంబానిదేనని ఆరోపించారు. కెసిఆర్ కుటుంబంలో ఉన్న ఆరుగురు రాబందులేనని విమర్శించారు. కలెక్టర్‌లను మాజీ సిఎం కెసిఆర్ బానిసలుగా చేశారని దుయ్యబట్టారు. ఐఎఎస్‌లతో కాళ్లు మొక్కించుకోవడం, దాడి చేయడం బిఆర్ఎస్ నాయకుల పని అని మందుల సామెలు ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళ్లు మొక్కిన వారిని కెసిఆర్ ఎంఎల్‌సిలను చేశారన్నారు. రేవంత్ ఎక్కడ దోచుకున్నాడో చెప్పండన్నారు. తెలంగాణ పేరు మీద బిఆర్ఎస్ నాయకులు లీడర్లు అయ్యారన్నారు. రేవంత్ రెడ్డిని ఎవరు దించుతారో రండి అని, హరీశ్ రావు మేడిగడ్డ దగ్గర చాప వేసుకొని పడుకున్నాడన్నారు. బిఆర్ఎస్ తెర చినిగిపోయిందన్నారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మూసీ దగ్గర పడుకుంటే మంచిదన్నారు. బిజెపి నాయకులు మనిషికో గ్లాస్ తీసుకెళ్లి మూసీ నీళ్లను తాగాలని మందుల సామెలు ఎద్దేవా చేశారు.

## ‘తెలంగాణ సాంస్కృతిక సారథి’కి చైర్ పర్సన్‌గా డాక్టర్ వెన్నెల



**ప్రజాపక్షం / హైదరాబాద్:** ప్రముఖ ప్రజా గాయకుడు గద్దర్ కూతురు డాక్టర్ గుమ్మడి.వి.వెన్నెలను ‘తెలంగాణ సాంస్కృతిక సారథి’కి చైర్ పర్సన్‌గా రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు యూత్ అడ్వాన్స్‌మెంట్, టూరిజం, కల్చర్ డిపార్ట్‌మెంట్ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. వివిధ ప్రభుత్వ ఫ్లాగ్‌షిప్ కార్యక్రమాలు, విధానాలు, పథకాలపై సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి, తెలంగాణ ప్రత్యేక సాంస్కృతిక గుర్తింపు గురించి ప్రజల్లో అవగాహనను కల్పించడానికి ‘తెలంగాణ సాంస్కృతిక సారథి’ని ప్రత్యేక రాష్ట్ర స్థాయి సంస్థను ఏర్పాటు చేసింది.

## జార్ఖండ్‌లో మహిళా ఓటర్లే ఎక్కువ

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** జార్ఖండ్ అసెంబ్లీ మొదటి విడత ఎన్నికలలో పురుషుల కంటే మహిళా ఓటర్లు అధిక సంఖ్యలో నమోదయ్యారు. ప్రజాస్వామ్య ప్రక్రియను రూపొందించడంలో మహిళల పాత్ర అనిర్వచనీయమైన నేపథ్యంలో 43 అసెంబ్లీ నియోజక వర్గాలలోనూ 37 శాతం మహిళా ఓటర్ల సంఖ్య ఎక్కువగానే ఉంది. తొలి విడత ఎన్నికల్లో పురుష ఓటర్ల సంఖ్య 64.27 శాతం నమోదు కాగా, మహిళల సంఖ్య 69.04 శాతం నమోదు కావడం గమనార్హం. గతంలో 2019 అసెంబ్లీ ఎన్నికల్లో మహిళా ఓటర్లు పెద్ద సంఖ్యలోనే పాల్గొనడం ద్వారా పురుషులకంటే 4.8 శాతం మహిళ ఓటర్లే అధిగమించారు.

## మూసీ పునరుజ్జీవనానికి అడ్డుపడితే బుల్డోజర్లతో తొక్కించి అభివృద్ధి చేస్తాం

### కల్వ సుజాత

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మూసీ పునరుజ్జీవనాన్నిఅడ్డుకునేందుకు అడ్డం పడుకుంటామని బిఆర్‌ఎస్ నాయకులు బీరాలు పలుకుతున్నారని ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ కల్వసూజత ఎద్దేవా చేశారు. వారు అడ్డంగా పడుకున్నా, నిలువున పడుకున్నా బుల్డోజర్లతో తొక్కించి మరీ మూసీని అభివృద్ధి ని ప్రభుత్వం చేసి తీరుతుందన్నారు. మేము అడిగే ప్రశ్నలకు మీ దగ్గర సమాధానాలు ఉన్నాయా? కాంగ్రెస్ 10 నెలల పాలనపై తాము చర్చకు సిద్ధమని, బిఆర్‌ఎస్ 10 ఏళ్ల పాలనపై మాజీ మంత్రులు కెటిఆర్, హరీష్ రావులు సిద్దామా అన్ని సవాల్ విసిశారు. గాంధీభవన్‌లో శనివారం ఆమె మీడియాతో మాట్లాడుతూ 10 ఏళ్లు పాటు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ ప్రజలకు ఏమి చేయకుడా పబ్బం గడిపి ఇప్పుడు ప్రతిపక్షంలో ఉండి ప్రభుత్వంపై దాడులు చేయించడం సిగ్గుచెట్టాన్నారు. కాంగ్రె స్ ప్రభుత్వం చేపట్టిన కులగణనపై ప్రజలను రెచ్చగొట్టి సిబ్బందిని అడ్డుకుంటున్న బిఆర్‌ఎస్ నాయకులు. గతప్రభుత్వం చేపట్టిన జనగణన ఆ డేటా ఎక్కడా అన్ని ప్రశ్నించారు. కులగణన ఎక్సరే అని రాహుల్ గాంధీ అంటే, సీఎం రేవంత్ రెడ్డి ఒక అడుగు ముందుకు వేసి కులగణన ఎక్సరే ఒక్కటే కాదు, ఫుల్ బాడీ చెకప్ అని భావించి సర్వే చేపడుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ వి అగ్గిపెట్టే ఇల్లు అన్న కెసిఆర్ గత ప్రభుత్వం కట్టిన డబుల్ బెడ్ రూమ్ లు ఎక్కడికి పోయ్యాయన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, శేరిలింగంపల్లి సర్కిల్-20, ఎస్ఎల్‌పి జోన్ : జిహెచ్ఎంసి
NIT. No. 36/EE/CIR-20/SLPZ/GHMC/1/2024-25 ‘ఇ’ ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన తేది: 16.11.2024
**పని రకం:** ఇతర పనులు. **అంచనా విలువ :** రూ. 8.40 లక్షలు, **బిడ్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది మరియు సమయం:** 18.11.2024న సా.04.00గం.ల నుండి 25.11.2024న మ.01.30గం.ల వరకు. **అధికారి పేరు మరియు చిరునామా:** ఇఇ, సిఐఆర్-20, ఎస్ఎల్‌పిజెడ్, జిహెచ్ఎంసి. సెల్: 9154834248.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సర్కిల్-20, జిహెచ్ఎంసి.
DIPR R.O. No. : 6675-PP/CL/ADVT/1/2024-25, Date: 16-11-2024

**Balaji Institute of Education**
(Formerly Maheshwara College of Education)
Laknepally, Narsampet, Warangal : 7799878948
Approved by NCTE & Affiliated to KU, Warangal
Applications are invited from eligible candidates for the post of Lecturer in Pedagogy of Physical Sciences.
WANTED FACULTY for B.Ed Course
Qualification, Exp.& Salary As per KU, NCTE norms
All applicants should submit Resume, xerox copies of all certificates 2 PP size photos on or before 21.11.2024 to the above address.
Chairman-Dr. A. Rajendra Prasad Reddy

**శ్రీ కల్లప్ప సత్రం, టొబాకో బజార్, జనరల్ బజార్, సికింద్రాబాద్-3.**
బహిరంగ టెండర్ నోటీసు
శ్రీ కల్లప్ప సత్రం వారు బహిరంగ వేలం ద్వారా కమర్షియల్ షాపులను లీజుకు ఇవ్వాలని ప్రతిపాదించారు. శ్రీ కల్లప్ప సత్రం కార్యనిర్వహణాధికారి కార్యాలయంలో తేదీ: 29.11.2024 నాడు, శుక్రవారం, ఉదయం 11:00 గంటలకు శాఖాధికారుల సమక్షంలో బహిరంగ వేలం జరుగుతుందని తెలియజేయడమైనది. వేలంలో పాల్గొనేవారు రూ.10000/- డిపాజిట్ చేసి ఆపై వేలంలో పాల్గొనాలి. లీజు వ్యవధి ప్రారంభంలో (మూడు) సంవత్సరాలు. వేలంలో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న వ్యక్తులు **1వ అంతస్తు, శ్రీ కల్లప్ప సత్రం షాపింగ్ కాంప్లెక్స్, టొబాకో బజార్, జనరల్ బజార్, సికింద్రాబాద్ 3లో గల కార్యనిర్వాహక అధికారి కార్యాలయాన్ని** ఉదయం 10-30 గంటల నుండి సాయంత్రం 5-00 గంటల వరకు కార్యాలయ వేళల్లో సందర్శించవచ్చు మరియు దుకాణం యొక్క స్థానం గురించి వారికి తెలియజేయబడును. ఫోన్ నంబర్: 9848159712, 9247335109 సంప్రదించగలరు.
**షాపుల వివరాలు: 1. మొదటి అంతస్తులో** షాప్ నెం. 3-4-149/A/9 - (10ft X 20ft).
**2. మొదటి అంతస్తులో** షాప్ నెం. 3 (10ft x 20ft).
సం/- కార్యనిర్వాక అధికారి, దేవాదాయ శాఖ, శ్రీ కల్లప్ప సత్రం, టొబాకో బజార్, సికింద్రాబాద్.
DIPR R.O. No. : 6646-PP/CL/ADVT/1/2024-25, Date: 16-11-2024

# ఫోకస్

# క్రీడ

## సెబాష్ అనీష్..



నిండా నాలుగేళ్లు కూడా లేని బాలుడు అంతర్జాతీయ చెస్ సమాఖ్య 'ఫిడే' రేటెడ్ ఆటగాడిగా గుర్తింపు సంపాదించడం అద్భుతం. కోల్‌కతాకు చెందిన అనీష్ సర్కార్ 1,555 ఎలో రేటింగ్ పాయింట్లతో ఫిడే నిర్వహించే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అర్హత సంపాదించిన అనీష్ వయసు 3 సంవత్సరాల 10 నెలలు. ఇప్పటి వరకూ ఉన్న ప్రపంచ రికార్డులను అతను బద్దలు చేశాడు. 10 సంవత్సరాల 8 నెలల వయసులో, ఫిడే ఇంటర్నేషనల్ మాస్టర్ (ఐఎం)గా అవతరించిన అత్యంత పిన్న వయస్కుడిగా రికార్డు నెలకొల్పిన ఫాస్టినో ఒరో (అర్జెంటీనా) రికార్డును అనీష్ అధిగమించే రోజు ఎంతో దూరంలో లేదు. మేనమామ బహుమతిగా ఇచ్చిన చెస్ బోర్డును చూసి ఆకర్షితుడైన అనీష్ చిన్నతనంలోనే పావులను వ్యూహాత్మకంగా ముందుకు కదిలించడం నేర్చుకున్నాడు. సాధారణ బాలుడి మాదిరే అల్లరి చేసే అతను, చెస్ పట్ల అంత ఆసక్తి ప్రదర్శిస్తాడని తాము ఊహించలేదని అనీష్ తల్లి రీమా అంటున్నది. ఈ ప్రతిభను గుర్తించి, అతనిని భారత గ్రాండ్ మాస్టర్ దివ్యేందు బారువా నిర్వహించే చెస్ అకాడెమీలో చేర్చింది. అప్పటికి అతని వయసు 3 సంవత్సరాల 2 నెలలు. కేవలం ఆరు నెలల్లోనూ అనీష్ అసాధారణ ప్రతిభతో ఫిడే ప్లేయర్‌గా ఎదిగాడు. ఇంటర్నెషనల్ మాస్టర్ హోదా కోసం దూసుకెళుతున్నాడు.

## వారెవ్వా రోతష్..

భారత దేశానికి చెందిన రోతష్ చౌదరి అరుదైన రికార్డు నెలకొల్పాడు. వీపుపై 27.875 కిలోల బరువుతో, కేవలం ఒక కాలిపై బ్యాలెన్స్ చేస్తూ, గంటలో 704 పుషప్స్ చేసి ప్రపంచ రికార్డు సొంతం చేసుకున్నాడు. ఈనెల 11న రికార్డు అతని సొంతమైంది.





# టెన్నిస్ ప్రపంచ కప్ 'డేవిస్'



గ్రాండ్ శ్లామ్‌సహా అన్ని రకాల టెన్నిస్ టోర్నీల్లోనూ క్రీడాకారులు పోటీపడతారు. సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు ఉంటాయి. డేవిస్ కప్‌ను క్రీడాకారుల వ్యక్తిగత స్పర్థగా కాకుండా, వారు ప్రాతినిథ్యం వహించే దేశాల మధ్య పోటీగా నిర్వహిస్తారు. అందుకే, డేవిస్ కప్‌ను టెన్నిస్ ప్రపంచ కప్‌గా పేర్కొంటారు. పురుషులకు మాత్రమే పరిమితమైన ఈ అంతర్జాతీయ టెన్నిస్ ఈవెంట్‌ను అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటిఎఫ్) నిర్వహిస్తుంది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మొదటి 16 స్థానాల్లో ఉన్న దేశాలకు వరల్డ్ గ్రూప్‌లో ఆడే అవకాశం లభిస్తుంది. వరల్డ్ గ్రూప్‌లో గెలిచిన జట్లు నాకౌట్ చేరుకుంటాయి. క్వార్టర్ ఫైనల్స్, సెమీ ఫైనల్స్ ముగిసిన తర్వాత, ఫైనల్ చేరిన రెండు దేశాల మధ్య పోరు ఉంటుంది. గెలిచిన జట్టుకు ట్రోఫీ దక్కుతుంది. ఓడిన జట్టు రన్నరప్ షీల్డ్‌ను అందుకుంటుంది. ఈ పోటీల్లో సింగిల్స్, డబుల్స్, రివర్స్ సింగిల్స్ మ్యాచ్‌లు ఆటగాళ్లు ఆడతారు. మొదట రెండు సింగిల్స్ మ్యాచ్‌లు జరుగుతాయి. ఆ తర్వాత ఒక డబుల్స్ మ్యాచ్ ఉంటుంది. అనంతరం, మొదట సింగిల్స్‌లో పాల్గొన్న ప్రత్యర్థులను మార్చేసి, రివర్స్ సింగిల్స్‌లో మ్యాచ్‌లు ఆడిస్తారు. ఉదాహరణకు మొదటి సింగిల్స్ 'ఎ', 'బి' మధ్య, రెండో సింగిల్స్ 'సి', 'డి' మధ్య జరిగితే, తొలి రివర్స్ సింగిల్స్ 'ఎ', 'సి', రెండో సింగిల్స్ 'బి', 'డి' మధ్య జరుగుతుంది. బెస్ట్ ఆఫ్ త్రీగా పోటీలు కొనసాగుతాయి. మొత్తం ఐదు మ్యాచ్‌ల్లో ఏ జట్టు ముందుగా మూడు మ్యాచ్‌లు గెలుస్తుందో, ఆ జట్టును విజేతగా ప్రకటిస్తారు. ఎలాంటి ప్రాధాన్యం లేని తదుపరి మ్యాచ్‌లు రద్దవుతాయి. ఒక్కోసారి రెండు జట్లు చెరి రెండు మ్యాచ్‌లు గెలిచి, చివరిదైన ఐదో మ్యాచ్‌లో అమీతుమీ తేల్చుకుంటాయి. ఇలాంటి మ్యాచ్‌లు ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటాయి. డేవిస్ కప్ పోటీలు ఒక సవాలు నుంచి రూపు దిద్దుకోవడం విశేషం. 1899లో అమెరికాలోని హార్వర్డ్ యూనివర్శిటీ (బోస్టన్/ మసచూసెట్స్)కి చెందిన నలుగురు టెన్నిస్ ఆటగాళ్లు ఒక టోర్నీని నిర్వహించి, అందులో పాల్గొనాల్సిందిగా బ్రిటిష్ ఆటగాళ్లకు సవాలు విసిరారు. ఈ సవాలు విసిరిన నలుగురు అమెరికన్ టెన్నిస్ ఆటగాళ్లలో డ్వెయిట్ ఎఫ్. డేవిస్ ఒకడు. ఆ టోర్నమెంట్ విధివిధానాలను అతనే రూపొందించాడు. అంతేగాక, ఆ రోజుల్లోనే 1000 డాలర్లు ఖర్చు చేసి ట్రోఫీని సిద్ధం చేయించాడు. ఆ మొత్తం ఇప్పుడు 700,000 డాలర్ల కంటే ఎక్కువగా ఉండవచ్చు. ఈ ట్రోఫీని న్యూ హాంప్స్‌షైర్‌కు చెందిన విలియం డర్గిన్, బ్రిటన్‌కు చెందిన రోలాండ్ రోడ్స్ సంయుక్తంగా రూపొందించాడు. ఈ టోర్నమెంట్‌ను నిర్వహించాలన్న ఆలోచన నుంచి సమర్థంగా పోటీలను నిర్వహించి, ట్రోఫీని ప్రదానం చేసే వరకూ అన్ని ఖర్చులను భరించిన డేవిస్ పేరుమీదే 'డేవిస్ కప్' టోర్నమెంట్ ఆవిర్భవించింది. బోస్టన్‌లోని లాంగ్‌వుడ్ క్రికెట్ క్లబ్‌లో మొట్టమొదటి డేవిస్ కప్ పోటీలు 1900 సంవత్సరంలో జరిగాయి. మొదటి మూడు మ్యాచ్‌ల్లో బ్రిటన్‌ను చిత్తుచేసిన అమెరికా తొలి ట్రోఫీ గెల్చుకుంది. అప్పటి నుంచి డేవిస్ కప్ క్రమంగా ప్రాచుర్యం పొందగా, వివిధ దేశాలు పోటీలోకి దిగాయి. 1905లో బెల్జియం, ఫ్రాన్స్, ఆస్ట్రియా, ఆస్ట్రేలియా (న్యూజిలాండ్‌తోసహా... అప్పట్లో న్యూజిలాండ్ ప్రత్యేక జట్టుగా లేదు) ఈ టోర్నమెంట్‌లోకి అడుగుపెట్టాయి. క్రమంగా టప్‌పై ఆధిపత్యం మారుతునే ఉంది. 1950 నుండి 1967 వరకు, 18 సంవత్సరాలు ఆస్ట్రేలియా పూర్తి ఆధిపత్యాన్ని కనబరిచి, 15 పర్యాయాలు విజేతగా నిలిచింది. అయితే, 1970 దశకం నుంచి అమెరికా ఈ టోర్నీపై తనదైన ముద్ర వేసింది. ఈ టోర్నమెంట్‌కు అమెరికా అత్యధికంగా 32 పర్యాయాలు గెల్చుకుంది. ఆస్ట్రేలియా 28, గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్స్, స్వీడన్ తలా తొమ్మిది పర్యాయాలు విజేతగా నిలిచాయి. 2023లో ఆస్ట్రేలియాను ఓడించిన ఇటలీ టైటిల్‌ను కైవసం చేసుకుంది.






ఈ ఏడాది డేవిస్ కప్‌ను స్పెయిన్‌లో ఈనెల 19 నుంచి 24 వరకూ నిర్వహిస్తారు. మలగాలోని మార్టిన్ కార్పెన్స్ ఎరీనాలో ఈ పోటీలు జరుగుతాయి. 19న జరిగిన తొలి క్వార్టర్ ఫైనల్స్‌లో స్పెయిన్, నెదర్లాండ్స్ ఢీ కొంటాయి. 20న రెండో క్వార్టర్ ఫైనల్స్ జర్మనీ, కెనడా మధ్య జరుగుతుంది. 21న మూడో క్వార్టర్ ఫైనల్ అమెరికా,ఆస్ట్రేలియా తలపడతాయి. అదే రోజు నాలుగో కావ్వర్టర్ ఫైనల్ ఇటలీ, అర్జెంటీనా మధ్య ఉంటుంది. క్వార్టర్స్‌లో గెలిచిన జట్ల మధ్య 22, 23 తేదీల్లో సెమీ ఫైనల్ మ్యాచ్‌లు జరుగుతాయి. 24న తుది పోరులో కప్ కోసం ఫైనలిస్ట్ జట్లు తలపడతాయి.

## స్కిప్పింగ్.. ఆటేకాదు.. వ్యాయామం కూడా

స్కిప్పింగ్ లేదా తాడాట ఒకప్పుడు ప్రతి ఇంట్లోనూ ఆడేవారు. ప్రత్యేకించి బాలికలు, యువతులకు దైనంద జీవితంలో భాగం. దాదాపు తమ పొడవుగల తాడును చేతులతో తమకాళ్ల క్రిందనుంచి తలపైకిత్రిప్పుతూ, కాళ్లకు తగలకుండా గెంతుతుంటారు. అలా ఏకబిగిని ఎవరు ఎక్కువసార్లు త్రిప్పితే వారు గెలిచినట్లు.దీనితోనే మరొక ఆట కూడా ఆడతారు. పిల్లలందరూ ఒకే చోట ఒకేసారి ఇలా గెంతుతూ బయలుదేరి నిర్దేశించుకున్న స్థలానికి ఎవరు ముందు చేరితే వాళ్ళు గెలిచినట్టు. ఇది కాళ్ళకూ, చేతులకూ, ఏకాగ్రతకూ సంబంధించిన శారీరక శ్రమకు చెందిన ఆట. చక్కని పోటీ మనస్తత్వం, పురోగతిపై ఆకాంక్ష కలిగిస్తుంది ఈ ఆట. రికార్డులు.. స్కిప్పింగ్‌లో గిన్నిస్ రికార్డులు కూడా నెలకొన్నాయి. చైనాలోని జెజియాంగ్ ప్రావిన్స్ యుయావోకు చెందిన 14 ఏళ్ల రోస్గ్ జిజియాంగ్ నిమిషంలో అత్యధికంగా 382 స్కిప్స్‌తో గిన్నిస్ పుస్తకంలో చోటు సంపాదించాడు. అంతకు ముందు రికార్డు కంటే అతను 8 స్కిప్‌లు ఎక్కువ చేశాడు. ఏ దశలోనూ తడబడకుండా ఈ రికార్డును అందుకోవడం విశేషం. ఇక గంటలో అత్యధిక స్కిప్‌ల రికార్డు కెనడాకు చెందిన జోర్డాన్ కొయెన్ పేరిట ఉంది. అల్బెర్టా ప్రావిన్స్ గ్రిమ్‌షాలో అతను గంటకు 14,657 స్కిప్స్‌తో ఈ రికార్డును అందుకున్నాడు. ఏడేళ్ల వయసు నుంచే స్కిప్పింగ్ ప్రారంభించిన అతను తొలుత సరదాగా పాఠశాలలో ప్రదర్శనలిచ్చేవాడు. తదనంతరం అదే అలవాటుగా మారింది. గిన్నిస్ వరకూ చేర్చింది. ఒంటికాలితో నిమిషంలో అత్యధిక స్కిప్స్ చేసిన ఘనత నైజీరియాకు చెందిన బెన్గా ఎజికెల్ సొంతం చేసుకున్నాడు. 2023 ఆగస్టు 18న అతను 278 స్కిప్స్‌తో రికార్డు నెలకొల్పాడు.





# వేగంగా హామీల అమలు

### సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు డిమాండ్



**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో వేగం పెంచాలని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని రావి నారాయణరెడ్డిభవన్‌లో పైళ్ల శాంతికుమార్ అధ్యక్షతన జరిగిన జిల్లా కౌన్సిల్ సమావేశాలలో రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కల్లపల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల విషయం ఒక్క అడుగు ముందుకు రెండు అడుగులు వెనుకకు అన్న రీతిలో అమలవుతున్నాయన్నారు. తక్షణం అర్హులైన రైతులందరికీ రైతు భరోసా, పంటల బీమా పథకం, కొత్త రేషన్ కార్డులు, ఇండ్లు, ఇండ్ల స్థలాలు, పింఛన్ల పెంపు లాంటి హామీల అమలుకు తక్షణం పూనుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.రైతు భరోసాకు సంబంధించి ఖరీఫ్ సీజన్ పూర్తయినా కూడావిధివిధానాల కోసం అభిప్రాయసేకరణ పేరుతో కాలయాపన చేస్తున్నట్లుగా కనపడుతున్నదన్నారు. ధరణి స్థానంలో కొత్తగా రూపొందించిన ఆర్ ఓఆర్ చట్టం ముసాయిదాపై మరింతలోతుగా చర్చించి, అందరి అభిప్రాయాలు తీసుకుని కొత్త ఆర్ ఓఆర్ చట్టం తీసుకు రావాలని ఆయన సూచించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్న మాట వాస్తవమే అయినప్పటికీ, హామీల అమలు ఇలానే కొనసాగిస్తే ప్రజల్లో వ్యతిరేకత తప్పదని ఆయన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు హామీ సక్రమంగా కొనసాగుతున్నదని హర్షం వ్యక్తం చేశారు.ఆరోగ్యశ్రీ రూ.10 లక్షలకు పెంచుతూ చేసిన హామీ,ఆరోగ్యశ్రీ బకాయిలు ఉన్న నేపథ్యంలోఆశించిన స్థాయిలో అమలు కావడం లేదని పేర్కొన్నారు.200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, రూ.500 లకు గ్యాస్ సిలిండర్ హామీలు కొంత వరకు అమలవుతున్నా, పేదలందరికీ రేషన్ కార్డులు లేకపోవడం, పలు సాంకేతిక కారణాల నేపథ్యంలో ఈహామీ పూర్తిస్థాయిలో అమలుకు నోచుకోవడంలేదన్నారు. ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో పాలక, ప్రతిపక్షాల ఆరోపణలు,ప్రత్యారోపణలు, దూషణలకే ఎక్కువ సమయం వృధా అయిందని, ప్రజల సమస్యలపై చర్చ అంతంత మాత్రంగానే జరిగిందన్నారు. అసెంబ్లీ సమావేశాలు తీరు మారాలన్నారు.ఈ జిల్లా కౌన్సిల్ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, పట్టణ కార్యదర్శి నాయకులు సోతుకు ప్రవీణ్ కుమార్,జిల్లా సీనియర్ నాయకులు మామిడాల సమ్మిరెడ్డి, కొరిమి సుగుణ, నూకల చంద్రమౌళి,అన్నారపు రాజేందర్, పరమాండ్ల రాజయ్య, నిమ్మల రాజయ్య పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాల వల్ల సంక్షోభంలోకి దేశ ఆర్థిక వ్యవస్థ

### ఆల్ ట్రేడ్ యూనియన్స్ రైతు సంఘాల పిలుపు



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి:** ప్రజా వ్యతిరేక విధానాల మూలంగా దేశం ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలోకి నెట్టబడిందని సిఐటియు జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి,ఎఐటియుసి జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్, ఎఐసిటియు జిల్లా అధ్యక్షులు నర్ర ప్రతాప్, ఐఎన్‌టిసి జిల్లా అధ్యక్షు లు పుల్ల రమేష్, ఎఐసిటియు జిల్లా కార్యదర్శి అక్కెనపల్లి యాదగిరి, ఐఎఫ్‌టియు జిల్లా అధ్య క్షులు గంగుల దయాకర్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాచర్ల బాలరాజులు అన్నారు. బిజెపి విధానా లకు వ్యతిరేకంగా26న కలెక్టర్ ఆఫీస్ ధర్నాను విజయవంతం చేయాలని ఆల్ ట్రేడ్ యూనియన్స్ రైతు సంఘాల పిలుపునిచ్చారు. శనివారం ఆల్ ట్రేడ్ యూనియన్స్ రైతు సంఘాల ఆధ్వర్యంలో వరంగల్ హెడ్ పోస్ట్ ఆఫీస్ దగ్గర ఎఐసిటియు జిల్లా కార్యాలయంలో రౌండ్‌టేబ్ సమావేశం నిర్వహించా రు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ బిజెపి కార్మిక, కర్షక ప్రజా వ్యతిరేక విధానాల మూలంగా దేశం ఆర్థిక సంక్షోభంలోకి తీవ్రంగా నెట్టి వేయబడిందన్నారు. ఈ విధానాల మూలంగా దేశంలో నిత్యావసర సరుకుల ధరలు పెరగడం మూలంగా అట్టడుగు ప్రజలు కార్మికులు కొనలేని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న పరిస్థితి ఏర్పడుతుందన్నారు. దేశ రైతాంగానికి మద్దతు ధర కల్పిస్తామని కొత్త చట్టాన్ని తీస్తున్నామని చెప్పుతూ మార్కెట్లో గిట్టుబాటు ధర లేకు ండా, నల్ల చట్టాలను తీసుకొస్తూ రైతులను ఇబ్బంది పాలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు పన్నుతుందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలని ప్రైవేటీకరణ ఆపాలని, ప్రభుత్వ రంగ సంస్థల్ని బలోపేతను చేయాలని డిమాండ్ చేశారు. నవంబర్ 26న దేశవ్యాప్త కార్మిక సంఘాల పిలుపులో భాగంగా వరంగల్ జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వ హిస్తున్నామని, ఈ ధర్నా కార్య క్రమానికి కార్మిక, రైతులు, వ్యకాస సం ఘాల కార్మికులు పాల్గొని ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సిఐటియు జిల్లా అధ్య క్షులు మాలోత్ సాగర్, గున్నాల ప్రభాకర్, ఐఎన్‌టియూసి జిల్లా కార్యదర్శి పాశం రవి, ఏఐసిటియు జిల్లా కార్యదర్శి జగదీశ్వర్, నాయకులు రైతు సంఘం నాయకులు సోమిరెడ్డి శ్రీనివాస్, వల్లందాసు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చే వరకూ భూపోరాటం ఆగదు

### రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇ.టి నర్సింహ్మా





**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధి :** పేదలకు ఇండ్ల స్థలాలు ఇచ్చే వరకు భూపోరాటం ఆగదని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇ.టి నర్సింహ్మా అన్నారు. శనివారం సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లో ఇండ్ల స్థలాల కోసం సమావేశం నిర్వ హించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశం సిపిఐ డివిజన్ కార్యదర్శి నర్సింహులు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఇటి నర్సింహ మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతాలు గత నాలుగు సంవత్సరాలుగా ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ఎన్నో దఫాలుగా తహశీల్దార్, ఆర్డీఓ, మున్సిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతూ వినతి పత్రాలు అందించిన అధికారుల్లో చలనం లేదన్నారు. బీద, బడుగు వర్గల వారు. ఇండ్లు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజల కిచ్చిన హామిని నెరవేర్చాలన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎర్ర జెండా ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. సిపిఐ జిల్లా కార్యదర్శి సయ్యద్ జలాలోద్దీన్ మాట్లాడుతూ జహీరాబాద్ ప్రాంతంలో భరత్ నగర్ ఇండ్ల స్థలాలను కామ్రెడ్ మంజూరు అహమ్మద్ ఆధ్వర్యంలో ఎర్ర జెండాలు పాతి గుడిసెలు వేయడం జరిగిందన్నారు. జహీరాబాద్‌లో పేద ప్రజలకు అండగా నిలిచి ఇండ్ల స్థలాలు మంజూరు చేసిన ఘనత సిపిఐ దన్నారు. సిపిఐ పార్టీ పేదల పక్షాన ఎల్లప్పుడు పోరాటం చేస్తుందన్నారు. అజారోద్దీన్ ,అఫ్జర ,మైనోద్దీన్, అశ్వక్,హుస్సేన్ , మైబూబ్ ,తాజుద్దీన్. యేసురత్నం ,రుబీనా ,పూజ తదితరులు పాల్గొన్నారు.

## శరవేగంగా సిపిఐ సభ్యత్వం

### అభినందించిన సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ఏ కూనంనేని

**ప్రజాపక్షం/పాల్వంచ టౌన్:** కారేగట్టు భారత కమ్యూనిస్టు పార్టీ 2025 పార్టీ సభ్యత్వ నమోదును మాజీ ఎంపీటీసీ ఉంగ్రాతి రవి, నూరా గురుమూర్తి, కోరెం చంద్రశేఖర్ వీరు ముగ్గురు కలిసి 60 సభ్యత్వాలను మూడు రోజుల్లో పూర్తి చేశారు. వీరి ముగ్గురు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివ రావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథంకు కౌంటర్ ఫైల్‌తో సహాయ శనివారం అందించారు. ఈసందర్భంగా కారేగట్టులో సకాలంలో సభ్యత్వం పూర్తి చేసినందుకు అభినందించారు. ఈకార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందరరావు, జిల్లా సమితి సభ్యులు బండి నాగేశ్వరరావు, ఉప్పుశెట్టి రాహుల్, వీసంశెట్టి పద్మజ, అన్నారపు వెంకటేశ్వర్లు, ఇట్టి వెంకట్రావ్ అభినందనలు తెలిపారు.



## ప్రజా సమస్యలు గాలికొదిలేసిన ప్రభుత్వాలు

### * సిపిఐ సభ్యత్వ నమోదు ప్రారంభం

### * సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, సీనియర్ నాయకులు ఎం. వెంకటేశ్వర్లు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్ :** ప్రజా సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికి వదిలేశాయని, నిత్యావసరాల వస్తువుల ధరలు అమాంతం పెరుగుతున్నా పట్టించుకోవడం లేదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు యల్లావుల రాములు, సీనియర్ నాయకులు ఎం.వెంకటేశ్వర్లులు అన్నారు. శని వారం సూర్యాపేట జిల్లా హుజూర్ నగర్‌లో సిపిఐ పార్టీ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని ప్రారం భించారు. వారు మాట్లాడుతూ అధికార, ప్రధానప్రతిపక్ష పార్టీలనాయకులు ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుంటూ కాలయాపన చేస్తూ ప్రజల సమస్యలను విస్మరించారని విమర్శించారు. సామాన్యులకు అందుబాటులో లేని నిత్యావసరాల గురించి గానీ, రైతుల సమస్యల పైన గానీ వారు మాట్లాడకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ధాన్యం అమ్మకాల్లో రైతులను మధ్య దళారులు చేస్తున్న మోసం, ప్రభుత్వం కొనుగోళ్ల కేంద్రాలలో ధాన్యం కొనుగోలు పరిస్థితి అందరికి తెలిసిందేనన్నారు. రైతును ధాన్యం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో అమ్మాలంటూ ఒకవైపు చెబుతూనే మరొక వైపు అనేక సాకులు చూపుతూ ఇప్పటి వరకు ఒక్క ధాన్యపు గింజను కూడా డివిజన్ పరిధిలోని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేయలేదన్నారు. నిబంధనలు సడలించి ఐనా ప్రతి ధాన్యపు గింజ ను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు దేవరం మల్లీశ్వరీ, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, యల్లావుల రమేష్, దొంతగాని సత్యనారాయణ, జడశ్రీను, జక్కుల రమేష్, మామిడి వెంకయ్య, మామిడి నర్సయ్య పాల్గొన్నారు.

## చట్టసభలలో 33 శాతం రిజర్వేషన్లు తక్షణమే అమలు

### నేదునూరి జ్యోతి డిమాండ్.. డీలిమిటేషన్‌తో ముడి పెట్టొద్దు



**ప్రజాపక్షం/పెద్దపల్లిప్రతినిధి :** దేశ అభివృద్ధిలో మహిళా భాగ స్వామ్యాన్ని పెంచేందుకు మహిళా సాధికారికను సాధించేందుకు ఉద్దే శించిన యాక్టు–2023ను తక్షణ మే అమలు చేయాలని, మహిళల భాగస్వామ్యాన్ని తక్షణమే విని యో గంలోకి తేవాలని నేదునూరి జ్యోతి కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పెద్దపెల్లి జిల్లా గోదావరిఖనిలో జిల్లా మహాసభ తిరుమల అధ్యక్షతన జరిగింది. ఈ మహాసభకు ముఖ్య అతిథిగా నేదునూరి జ్యోతి హాజరై మాట్లాడుతూ డీలిమిటేషన్ పేరుతో 2029 దాకా రిజర్వేషన్లు వా యిదా వేయకూడదని, తక్షణమే 33 శాతం మహిళా రిజర్వేషన్ అమలు చేయా లని, పితృస్వామికి ఆధిపత్యం పోయి మాతృ స్వామికి వ్యవస్థ రావాలని అందుకు భారత జాతీయ మహిళా సమాఖ్య తన ఉద్యమాలను ఉధృతం చేస్తుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన గ్యారెంటీలను వెంటనే అమలు చేసి చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు., రాష్ట్ర ప్రభుత్వం సోలార్ పవర్ ప్లాంట్లు ఇందిరా మహిళా శక్తి సంఘాలకు ఇవ్వాలని నిర్ణయించడాన్ని భారత జాతీయ మహిళా సమఖ్య స్వాగతిస్తుందన్నారు. ఈ సమా వేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు మల్లయ్య పాల్గొన్నారు. ఈ మహాసభలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. గౌరవ అధ్యక్షు రాలిగా ఓదెమ్మ అధ్యక్షురాలిగా విజయ ప్రధాన కార్యదర్శిగా రమ ఉపా ధ్యక్షురాలుగా తిరుమల, సుజాత, సౌజన్య, సహాయ కార్యదర్శులుగా రేణుక, విజయ లక్ష్మి లను ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్రసమితి సభ్యులు. మోహన్ పట్టణ కార్యదర్శి కనకరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగం భారత డిఎన్ఎ

**బిజెపి, ఆర్ఎస్ఎస్ ఖాళీ పుస్తకంగా భావిస్తోంది : రాహుల్‌గాంధీ**



**అమరావతి/చిమూర్ :** భారత రాజ్యాంగాన్ని తమ పార్టీ దేశ డిఎన్ఏగా పరిగణిస్తోందని ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చెప్పారు. కానీ బిజెపి, ఆర్ఎస్ఎస్ మాత్రం ఖాళీ పుస్తకంగా భావిస్తోందని విమర్శించారు. మహారాష్ట్రలోని అమరావతిలో శనివారం నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో రాహుల్‌గాంధీ పాల్గొని మాట్లాడారు. మహారాష్ట్రలో జరిగినట్లు ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలను పడగొట్టవచ్చని, అగ్రశ్రేణి వ్యాపారవేత్తల రూ. 16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేయవచ్చని రాజ్యాంగంలో ఎక్కడా రాయలేదన్నారు. కాంగ్రెస్ నేత రాహుల్ తన ఎన్నికల ర్యాలీల్లో ఖాళీ పేజీలతో రాజ్యాంగం ప్రతిని ప్రదర్శిస్తున్నారని ప్రధాని మోదీ, బిజెపి ఇటీవల విమర్శించిన నేపథ్యంలో రాహుల్ ఈ విధంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ రాజ్యాంగాన్ని దేశ డిఎన్ఏగా పరిగణిస్తుంది, అయితే అధికార బిజెపి, ఆర్ఎస్ఎస్‌లకు ఇది ఖాళీ పుస్తకం అంటున్నాయని ఆయన ఆరోపించారు. కల గణన చేయాలని, రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తివేయాలని తాను లోక్‌సభలో లేవనెత్తిన అంశాలపై ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాట్లాడుతున్నారని తన సోదరి తనకు చెబుతోందన్నారు. అయితే ఆను రిజర్వేషన్లకు వ్యతిరేకమని మోదీ చెబుతున్నారని, అతను అమెరికా మాజీ అధ్యక్షుడిలాగా జ్ఞాపకశక్తి కోల్పోయారని ఎద్దేవా చేశారు. వస్తు సేవల పన్ను (జిఎస్‌టి), నోట్ల రద్దు రైతులను, చిన్న వ్యాపారులను హతమార్చే ఆయుధాలని పేర్కొంటూ దేశంలో నిరుద్యోగం పెరుగుతోందని, అందుకే సమాజంలో విద్వేషం వ్యాప్తి చెందుతోందన్నారు. 'పారిశ్రామికవేత్తలు మిమ్మల్ని ప్రధానిగా ఎన్నుకోలేదు, భారత ప్రజలే ఎన్నుకున్నారని మోదీకి చెప్పాలనుకుంటున్నాను. పారిశ్రామికవేత్తలు ఆయనను బజారుకీడ్చిన మాట వాస్తవమే' అని అన్నారు. అనంతరం చంద్రాపూర్ జిల్లాలోని చిమూర్‌లో జరిగిన మరో ర్యాలీలో ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగానికి, రిజర్వేషన్లకు రాహుల్ గాంధీ వ్యతిరేకమని ప్రధాని మోదీ అబద్ధాన్ని ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. దేశాన్ని నిర్మించిన జాతీయ దిగ్గజాల పోరాటాన్ని, త్యాగాలను ప్రజలకు గుర్తు చేసేందుకు తన ఎన్నికల ర్యాలీల్లో రాజ్యాంగాన్ని ప్రదర్శిస్తూనే ఉంటానని చెప్పారు. మోదీ ప్రభుత్వం అధికారంలో ఉన్నంత కాలం ఉద్యోగాల కల్పన సాధ్యం కాదని గాంధీ అన్నారు. దళితులు, ఆదివాసీలు, వెనుకబడిన తరగతుల జనాభాలో 90 శాతం మంది ఉన్నారు, అయితే నిర్ణయం తీసుకోవడంలో వారి వాటా ఆరు శాతం మాత్రమేనన్నారు.

**రాహుల్ గాంధీ బ్యాగులను తనిఖీ చేసిన ఇసి**

మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ.. ప్రచారంలో పాల్గొనే నేతల బ్యాగులు, హెలికాప్టర్లలో తనిఖీల పరంపర కొనసాగుతోంది. తాజాగా అమరావతిలో ప్రచారానికి వచ్చిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బ్యాగులను ఎన్నికల అధికారులు తనిఖీ చేశారు. శనివారం మధ్యాహ్నం అమరావతిలో ఆయన హెలికాప్టర్ ల్యాండ్ అవ్వగానే అధికారులు చెక్ చేశారు. ఆయన వెంట తెచ్చుకున్న బ్యాగులతో పాటు హెలికాప్టర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆ సమయంలో రాహుల్ తన పార్టీ నేతలతో మాట్లాడుకుంటూ అక్కడి నుంచి వెళ్లిపోయారు.

# కుర్చీని కాపాడుకోవడంపైనే మోదీ దృష్టి

**ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే**



**రాంచీ :** ప్రధాని మోదీకి ప్రజల సంక్షేమం కోసం పనిచేయటం కంటే తన కుర్చీని కాపాడుకోవడం పైనే మొత్తం దృష్టి సారిస్తారని ఎఐసిసి అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే విమర్శించారు. ఒక చిన్న రాష్ట్రంలో ఎన్నికల విజయం కోసం ప్రధానమంత్రి రోజులో 24 గంటలు, పెద్ద ఎత్తున శ్రమించడం మును పెన్నడూ జరగలేదన్నారు. ప్రధాని మోదీ ప్రజల కోసం కాదని, తన కుర్చీ కాపాడుకునేందుకే పని చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాంచిలో శనివారం జరిగిన మీడియా సమావేశంలో ఖర్గే మాట్లాడుతూ పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఆకాశాన్ని అంటుతున్న నిత్యవసరాల ధరలే ప్రజల సమస్యలపై మోదీ వైఫల్యానికి సాక్ష్యాలని అన్నారు. ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా పాతికేళ్ళు అధికారంలో ఉన్న మోదీ గుజరాత్‌లో పేదరికం లేకుండా నిర్మూలించగలిగాడా? అని నిలదీశారు. అహ్మదాబాద్ నుంచి ముంబైకి భారీ ఖర్చుతో బుల్లెట్ రైలు ఎందుకని, రూ.3లక్షల కోట్లతో 500 కిలోమీటర్ల రైల్వే లైను వాంఛనీయమేనా అని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టు బడ్జెట్‌ను రూ.1లక్ష కోట్ల నుంచి రూ.3లక్షల కోట్లకు పెంచారని, ఇప్పటికీ నిర్మణంలో ఉన్న ఒక వంతెన కూలిపోయిందన్నారు. బిజెపి విభజన రాజకీయాలకు పాల్పడుతోందని, ఓట్ల కేంద్రీకరణ కోసం 'బటేంగే తో కటేంగే(విభజిస్తే కోతకు గురవుతామనే)' అనే బిజెపి వివాదాస్పద నినాదంపై స్పందించడంలో మోదీ విఫలమయ్యాడని మండిపడ్డారు. జార్ఖండ్ సిఎం హిమంత్ సోరేన్ ప్రభుత్వం ఆమోదించిన ఎస్‌సి,ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్‌ల పెంపు బిల్లును కేంద్రం అడ్డుకుందన్నారు. జార్ఖండ్‌లో మరోసారి ఇండియా కూటమే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందనే ఖర్గే ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే 43 శాసనసభ స్థానాలకు మొదటి దశలో పోలింగ్ పూర్తయిందని, ఇండియా కూటమి మరోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందనేది స్పష్టమైందని అన్నారు. ఉత్సాహంగా పోలింగ్‌లో పాలుపంచుకున్న మహిళలకు ఆయన అభినందనలు తెలియజేశారు. డిసెంబర్ నుంచి మహిళలకు 'మాయన్ సమ్మాన్ యోజన' కింద నెలకు రూ.వెయ్యి నుంచి రూ.2,500లకు పెంచుతామని వారు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారని అన్నారు.

మీ భూములను పారిశ్రామికవేత్తలకు ఇచ్చేస్తారు

ప్రధాని మోదీ దేశం నుంచి 'భావ ప్రకటనా స్వేచ్ఛ'ను నిర్మూలిస్తున్నాడని, ఆయన తప్పులను ఎత్తిచూపేవారిని జైళ్ళలో వేస్తున్నాడని మల్లిఖార్జున ఖర్గే అన్నారు. మోదీ ప్రజల హక్కులను లాగేసుకుంటున్నాడని, ఒక గిరిజన ముఖ్యమంత్రిని జైళ్ళో వేయడమే ప్రజాస్వామ్యమా? అని ప్రశ్నించారు. రాంచీలోని ఓర్మాంజిలో జరిగిన సభలో ఆయన ప్రసంగిస్తూ దేశంలో దళిత, గిరిజన,మైనారిటీలను అణిచివేస్తుంటే మోడీ మౌనంగా ఉంటారని అన్నారు. రాహుల్‌గాంధీ, తనకు క్యాబినెట్ హోదా ఉన్నప్పటికీ, కేంద్ర మంత్రులు శివరాజ్ చౌహాన్, అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మలకు మాదిరిగా ప్రత్యేక హక్కులను కలిగిలేమని అన్నారు. తనను పెంచిన వారి పట్లనే విశ్వాసరాహిత్యంగా వ్యవహరించిన చంపాయి సోరెన్ లాంటి ద్రోహులు ఉన్నారని మండిపడ్డారు. మోదీ మిమ్మల్ని మోసం చేస్తాడు, మీ నీళ్ళు, భూములు, అడవులను పారిశ్రామికవేత్తలకు కట్టబెడతాడని ఖర్గే హెచ్చరించారు. ఎన్నికల్లో గెలవని రాష్ట్రాలలో ప్రభుత్వాలను పడగొట్టేందుకు బిజెపి ఎంఎల్‌ఏల కొనుగోళ్లకు పాల్పడుతోందని, కర్నాటక, మహారాష్ట్ర, గోవాలు ఇందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. దేశంలో 62 శాతం సంపద కేవలం 5 శాతం ధనికుల చేతుల్లో కేంద్రీకృతమైందని, 50 శాతం జనాభా చేతిలో కేవలం 3 శాతం సంపదే ఉందన్నారు.

## గత ప్రభుత్వాల ధ్యాసంత వచ్చే ఎన్నికలపైనే



**న్యూఢిల్లీ :** గత ప్రభుత్వాలు కేవలం వచ్చే ఎన్నికల్లో గెలిచేందుకు పని చేసేవని, పోలింగ్‌లో నెగ్గేందుకు సంక్షేమ పథకాల ద్వారా ఓటు బ్యాంకును సృష్టించుకునేవని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. తన ప్రభుత్వ ఉద్దేశ్యం నవ భారత నిర్మాణమని, తద్వారా దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. తాము ఇలాంటి పెద్ద లక్ష్యాన్ని పెట్టుకున్నప్పుడు భారత ప్రజలు తమపై విశ్వాసం ఉంచారని అన్నారు. న్యూఢిల్లీలో 'హిందుస్తాన్ టైమ్స్ లీడర్‌షిప్ సమ్మిట్'లో ఆయన కీలకోపన్యాసం చేస్తూ గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకును సంతృప్తి పరిచేందుకు పథకాలను తీసుకువచ్చేవని, తమ ప్రభుత్వం మాత్రం ఓటు బ్యాంకు రాజకీయాలకు మైళ్ల దూరంలో ఉంటుందని అన్నారు. గత ప్రభుత్వాల ఓటు బ్యాంకు రాజకీయాలతో చేసిన పెద్ద నష్టమేమిటంటే దేశంలో అసమతుల్య అసమానాతలు పెరిగడమేనని అన్నారు. తమ హయాంలో ప్రభుత్వంపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించామని అన్నారు. తొంభయ్యవ దశకంలో భారతదేశానికి పదేళ్ళలో ఐదు ఎన్నికలు జరిగాయని, దేశంలో అంతటి అస్థిరత ఉండేదని మోదీ పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో అస్థిరత, అసందిగ్ధతల గురించి చర్చ జరుగుతుందని, ప్రతి ఎన్నికల్లో ప్రభుత్వాలు మారుతున్నాయని, భారతదేశంలో మాత్రం ప్రజలు తన ప్రభుత్వాన్ని మూడవ సారి ఎన్నుకున్నారని తెలిపారు. సోషల్ మీడి యా, తప్పుడు సమాచారం, అవాస్తవ ప్రచారం రాజ్యమేలుతున్న ఈ కాలంలో భారత పౌరులు తమపై , తమ ప్రభుత్వంపై విశ్వాసం ఉంచారని అన్నారు. తమ ప్రభుత్వం ప్రజల కోసం భారీగా ఖర్చు చేయడం, ప్రజల కోసం భారీగా పొదుపు చే యడమే వైఖరితో ఉన్నదని, ఈ శతాబ్ది భారతదేశానిదేనని ఉద్ఘాటించారు. హిందుస్తాన్ టైమ్స్ పత్రిక వందేళ్ళ ఉత్సవాలను పురస్కరించుకొని తీసుకువచ్చిన ప్రత్యేక తపాలా స్టాంప్‌ను మోదీ ఈ సందర్భంగా విడుదల చేశారు. అలాగే వేదిక వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. తాను భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటి రోజులకు సంబంధించి పాత దినపత్రికలను చూసానని, స్వాతంత్ర్య సమరంతో పాటు స్వాతంత్ర్యం వచ్చాక అనేక ఆకాంక్షలతో ముందుకు సాగిన ప్రయాణం అద్భుతమైనదని మోదీ అన్నారు. భారత్‌లో కశ్మీర్ విలీనమైనమైన 1947 అక్టోబర్ పత్రికను చదివినప్పుడు తాను ఉద్వేగానికి గురయ్యానని తెలిపారు. నిర్ణయలేమి కారణంగా కశ్మీర్ ఏడు దశాబ్దాలు హింసలో కూరుకుపోయిందని గుర్తించానని చెప్పారు. ప్రస్తుత పత్రికల్లో జమ్మూ కశ్మీర్‌లో రికార్డు స్థాయి ఓటింగ్ జరిగిందనే వార్తలు హృదయాన్ని తాకాయన్నారు.

# ధైర్యం ఉంటే కులగణన చేయండి

**రిజర్వేషన్లపై పరిమితి తొలగించండి**

**షిర్డీ, కొల్హాపూర్ ర్యాలీల్లో మోదీకి ప్రియాంకా గాంధీ సవాల్**



**షిర్డీ/కొల్హాపూర్ :** లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ రిజర్వేషన్లకు వ్యతిరేకమంటూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్ షా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని కాంగ్రెస్‌పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా విమర్శించారు. దేశంలో కుల గణన చేపడతామనీ, రిజర్వేషన్లపై ఉన్న యాభైశాతం పరిమితిని తొలగిస్తామని ధైర్యం ఉంటే నరేంద్రమోదీ బహిరంగంగా ఒక ప్రకటన చేయాలని సవాలు చేశారు. మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా షిర్డీ, కొల్హాపూర్‌లలో జరిగిన ప్రచారసభల్లో ప్రియాంకాగాంధీ వాద్రా మాట్లాడుతూ, రాహుల్‌గాంధీ రిజర్వేషన్లకు వ్యతిరేకమంటూ అబద్ధాలు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. దేశంలో కులగణన చేపట్టాలని డిమాండ్ చేస్తున్న రాహుల్ గాంధీని చూసి మోదీ–అమిత్ షా ఇద్దరూ భయపడిపోతున్నారనీ, అందుకే ఆయనకు వ్యతిరేకంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ''నా సోదరుడు రిజర్వేషన్లకు వ్యతిరేకమని బహిరంగసభల్లో మోదీ, అమిత్ షా విమర్శిస్తున్నారు, కానీ నా సోదరుడు మణిపూర్ నుండి ముంబయి వరకూ న్యాయ యాత్ర చేశారు, కానీ మీరు మాత్రం ఆరోపణలు చేస్తున్నారు, దేశంలో కులగణన జరపాలనీ, న్యాయం చేయాలని కోరుతూ కన్యాకుమారి నుండి కశ్మీరు వరకూ నా సోదరుడు పాదయాత్ర చేసిన విషయం వారికి తెలుసు'' అని ప్రియాంకా అన్నారు.

మహారాష్ట్రలో ఈనెల 20వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికలలో మహా వికాస్ అఘాడీ (ఎంవిఎ) తరపున ఆమె ఎన్నికల ప్రచారం చేస్తున్నారు. 10 లక్షలకోట్లు విలువైన ప్రాజెక్టులను మహారాష్ట్ర నుండి కేంద్రంలోని బిజెపి లాక్కుపోయిందని, ఈ కారణంగా మహారాష్ట్ర ఎనిమిది లక్షల ఉద్యోగాలు కోల్పోయిందని, దాంతోపాటు మరో 6,000 వ్యాపారాలు కూడా మూతపడ్డాయన్నారు. పారిశ్రామిక ప్రాజెక్టులను కేటాయించడంలో మహారాష్ట్ర తీవ్ర వివక్ష ఎదుర్కొంటున్నదని అన్నారు. ఒక మాజీ ప్రధానమంత్రి ముంబయిలో అంతర్జాతీయ ఫైనాన్సియల్ సర్వీసెస్ సెంటర్‌ను ముంబయిలో ఏర్పాటు చేయాలనుకుంటే దానిని గుజరాత్‌కు తరలించేశారు'' అని ప్రియాంకాగాంధీ వాద్రా విమర్శించారు. ఆ ప్రధానమంత్రి పేరును ఆమె చెప్పలేదు. ''ప్రధానమంత్రి అంటే దేశానికి తల్లి లాంటివాడు, ఒక తల్లిగా వివక్ష చూపించకూడదు, కానీ మహారాష్ట్ర నుండి ప్రాజెక్టులను ఆయన లాక్కెళ్ళిపోతున్నారు, ఇతర ప్రాంతాలకు వాటిని తరలిస్తున్నారు, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ లాంటివారు పెద్ద పెద్ద వ్యాపార సంస్థలను, ఎయిమ్స్, ఐఐటిలను ఏర్పాటు చేశారు, డ్యాములు నిర్మించారు, కాలువలు తవ్వించారు, పరిశ్రమలకోసం మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశారు, ఎలాంటి వివక్ష లేకుండా వారు ఇదంతా చేశారు'' అని ఆమె గుర్తుచేశారు.

మహాయుతి కూటమి నాయకులు శివాజీ మహారాజ్‌ను అవమానపరుస్తున్నారని అన్నారు. గడచిన ఆగస్టు నెలలో సింధుదర్గ్ జిల్లాలో శివాజీ మహారాజ్ విగ్రహం కుప్పకూలిపోయిన సంఘటనను ఆమె గుర్తుచేస్తూ పైవిధంగా విమర్శించారు. అవినీతి కారణంగానే నిర్మాణలోపంతో శివాజీ విగ్రహం నిర్మాణం మధ్యలోనే కూలిపోయిందని ఆమె అన్నారు. ఈ విధంగా మీరు శివాజీని అవమానిస్తున్నప్పుడు ఇక మీరు ఆయన గురించి ఎలా మాట్లాడతారు? ఆయన పేరు ఎలా ఉపయోగించుకుంటారు? అని ప్రియాంకాగాంధీ మహాయుతి కూటమి పార్టీల నాయకులను ప్రశ్నించారు.

## మోదీ. .. అప్పుడే వచ్చే ఎన్నికల కోసం పని చేస్తున్నారు: చంద్రబాబు



**న్యూఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే వచ్చే సాధారణ ఎన్నికల (2029) కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని ఎన్‌డిఎ భాగస్వామి, ఎపి సిఎం ఎన్.చంద్రబాబు అన్నారు. ఢిల్లీ హిందుస్తా న్ టైమ్స్ లీడర్ షిప్ సమ్మిట్‌లో ఆయన మాట్లాడా రు. 'మోదీ ఎప్పుడే తదుపరి ఎన్నికల కోసం పనిచేస్తాడు. ఆయన ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసుకున్నాడు. దేశ ప్రయోజనాల కోసం భాగస్వామ్య పక్షాలతో కలిసి పని చేస్తున్నారు. ఆవిధంగా ఆయన మిషన్ మోడ్‌లో పని చేస్తార'ని చంద్రబాబు అన్నారు. కేంద్రం నిర్ణయాలు తీసుకునేటప్పుడు తన ప్రభావం ఉండాలని భావించనని, అయితే తమను భాగస్వామ్యం చేయాలని భావిస్తానని అన్నారు. భాగస్వామ్య పక్షాలతో ప్రధాని గొప్ప ఆలోచనలు పంచుకుంటే , తాము కూడా ఆయనతో పని చేస్తామని, వాటిని బలోపేతం చేస్తామన్నారు. మోదీ శక్తివంతమైన నాయకుడు, ఆధునిక, పురోగమన దృష్టి కలవాడని అన్నారు.

## శిరోమణి అకాలీదళ్ అధ్యక్ష పదవికి సుఖ్‌బీర్ సింగ్ రాజీనామా



**చండీగఢ్:** శిరోమణి అకాలీ దళ్ (ఎస్ఎడి) పార్టీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ పార్టీ అధ్యక్ష పదవికి సుఖ్‌బీర్ సింగ్ బాదల్ శనివారం నాడు రాజీనామా చేశారు. సిక్కు మత సూత్రాలు ఉల్లంఘించిన వ్యక్తిగా ఆయనను అకల్ తఖ్త్ ఇటీవల ప్రకటించింది. ఈ క్రమంలో శిరోమణి అకాలీ దళ్ పార్టీకి సుఖ్‌బీర్ సింగ్ బాదల్ రాజీనామా చేసి, ఆ లేఖను పార్టీ వర్కింగ్ కమిటీకి పంపారు. ఈ విషయాన్ని 'సాద్' సీనియర్ నేత దల్జిత్ సింగ్ చీమా ధ్రువీకరించారు. 'పార్టీ వ ర్కింగ్ కమిటీకి సుఖ్‌బీర్ సింగ్ రాజీనామా సమర్పించారు. దీంతో కొత్త అధ్యక్షు డి ఎన్నికకు మార్గం సుగగమైంది. తన నాయకత్వంపై నమ్మకం ఉంచి తనకు సహకరించిన పార్టీ నేతలు, కార్యకర్తలకు సుఖ్‌బీర్ కృతజ్ఞతలు తెలియజేశారు' అని దల్జీత్ తెలిపారు. శిరోమణి అకాలీ దళ్ ఒక ప్రజాస్వామిక పార్టీ అని, పార్టీ రాజ్యాంగం ప్రకారం అధ్యక్ష పదవికి ప్రతి ఐదేళ్లుకు ఒకసారి ఎన్నికలు జరుగుతాయని దల్జీత్ తెలిపారు. చివరిసారిగా 2019 డిసెంబర్ 14న ఎన్నికలు జరిగాయని, వచ్చే నెల డిసెంబర్ 14తో ఐదేళ్ల కాలపరిమితి ముగుస్తుందని చెప్పా రు. ప్రజాస్వామ్య ప్రక్రియలోనే అధ్యక్షుడు రాజీనామా చేశారని, నవంబర్ 18న వర్కింగ్ కమిటీ సమావేశమై, రాజీనామాపై పరిశీలన చేసి ఎన్నికలపై సమగ్ర ప్రకటన చేస్తుందని తెలిపారు. ఎన్నికల్లో ఎవరైనా పోటీ చేయవచ్చని, సభ తుది నిర్ణయం తీసుకుంటుందని, ఎవరికి మెజారిటీ ఉంటే వారు అధ్యక్షుడిగా ఎన్నిక అవుతారని చెప్పారు. కాగా, పంజాబ్‌లో కీలక అంశాలను పరిష్కరించడంలోనూ, రాజకీయ సవాళ్లను ఎదుర్కోవడంలోనూ శిరోమణి అకాలీ దళ్ చాలాకాలంగా విమర్శలకు గురవుతోంది. ఈ క్రమంలో బాదల్ రాజీనామా కీలక పరిణామంగా చెబుతున్నారు. పార్టీ పునరుజ్జీవనానికి, ప్రాధాన్యతా క్రమాలను మరోసారి హైలైట్ చేస్తూ పటిష్టం కావడానికి ఇదొక అవకాశమని అంటున్నారు.

# మహారాష్ట్రను కాంగ్రెస్ ఇటుక ఇటుక పేర్చి నిర్మించింది : చిదంబరం



**ముంబై :** మహారాష్ట్రను కాంగ్రెస్ పార్టీ ఇటుక, ఇటుక పేర్చి నిర్మించి భారతదేశంలోనే మొదటి స్థానంలో నిలిపిందని, ప్రస్తుత మహాయుతి ప్రభుత్వం ఆ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దిగజారుస్తున్నదని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పి.చిదంబరం విమర్శించారు. పరిశ్రమలు, సేవల రంగంలో మహారాష్ట్ర దేశంలో అగ్రస్థానంలో నిలిచిందని, వ్యవసాయ రంగంలో ఇతర రాష్ట్రాలతో కలిసి ముందుందన్నారు. ఈ రాష్ట్రం నాడు, నేడు దేశ ఆర్థిక రాజధాని అని ముంబాయిలో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అన్నారు. కానీ, ఎంత కాలం ఇది భారత వాణిజ్య రాజధానిగా ఉంటుందో తనకు తెలియదని ఆందోళన వ్యక్తం చేశారు. గడిచిన ఎనిమిది నుంచి పదేళ్ళలో కాంగ్రెస్ అధికారంలో లేదని, మధ్యలో రెండున్నరేళ్ళుమహా వికాస్ ఆఘాడీ ప్రభుత్వం ఉన్నదని, ప్రస్తుత ప్రభుత్వాన్ని బిజెపి, దాని మిత్రపక్షాలు నడిపిస్తున్నాయన్నారు. బిజెపి ప్రభుత్వంలో మహారాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దిగజారుతుండడం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. 2022–23,2023–24లలో మహారాష్ట్ర స్థూల రాష్ట్ర వృద్ధి రేటు 9.4 నుంచి 7.6 శాతానికి పడిపోయిందన్నారు. ద్రవ్య లోటు రూ.67 వేల కోట్ల నుంచి రూ.1,12,000 కోట్లకు పెరిగిందని, రాష్ట్ర వ్యవసాయ వృద్ధి రేటు 4.5 నుంచి 1.9 శాతానికి, సేవా రంగం వృద్ధి రేటు 13 శాతం నుంచి 8.3 శాతానికి పడిపోయిందని, మూలధన వ్యయం రూ.85వేల కోట్ల వద్ద నిలిచిపోయిందని వివరించారు. ఈ తిరోగమనాన్ని అడ్డుకోవాలని, దీనికి కారణమైన వారు ఆ పని చేయలేరని చిదంబరం అన్నారు. మహారాష్ట్రలో ఉద్యోగాలు లేవని, దీంతో సామాజిక రుగ్మతలు రాజ్యమేలుతున్నాయని ఆరోపించారు. నిరుద్యోగం అత్యంత పెద్ద సమస్య అని, దీనికి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం వద్ద సమాధానం లేదన్నా. రాష్ట్రం ఆకర్షించిన పరిశ్రమలు కేవలం ఎంఒయులపై సంతకాలు, పెట్టుబడి వాగ్దానాలకే పరిమితమయ్యాయని, వాటి ఏర్పాటుకు స్థలాలు చూపినా ఇప్పటి వరకు వాస్తవ రూపం దాల్చలేదన్నారు. ఆ పరిశ్రమలన్నీ ఎక్కడికి వెళ్ళాయో (గుజరాత్‌కు) మీకు తెలుసునని అన్నారు. మహారాష్ట్ర యువతలో నిరుద్యోగ రేటు 10.8 శాతమని, 47 శాతం స్వయం ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ప్రతి నెల వేతనాలు పొందే వారి శాతం 40 నుంచి 31 శాతానికి పడిపోయిందని, మహారాష్ట్రలో 18,300 కానిస్టేబుల్, డ్రైవర్ పోస్టుల కోసం 11 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని, 4,600 తలతి (రెవెన్యూ అధికారి) పోస్టుల కోసం 11.5 లక్షల మంది యువత దరఖాస్తులు చేసుకున్నారంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చన్నారు.

## కోడ్ ఉల్లంఘన ఫిర్యాదులపై నడ్డా, ఖర్గేలకు ఇసి లేఖ




**న్యూఢిల్లీ :** అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మహారాష్ట్ర, జార్ఖండ్‌లలో అధికార, విపక్ష పార్టీల మధ్య పరస్పర ఆరోపణలు, విమర్శలు తీవ్రమయ్యాయి. ఈ క్రమంలోనే ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించారంటూ బిజెపి, కాంగ్రెస్ నేతలు ఇటీవల ఒకరిపై ఒకరు ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన ఇసి.. ఇరు పార్టీల అధ్యక్షులు జెపి నడ్డా, మల్లికార్జున ఖర్గేలకు వేర్వేరుగా లేఖలు రాసింది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తన ప్రసంగంలో ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారంటూ ఇసికి ఇటీవల కాషాయ పార్టీ ఫిర్యాదు చేసింది. మరోవైపు.. కేంద్ర మంత్రి అమిత్ షా కూడా ఇదే తప్పిదానికి పాల్పడ్డారంటూ హస్తం పార్టీ సైతం ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించింది. ఈ నేపథ్యంలోనే తమ నేతలపై వచ్చిన ఫిర్యాదులపై ఈ నెల 18వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట కల్లా అధికారిక వివరణ ఇవ్వాలని ఇరుపార్టీల అధ్యక్షులకు ఎన్నికల సంఘం ఆదేశించింది. సంబంధిత ఫిర్యాదులనూ రెండు పక్షాలకు చేరవేసింది. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల సందర్భంగా స్టార్ క్యాంపెయినర్లకు చేసిన సూచనలను ప్రస్తావించింది. జాతీయ పార్టీల స్టార్ క్యాంపెయినర్లు ఇతరులకు ఆదర్శంగా మెలగాలని, సమాజంలో సున్నితమైన కూర్పును పాడుచేయొద్దని లోక్‌సభ ఎన్నికల సమయంలో ఇసి సూచించింది. తమ మాటలు, ప్రస్తావనల్లో సంయమనం ఉండేలా చూసుకోవాల్సిన బాధ్యత ప్రధానంగా అగ్రనేతలపైనే ఉందని పేర్కొంది. ఇదే విషయాన్ని ఎన్నికల సంఘం తాజాగా మరోసారి గుర్తుచేసింది.

# మణిపూర్‌లో భారీ భద్రతా బలగాల మోహరింపు




**ఇంఫాల్ :** మణిపూర్ రాష్ట్రంలో మళ్లీ హింస ప్రజ్వరిల్లుతోంది. ఆందోళనలు తీవ్రతరం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. మణిపూర్‌లో అన్ని రకాల భద్రతా బలగాలను మోహరింపజేసి అవసరమైన గట్టి చర్యలు చేపట్టాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ (ఎంహెచ్ఎ) ఆదేశాలను జారీ చేసింది. గత కొద్దిరోజులుగా మణిపూర్ రాష్ట్రంలో భద్రత పరిస్థితి ఇంకా అదుపులోకి రాకపోవడంతో కేంద్రంఈ ఆదేశాలు జారీ చేసింది.గత సోమవారం 11మంది అనుమానిత మిలిటెంట్లు మణిపూర్‌లో తాజాగా హింసను ప్రజ్వరిల్లజేయడంతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అప్రమత్తం అయ్యింది. అనుమానిత మిలిటెంట్లు ఒక పోలీస్ స్టేషన్ మీద దాడి చేయడమమేకాకుండా, సమీపంలోనే ఉన్నటువంటి మణిపూర్‌లోని జిరిబం జిల్లాలో ఉన్నటువంటి కేంద్ర రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సిఆర్‌పిఎఫ్) శిబిరంపై ఆయుధాలతో విరుచుకుపడి అందులో ఉన్న వారిని చంపి నిప్పు పెట్టింది. ఒక రోజు అనంతరం అంటే మంగళవారం నాడు జిరిబం జిల్లాలోనే ఒక మహిళ, పిల్లలు సహా ఆరుగురు పౌరులను సాయుధ మిలిటెంట్లు అపహరించుకుపోయారు. శాంతికి విఘాతం కలిగించే కార్యకలాపాలకు పాల్పడుతూ హింస చెలరేగేందుకు ప్రయత్నించే ఏ ఒక్కరినీ వదలకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తెలియజేసింది,'శాంతిని పునరుద్ధరించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకోవాలని భద్రతా బలగాలను ఆదేశించడమైంది.శాంతికివిఘాతం కలిగిస్తూ హింసను ప్రజ్వరిల్లచేయాలనుకునే వారు ఎంతటి వారైనా వదలొద్దు' అని ఆ ఆదేశాలలో తెలియజేసింది.శాంతి నెలకొనేలా ప్రజలు సహకరించాలని , ప్రజలు పుకార్లను విశ్వసించవద్దని, మణిపూర్‌లో శాంతి భద్రతలను నిర్వహించడంలో భద్రతా బలగాలకు సహకరించాలని ఎంహెచ్ఎ అభ్యర్థించింది. శాంతిభద్రతలు సున్నితంగా మారడంతో హింస ప్రజ్వరిల్లిన జిరిబం జిల్లా సహా మణిపూర్‌లోని ఆరు పోలీస్ స్టేషన్ల ప్రాంతాలలో కేంద్రం ఆర్మ్‌డ్ బలగాల (ప్రత్యేక అధికారాలు) (అఫ్స్పా) చట్టాన్ని గురువారం పునరుద్ధరించింది.19 పోలీస్ స్టేషన్ ఏరియాలు (ఆరు పోలీస్ స్టేషన్లు సహా) మణిపూర్ రాష్ట్ర వ్యాప్తంగా మణిపూర్ ప్రభుత్వం 'అఫ్స్పా' ఆదేశాలు అక్టోబరు 1వ తేదీ నుంచి తాజా ఆదేశం అమలులోకి వచ్చింది. ఇంఫాల్, లాంఫాల్, సిటీ, సింగ్జమేయి, సెక్మాయి, లాంసాంగ్. పాట్సోయి, వాంగోయి, పొరంపట్, హీన్‌గాంగ్, లామ్‌లాయి, ఇరిల్‌బంగ్, లీమఖోంగ్, తౌబాల్, బిష్ణుపూర్, నాంబోల్, మోయిరాంగ్, కాక్‌చింగ్, జిరిబం జిల్లాలోని పోలీస్ స్టేషన్లను మణిపూర్ ప్రభుత్వం అక్టోబరు 1 ఆదేశాలనుంచి మినహాయించబడ్డాయి. ఒక ఏరియా లేదా జిల్లాలో 'అఫ్స్పా' కింద భద్రతా బలగాల ఆపరేషన్ల మూలంగా ఆటంకం కలుగుతుందని గుర్తించబడినట్లయితే, 'అఫ్స్పా' ఆర్మ్‌డ్ బలగాలకు ఆటంకాలు కలుగుతున్న ప్రాంతాలను సోదా చేసేందుకు ఒక ప్రత్యేక అధికారాలను కల్పిస్తోంది. ప్రజలకు శాంతిభద్రతలను పరిరక్షించే సయమంలో ఎవరు అడ్డుకున్నా అరెస్ట్ చేయడం లేదా కాల్పులు జరిపే అధికారాలు బలగాలకు లభించాయి. సెక్మాయి, ఇంఫాల్ పశ్చిమ జిల్లాలోని లాంసాంగ్, మణిపూర్ తూర్పు జిల్లాలోని లాంలాయి, జిరిబం జిల్లాలోని జిరిబం, బిష్ణుపూర్‌లోని మొయిరంగ్, కాంగ్‌పోక్పిలోని లీమఖోంగ్ పోలీస్ స్టేషన్ల ప్రాంతాలలో 'అఫ్స్పా'ను పనురుద్ధరించడం జరిగింది. గత ఏడాది నుంచి ఇంఫాల్ లోయమెయిటీస ఆధారిత, కుకీజో గ్రూప్‌లకు పట్టు ఉన్న చుట్టుపక్కల కొండలలో హింస ప్రజ్వరిల్లి దాదాపు 200మందికి పైగా ప్రజలు చంపబడ్డారు. వేలాదిమంది నిరాశ్రయులయ్యారు.

**మంత్రులు, ఎమ్మెల్యేల నివాసాల ముట్టడి, విధ్వంసం నేపథ్యంలో కర్ఫ్యూ పునరుద్ధరణ..**

'నిరసనకారులు శనివారం మణిపూర్ రాష్ట్రం ఇంఫాల్‌లోని జిరిబంలో ముగ్గురు ఎమ్మెల్యేలు, ఇద్దరు మంత్రుల నివాసాలను ముట్టడించి హత్యచేయబడిన ముగ్గురు వ్యక్తులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు' అని పోలీసులు చెప్పారు. ముగ్గురు ఎమ్మెల్యేల నివాసాలపై దాడులు జరిగిన నేపథ్యంలో నిరవధిక కాలానికి జిల్లాలో నిషేధిత ఉత్తర్వులను ఇంఫాల్ పశ్చిమ అధికార యంత్రాంగం విధించింది. ఇంఫాల్ పశ్చిమ జిల్లా మెజిస్ట్రేట్ టిహెచ్. కిరణ్‌కుమార్ జారీ చేసిన ఆదేశం ప్రకారం శనివారం సాయంత్రం 4.30గంటల నుంచి కర్ఫ్యూ విధించబడింది. అల్లరిమూక లాంఫెల్ సనకీథెల్ ప్రాంతంలోని ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సపం రంజన్ నివాసాన్ని ముట్టడించిందని ఒక సీనియర్ పోలీస్ అధికారి చెప్పారు. నిరసనకారులు వినియోగదారు వ్యవహారాలు, ప్రజా పంపిణీ శాఖ మంత్రి ఎల్ సుసింద్రో సింగ్ ఇంటిని కూడా ముట్టడించిందని మరొక సీనియర్ పోలీస్ అధికారి చెప్పారు.

## ఆరుగురిలో..ముగ్గురి మృతదేహాలు లభ్యం

మణిపూర్ రాష్ట్రంలోని జిరిబం జిల్లా నుంచి తప్పిపోయిన ఆరుగురి వ్యక్తులలో ముగ్గురి మృతదేహాలు శనివారం నాడు మణిపూర్ అసోం సరిహద్దు పొడవున ఉన్న బారక్ నది, జిరి నది సంగమం వద్ద లభ్యం అయ్యాయి. ఈ విషయాన్ని అధికారులు తెలియజేశారు. కనుగొన్న ముగ్గురి మృతదేహాలలో ఒక మహిళ, ఇద్దరు పిల్లలవి ఉన్నాయి. సోమవారం జిరిబం జిల్లా నుంచి తప్పిపోయిన ఆరుగురు వ్యక్తులలో ముగ్గురి మృతదేహాలు శుక్రవారం రాత్రి జిరిబం జిల్లా బొరొబెకరాకు దాదాపు 16కి.మీ.దూరంలో ఈ ముగ్గురి మృతదేహాలు కనుగొన్నట్లు జిరిబం జిల్లాలో అధికారులు 'పిటిఐ'కి తెలిపారు. మృతదేహాలను గుర్తించాల్సి ఉంది. అయితే తప్పిపోయిన ఆరుగురు వ్యక్తులలో మరణించిన ముగ్గురు వ్యక్తులు అయి ఉంటారని అధికారులు అనుమానం వ్యక్తం చేశారు. అనుమానిత మృతదేహాలను శుక్రవారం రాత్రి శవపరీక్షల కోసం అసోంలోని సిల్‌చర్ మెడికల్ కాలేజి హాస్పిటల్ (ఎస్ఎంసిహెచ్)కు తీసుకువచ్చారు. తప్పిపోయిన ఆరుగురు వ్యక్తులకు సంబంధించినవేనా ఈ ముగ్గురు మృతదేహాలు ? కాదా? అనేది నిర్ధారించాల్సి ఉందని అధికారులు చెప్పారు. ఈ మృతదేహాల లభ్యం నేపథ్యంలో శుక్రవారం రాత్రి మణిపూర్ ముఖ్యమంత్రి ఎన్.బీరేన్‌సింగ్ మంత్రుల సమావేశం ఏర్పాటు చేసి పరిస్థితిని సమీక్షించారు.ఈ మూడు మృతదేహాల లభ్యం వార్తల నేపథ్యంలో ఇంఫాల్ వ్యాలీ అంతటా ముఖ్యంగా 5జిల్లాలలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

## రోడ్డు ప్రమాదంలో వధూవరులు సహా ఏడుగురు మృతి

**బిజ్నోర్ (యుపి) :** యుపిలోని బిజ్నోర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో నవ వధువు సహా ఏడుగురు మృతిచెందారు. జార్ఖండ్ నుండి తిరిగి వస్తున్న నూతన వధూవరులతో సహా ఏడుగురు వ్యక్తులు మరొక వాహనాన్ని ఓవర్‌టేక్ చేస్తుండగా వెనుక నుండి టెంపోను ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్లు పోలీసులు శనివారం తెలిపారు. డెహ్రాడూన్–నైనిటాల్ హైవేపై ధాంపూర్ అగ్నిమాపక కేంద్రం సమీపంలో శనివారం తెల్లవారుజామున 2 గంటల సమయంలో కారును ఢీకొట్టడంతో టెంపో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిందని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ అభిషేక్ తెలిపారు. వధూవరులతో సహా మొత్తం ఆరుగురు అక్కడికక్కడే మరణించగా, టెంపో డ్రైవర్ అజబ్ సింగ్‌ను చికిత్స కోసం తీసుకెళుతుండగా మరణించాడని చెప్పారు. ఇద్దరికి గాయాలయ్యాయని, మృతదేహాలను పోస్టుమార్టం నిమి త్తం తరలించామని పోలీసులు తెలిపారు. ధాం పూర్‌లోని తివారి గ్రామానికి చెందిన ఖుర్షీద్ (65) తన కొడుకు విశాల్ (25)కి జార్ఖండ్‌లో పె ళ్లి చేసి కోడలు ఖుషీ (22)తో కలిసి తిరిగి వస్తున్నాడు. వారితో పాటు ఖుర్షీద్ బావ ముంతాజ్ (45), ముంతాజ్ భార్య రూబీ (32), కూతురు బుష్రా (10) కూడా ఉన్నారని పోలీసులు తెలిపారు.




## వికసించిన టైటాన్ అరమ్ ఫ్లవర్



ప్రపంచంలోనే అతి పెద్ద పువ్వుల్లో ఒకటైన టైటాన్ ఆరమ్ పుష్పం ఆస్ట్రేలియాలో వికసించింది. ఇది 10 అడుగుల పొడవు పెరుగుతుంది. పదేళ్లకు ఒకసారి మాత్రమే వికసిస్తుంది కాబట్టి, ఈ పుష్పానికి విపరీతమైన క్రేజ్ ఉంది. ఇది పొడవైన, లేత పసుపురంగ ఫాలిక్ నిర్మాణాన్ని కలిగి ఉంటుంది. ఈ మొక్కకు పదేళ్లకోసారి పుష్పం వికసిస్తుంది. ఆరు నెలలు ఫలాలు కాస్తాయి. పరాగ సంపర్కాలను ఆకర్శించడానికి కుళ్లిన మాసం వంటి దుర్వాసనను వెదజల్లుతుంది. మాంసాహార తేనెటీగలు, జంతు కళేబరాల మీద వాలే ఈగలు ఈ కుళ్లిన మాంసం వాసన కారణంగా ఈ మొక్కలపై వాలతాయి. తత్ఫలితంగా జరిగే పరాగసంపర్కాన్ని 'సాప్రోమియోఫిలీ' అంటారు. ఈ జాతి ఎక్కువగా ఇండోనేషియాలోని పశ్చిమ సుమత్రా వర్షారణ్యాల్లోని సున్నపురాయి కొండలపై ఎక్కువగా కనిపిస్తుంది. ఆస్ట్రేలియాలో ఈ మొక్కలు దాదాపుగా ఉండవు. అరుదుగా పూచే ఈ పుష్పం ఆకట్టుకుంటున్నది. వేగంగా అంతరించిపోతున్న వృక్ష జాతుల్లో ఇది కూడా ఒకటికావడం ఆందోళన కలిగించే అంశం.

## ప్రపంచాన్ని చుట్టేద్దాం..



ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ ఏం చేసినా ఒక సంచలనమే. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేశాడు. ఈ ఎన్నికల్లో గెలిచిన ట్రంప్ ప్రత్యేకంగా డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియన్సీ (డిఒజిఇ) వ్యవస్థను ఏర్పాటు చేసి, దాని నిర్వహణ బాధ్యతను మస్క్, వివేక్ రామస్వామికి అప్పగించిన విషయం తెలిసిందే. స్పేస్ఎక్స్ వ్యోమనౌకతో ప్రైవేటు రోదశీ యాత్రలు నిర్వహిస్తున్న మస్క్, ఇప్పుడు కేవలం 40 నిమిషాల్లోనే న్యూయార్క్ నుంచి షాంఘై వరకూ ప్రయాణించడం సాధ్యమేనంటూ మరో సంచలన ప్రకటన చేశాడు. అంతకు ముందు ఇవిఎంలను ట్యాంపరింగ్ చేయడం కష్టమేమీ కాదని ప్రత్యక్షంగా చూపించిన మస్క్, రవాణాలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టనున్నాడు. గంటకు 16,700 మైళ్లు (సుమారు 26,876 కిలోమీటర్లు) వేగంతో ప్రయాణం సాధ్యమని అంటున్నాడు. తక్కువ గురుత్వాకర్షణలో ప్రయాణం చేయడం ద్వారా ఈ వేగం సాధ్యమవుతుందని చెప్తున్నాడు. అతని ఆలోచనలో మెదలిన 'ఎర్త్ టు ఎర్త్' అంతరిక్ష ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు కొనసాగుతున్నాయి. ఖండాంతర విమానాలను రాకెట్ మాదిరి చేయించి, కొన్ని నిమిషాల్లోనే అనుకున్న గమ్యస్థానాల వద్ద ల్యాండ్ చేయించాలన్నది మాస్క్ ఆలోచన. సుమారుగా దశాబ్ద క్రితమే అతను ఇలాంటి ఒక ప్రయోగం అవసరమని పేర్కొన్నాడు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ గెలిస్తే, ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళతానని ప్రకటించాడు. ఇప్పుడు ట్రంప్ విజయం సాధించడంతో, తాను ఇచ్చిన హామీని నెరవేర్చడానికి జోరుగా ప్రయత్నాలు చేస్తున్నాడు. మస్క్ ప్రాజెక్టు సజావుగా సాగితే, కొన్ని గంటల వ్యవధిలోనే ప్రపంచాన్ని చుట్టేయవచ్చు.

## అమెరికా అధ్యక్షుడి జీతం ఎంత?



అమెరికా అధ్యక్షుడిగా రిపబ్లికన్ పార్టీ తరఫున ఎన్నికైన మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇంకా పదవీ బాధ్యతలు తీసుకోలేదు. అప్పటి వరకూ ప్రస్తుత అధ్యక్షుడు జో బైడెన్ తాత్కాలికంగా ఆ బాధ్యతలు నిర్వర్తిస్తారు. కాగా, అధ్యక్ష ఎన్నికల పర్వం పూర్తికావడంతో, జీతభత్యాలపై ఆసక్తి ఉండడం సహజం. అమెరికా అధ్యక్షుడు వార్షిక వేతనం 400,000 డాలర్లు (సుమారు 33.77 కోట్ల రూపాయలు). దీనితోపాటు అధికారిక విధుల నిర్వహణ కోసం ఏడాదికి మరో 50,000 డాలర్లు (సుమారు 42.21 లక్షల రూపాయలు), ప్రమాణ స్వీకారం చేసే సమయంలో, వైట్ హౌస్ నిర్వహణ వంటి ఖర్చుల నిమిత్తం 1,00,000 డాలర్లు (సుమారు రూ. 84.42 లక్షలు), ఆతిథ్య ఖర్చుల కింద 19000 డాలర్లు (ఉరపానర 16.04 లక్షల రూపాయలు) అందచేస్తారు. అమెరికా అధ్యక్షుడి జీతాలు చివరిసారిగా 2001లో పెరిగాయి. అప్పటి నుంచి ఇప్పటి వరకూ అవే జీతభత్యాలు కొనసాగుతున్నాయి. అమెరికా మొట్టమొదటి అధ్యక్షుడు జార్జ్ వాషింగ్టన్ ఏడాదికి కేవలం 2,000 డాలర్లు జీతంగా పొందారు. అయితే 18వ శతాబ్దంలో ఈ జీతం ఎక్కువ విలువైనదిగానే పరిగణిస్తారు. ఆ తర్వాత కాలం గడిచే కొద్దీ సంపదలో వృద్ధి, అధ్యక్షుల ఖర్చులు పెరిగిపోవడంతో జీతం కూడా క్రమంగా పెరుగుతూ వచ్చింది. అమెరికా ప్రెసిడెంట్ పదవీ విరమణ చేసిన తర్వాత వారికి వార్షిక పెన్షన్ లభిస్తుంది. ప్రస్తుతం అది 240 వేల డాలర్ల కన్నా (సుమారు రూ. 2 కోట్లు ) కన్నా ఎక్కువగా ఉంది. ప్రెసిడెంట్‌కు ఈ పెన్షన్ జీవితకాలం లభిస్తుంది.

**ఎప్పుడెప్పుడు ఎంతెంత?** 1789లో 25,000 డాలర్లు, 1873లో 50,000 డాలర్లు, 1909లో 75, 000డాలర్లు,1949లో100,000డాలర్లు,1969లో200,000డాలర్లు,2001లో 400,000 డాలర్లు.

## నాగాలాండ్ కొండల్లో అరుదైన కందిరీగ



నాగాలాండ్‌లోని ఖుజామా జిల్లాలోవున్న కొండల్లో, సముద్రమట్టానికి సుమారు 1,800అడుగుల ఎత్తులో అరుదైన కందిరీగను ఇటీవల కనుగొన్నారు. దీనిని 'అర్ఫాక్టోఫిలస్ పులావ్‌స్కీ' జాతికి చెందినదిగా నిర్ధారించారు. అర్ఫాక్టోఫిలస్ జాతి కందరీగలు ఆస్ట్రేలియా ప్రాంతంలో అధికం. అవి నాగాలాండ్‌లో కనిపించడం విశేషం. వీటి పరిమాణం సాధారణ కందిరీగల కంటే పెద్దదిగా ఉంటుంది. తల ఆకృతి కూడా భిన్నంగా ఉంటుంది. అంతేగాక, వైవిధ్యభరితమైన పదనిర్మాణాన్ని కలిగి ఉంటుంది. ఇవి గూళ్లను కూడా విలక్షణంగా నిర్మించుకుంటాయి. మట్టిగూళ్లకు ఆడ అల్ఫాక్టోఫిలస్‌లు తమ పొత్తికడుపు నుంచి వచ్చే పట్టును ఉపయోగించి, రక్షణ కవచాన్ని ఏర్పరుస్తాయి.

## వన్యప్రాణులపై నిర్లక్ష్యం!



అమ్చాంగ్ అభయారణ్యం... వన్యప్రాణులను పరిరక్షించడమే దీని ప్రధాన లక్ష్యం. కానీ, ఇటీవల అభయారణ్యంలోని ఖానాపరా శ్రేణిలో ఒక ఏనుగు కళేబరం కనిపించింది. అక్కడి అధికారులకు ఏనుగు చనిపోయిన విషయం కూడా తెలియదని కుళ్ళిన కళేబరమే స్పష్టం చేస్తున్న ది. అమ్చాంగ్ అభయారణ్యం మూడు రిజర్వ్ ఫారెస్టుల కలయిక. ఇందులో ఖానాపరా, అమ్చాంగ్, దక్షిణ అమ్చాంగ్ రిజర్వ్ ఫారెస్టులు ఉన్నాయి. ఉత్తరాన బ్రహ్మపుత్రానది నుంచి దక్షిణాల మేఘాలయలోని కొండ అడవుల వరకూ ఇది విస్తరించింది. ఇవి ఖాసీ హిల్ సాల్ అడవులు, తూర్పు హిమాలయ అడవుల మిశ్రమ ఆకురాల్చే అడవులు. ఇక్కడ ఒండ్రు మట్టి ఎక్కువ. అతిపెద్ద ఆకురాల్చే చెట్ల జాతుల్లో ఒకటైన సాల్ చెట్లు (షోరియా రోబస్టా) ఇక్కడ ఎక్కువ. ఈ జాతి భారత ఉపఖండానికి చెందింది. అయితే, మన దేశంతోపాటు నేపాల్, భూటాన్, బంగ్లాదేశ్ అడవుల్లోనూ కనిపిస్తుంది. అమ్చాంగ్ అభయారణ్యంలో ఫయింగ్ ఫాక్స్, స్లో లోరిస్, అస్సామీ మకాక్, రీసస్ మకాక్, హూలాక్ గిబ్బన్, పోర్కుపైన్. వైట్ బ్యాక్డ్ రాబందు, స్లెండర్‌బిల్ రాబందులు ఉన్నాయి.

## రెండేళ్ల తర్వాత 'ఐఎస్‌సి'

కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య పరస్పర సహకారం కోసం ఏర్పాటు చేసిన ఇంటర్ స్టేట్ కౌన్సిల్ (ఐఎస్‌సి) మోదీ సర్కారుకు రెండేళ్ల తర్వాత గుర్తుకొచ్చింది. బిజెపియేతర ప్రభుత్వాలున్న రాష్ట్రాలను ఏదో ఒక రకంగా ఇబ్బందులు పెడుతున్న కేంద్రం, హఠాత్తుగా సమాఖ్య స్ఫూర్తిని ఉటంకిస్తూ, ఐఎస్ సిని పునర్నిర్మించింది. 2022లో చివరిసారి దీనిని పునర్వ్యవస్థీకరించారు. దేశంలో కేంద్ర–రాష్ట్ర, అంతర్‌రాష్ట్ర సహకారాన్ని సులభతరం చేయడానికి, రాజ్యాంగంలోని 263 ఆర్టికల్ ప్రకారం దీనిని నెలకొల్పారు. ఈ అధికరణ రాష్ట్రాల మధ్య మెరుగైన సమన్వయం కోసం ఐఎస్‌సి స్థాపన అధికారాన్ని రాష్ట్రపతికి అప్పగిస్తుంది. 1988లో సర్కారియా కమిషన్ దీనిని శాశ్వత సంస్థగా మార్చాలని సిఫార్సు చేసింది. దేశంలో సమాఖ్య స్ఫూర్తి నెలకొనాలంటే ఈ చర్య అనివార్యమని పేర్కొంది. ఈ సిఫార్సు మేరకు 1990లో ఐఎస్‌సిని శాశ్వత సంస్థగా పేర్కొంటూ అప్పటి రాష్ట్రపతి ఆర్. వెంకటరామన్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సంస్థకు ప్రధాని ఛైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. అన్ని రాష్ట్రాలు, శాసనసభ కలిగి ఉన్న కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, శాసనహన లేని కేంద్రపాలిత ప్రాంతాల ప్రతినిధులు సభ్యులుగా ఉంటారు. వీరితోపాటు ప్రధాని ఆరుగురు కేబినెట్ ర్యాంక్ మంత్రులను నామినేట్ చేస్తారు. కేంద్ర హోం మంత్రి అధ్యక్షతన ఒక స్టాండింగ్ కమిటీ ఏర్పడి, ప్రధాని ఆమోదంతో ఎప్పటికప్పుడు ఐఎస్‌సిని పునర్నిర్మించాల్సి ఉంటుంది. కేంద్రం, రాష్ట్రాల మధ్య లేదా వివిధ రాష్ట్రాల మధ్య తలెత్తే సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించేందుకు ఐఎస్‌సి కృషి చేస్తుంది.

**బిఎస్ఎస్ మైత్రేయి**

# ఈనాటి ఈ బంధం ఏనాటిదో!

మహారాష్ట్ర మహాయుతి ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా ఉన్న నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్‌సిపి) నాయకుడు అజిత్ పవార్ ఇటీవల ఒక డిజిటల్ పోర్టల్‌కిచ్చిన ఇంటర్వ్యూలో 2019లో ఒక ఉన్నతస్థాయి సమావేశంలో ప్రధాని నరేంద్రమోదీకి అత్యంత సన్నిహితుడిగా పేరొందిన నవతరం బడా పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ పాల్గొన్నట్లు వెల్లడించిన విషయం మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రకంపనలు సృష్టిస్తున్నది. ఎన్నికలప్పుడు, ఎన్నికల్లో హంగ్ అసెంబ్లీ ఏర్పడినప్పుడు రాజకీయ నాయకులు ఎత్తులుజిత్తులతో రాజకీయ క్రీడలు ఆడటం కొత్తేమీ కాదు. అలాగే పాలకవర్గ పార్టీలతో బడా పెట్టుబడిదారులు పూసుకుని రాసుకుని తిరగటం, ఆర్థికంగా వాటి కొమ్ముకాయటం చిరకాలంగా జరుగుతున్నదే. సరళీకృత ఆర్థిక విధానాలు ప్రవేశించిన తదుపరి రాజకీయాల దరిలో ఉండే పారిశ్రామికవేత్తల ప్రత్యక్ష జోక్యం పెరిగింది. పాలకవర్గ పార్టీలు కూడా (ప్రాంతీయ పార్టీలకూ మినహాయింపు లేదు) ఆశ్రిత పెట్టుబడిదారులను పెంచిపోషిస్తున్నాయి, ప్రతిఫలం పొందుతున్నాయి.

నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో అంబానీ, అదానీ తదితర ఆశ్రితులు ప్రభుత్వ అండతో వేగంగా వృద్ధిలోకి వచ్చారు. అదే సమయంలో మోదీ ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్లు ప్రవేశపెట్టి పుష్కలంగా నిధులు కొల్లగొట్టింది. రాజకీయ విస్తరణకు, ఎమ్మెల్యేల కొనుగోలు ద్వారా తమ ప్రభుత్వాల ఏర్పాటుకు, ప్రతిపక్ష ప్రభుత్వాలను కూలగొట్టేందుకు ధనాన్ని విరివిగా వెచ్చించింది. ఇది బహిరంగ రహస్యం.

అయితే 2019లో – అనగా మహారాష్ట్రలో గత అసెంబ్లీ ఎన్నికల్లో మెజార్టీ పొందిన బిజెపి–శివసేన అలయెన్స్ విచ్ఛిన్నమైన తదుపరి కొత్త రాజకీయ పొందికలకు జరిగిన ప్రయత్నాల్లో గౌతమ్ అదానీ ప్రత్యక్షంగా పాల్గొన్న ఉదంతం ఇప్పుడు చర్చనీయాంశంగా ఉంది. మెజారిటీలేని బిజెపిని అందలమెక్కించే ప్రయత్నం లో అదానీ ఢిల్లీలోని తమ ఇంట్లో ఒక సమావేశం ఏర్పరిచారట. అందులో కేంద్ర హోం మంత్రి అమిత్ షా, గౌతమ్ అదానీ, ప్రఫుల్ పటేల్, ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నావీస్, శరద్ పవార్, తాను పాల్గొన్నట్లు అజిత్ పవార్ వెల్లడించారు. దేవేంద్ర ఫడ్నావీస్ ఆ సమావేశాన్ని ధృవీకరించారు, కాని అదానీ ఆ సమావేశం ఏర్పాటు చేశారుగాని, పాల్గొన లేదన్నారు. '2019లో ఐదు సమావేశాలు జరిగాయి. అందరూ పాల్గొన్నారు. ప్రతిదీ నిర్ణయం జరిగింది. చివరకు నింద నా మీద పడింది, అందరూ సురక్షితంగా ఉన్నారు' అని చెప్పారు అజిత్ పవార్ – ఎన్‌డిటివిని అదానీ కొనకముందు అందులో పనిచేసిన ఒక జర్నలిస్టుతో. ఆ సమావేశం నిర్ణయం ప్రకారమే కావచ్చు – గవర్నర్ పొద్దుపొద్దున్నే ఫడ్నావీస్ చేత ముఖ్యమంత్రిగా, అజిత్ పవార్ చేత డిప్యూటీ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయించారు. పవార్ కుటుంబానికి అజిత్ ద్రోహంచేసి బిజెపితో కలిశారని శరద్ వైపు నుంచి నింద రావటంతో ఆయన రాజీనామా చేశారు. వారు 80 గంటలు అధికారంలో ఉన్నారు. తర్వాత రాష్ట్రపతి పాలన విధించబడింది. కాంగ్రెస్, శివసేన, ఎన్‌సిపి మహావికాస్ అగాఢిగా ఏర్పడి సేన నేత ఉద్ధావ్ థాక్రే ముఖ్యమంత్రిగా ప్రభుత్వ ఏర్పాటు చేశారు. దాన్ని జీర్ణించుకోలేని బిజెపి రెండున్నర ఏళ్ల తదుపరి శివసేన, ఎన్‌సిపిలను నిలువునా చీల్చి ఏక్‌నాథ్ షిండె (శివసేన) ముఖ్యమంత్రిగా, దేవేంద్ర ఫడ్నావీస్ ఉపముఖ్యమంత్రిగా మహాయుతి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కొద్దికాలం తదుపరి ఎన్‌సిపి నుండి మెజారిటీ ఎమ్మెల్యేలతో బయటకు వచ్చిన అజిత్ పవార్ ఉపముఖ్యమంత్రి గా ఆ ప్రభుత్వంలో చేరారు.

**ప్రజాపక్షం**
**17-11-2024, ఆదివారం**

ఈ పరిణామాల్లో శివసేన, అజిత్ పవార్ అనుకూల ఎమ్మెల్యేలను బయటకు రాబట్టటానికి, లగ్జరీ రిసార్ట్స్‌లో క్యాంపుల నిర్వహణకు ఎంతో ఖర్చయింది. ఎమ్మెల్యేకు రూ.50లక్షలు, ఒక కోటి రూపాయలు ముట్ట చెప్పారని అప్పట్లో ఆరోపణలు విరివిగా ప్రచారంలోకి వచ్చాయి. బిజెపికి ఈ డబ్బంతా ఎక్కడనుండి వచ్చింది. అదానీ ఉండగా చింతేలా అనుకున్నారు. ఒక వ్యాపారి, అందునా గుజరాతీ వ్యాపారి ప్రతిఫలం ఆశించకుండా ఇంత పెట్టుబడి పెడతారా? ధారవి రీ డెవలప్‌మెంట్ ప్రాజెక్టు సహా అదానీ వ్యాపారాలన్నీ లబ్ధిపొందాయని ప్రతిపక్షం ఆరోపిస్తున్నది.

ఐదేళ్ల క్రితంనాటి ఉన్నతస్థాయి గోప్యపు సమావేశం ఇప్పుడే ఎందుకు బయటకు వచ్చింది? మహాయుతిలో అజిత్ పవార్ సంతోషంగా లేరు. ఆయన్ను ఆర్ఎస్ఎస్ గట్టిగా వ్యతిరేకిస్తున్నది. ఎన్నికల ఫలితాలెలా ఉంటాయో! అవసరమైతే పవార్ కుటుంబంలోకి పునరాగమనానికి అజిత్ ఆలోచిస్తున్నారేమో! ఎన్నికల అనంతరం అజిత్ పవార్‌ను ఆహ్వానిస్తారా అని శరద్ పవార్‌ని విలేకరులు ప్రశ్నిస్తే, బిజెపితో సంబంధం ఉన్నవారెవరినీ ఆహ్వానించబోమన్నారుగాని సూటిగా జవాబు చెప్పలేదు. రాజకీయ చదరంగంలో ఏ పావు ఎప్పుడు ఎవరికి ఉపయోగపడుతుందో!ఎవరు చెప్పగలరు!

# కొడంగల్‌లో నిఘా కరువైందా? నిర్లక్ష్యం ఆవహించిందా?

కొడంగల్ నియోజకవర్గంలో నిఘా కరువైందా... ఫార్మా కంపెనీపై ఇంటలిజెన్స్ వర్గాలు రిపోర్ట్ ఇచ్చిన కలెక్టర్ ఎందుకు రైతుల వద్దకు వెళ్లారు.. దాడి చేయాల్సిన అవసరం రైతులకు ఎందుకు వచ్చింది. చేసిన వారు రైతులా మరి ఎందుకు అనే అంశాలపై నియోజకవర్గమే కాకుండా రాష్ట్రవ్యాప్తంగా సంచలనమైన విషయాలు చర్చకు వస్తున్నాయి. కొడంగల్ నియోజకవర్గం నుంచి ఎంఎల్‌ఏగా గెలిచిన రేవంత్‌రెడ్డి రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టడంతో కొడంగల్‌ను రాష్ట్రానికి ఆదర్శంగా రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా, విద్యాపరంగా, ఉద్యోగపరంగా, అన్ని రంగాలలో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో దాదాపు రూ.5వేల కోట్ల నిధులతో అభివృద్ధికి శ్రీకారం చుట్టారు. కొడంగల్ మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో మెడికల్ కాలేజి నిర్మాణానికి రైతులు అభ్యంతరాలు వ్యక్తం చేసినా వారిని ఒప్పించి మెప్పించి భూమి తీసుకుని కళాశాలను ఏర్పాటు చేయడం జరిగింది. ప్రస్తుతం అడ్మిషన్స్ ప్రారంభం అయ్యాయి. ఈ తరుణంలోనే దుద్యాల్ మండల పరిధిలోని హకీంపేట, పోలేపల్లి, లగచర్ల , రోటిబండతాండ, పులిచెర్లతాండలలో అసైన్డ్ భూములతో పాటు పట్టా భూములు కూడా ఉన్నాయి. ఎన్నో ఏళ్లుగా సాగుచేసుకుంటు జీవనం సాగిస్తున్న రైతులకు న్యాయం చేసి భూములు తీసుకుని ఇండస్ట్రీయల్ హబ్‌గా ఏర్పాటు చేస్తే పరిశ్రమల పరంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందని భావించి జిల్లా కలెక్టర్ సమక్షంలో అధికారులు భూసేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా కొంతమంది బిఆర్ఎస్ నేతలు అడ్డంకులు సృష్టిస్తూ, పరిశ్రమలు వస్తే మన ఊర్లు నాశనం అవ్వడమే కాకుండా కాలుష్యంతో అనేక నష్టాలు వస్తాయని రైతుల్లో విస్తృత ప్రచారం చేశారు. దీంతో పలుమార్లు కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటి అధికారి (కడ) వెంకట్‌రెడ్డిని కలిసి వినతిపత్రాలను అందించారు. ఫార్మా కంపెని కాదు, దీనివల్ల ఎవ్వరికి ఎలాంటి నష్టం వాటిల్లదంటు వారికి నచ్చజెప్పడం జరిగింది. కాని మాకు అభివృద్ధి వద్దే వద్దు అంటు వారు తెగేసి చెప్పడం జరిగినట్లు సమాచారం. కొంతమంది రైతుల సమక్షంలో దుద్యాల్ మండల బిఆర్ఎస్ పార్టీ యూత్ ప్రెసిడెంట్ సురేష్‌రాజ్ నేతృత్వంలో పోలేపల్లి గ్రామ శివారులో టెంట్ వేసి రిలేనిరహార దీక్షలకు పూనుకోవడం జరిగింది. దీంతో ఆగకుండ పోలేపల్లి ఎల్లమ్మ ఆలయం నుంచి మాజీ ఎంఎల్‌ఏ పట్నం నరేందర్‌రెడ్డి సమక్షంలో దుద్యాల్ మండల కేంద్రం వరకు, కొడంగల్ కడ కార్యాలయం వరకు పాదయాత్రలు నిర్వహించే కార్యక్రమాలు చేపట్టారు. అదేవిధంగా ఇట్టి ఫార్మా కంపెనీపై చాలాసార్లు కెటిఆర్ వద్దకు వెళ్లి జరుగుతున్న పరిణామాలపై వివరించారు. దీనిపై స్పందించిన కెటిఆర్ రైతులకు అండగా ఉంటామని హామీలు ఇచ్చిన్నట్లు సమాచారం.

**ప్రభుత్వంపై ఆగ్రహం**

ఫార్మా కంపెని వద్దు, పంట పొలాలు ముందు అంటూ పలుమార్లు రైతులు ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేసినా ప్రభుత్వం వెనక్కి తగ్గకుండ ఒంటెత్తు పోకడ పోవడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మా బతుకులు ఇక్కడే... మా చావులు ఇక్కడే .. అంటు పిల్ల జెల్లల కాడ నుంచి ప్రతి ఒక్కరి నోట వస్తున్న మాట ఇది. ప్రాంతం బాగుపడాలంటే పరిశ్రమలు రావాలి. బతుకులు బాగుపడాలంటే పచ్చని పొలాలు ఉండాలే, మరి ప్రభుత్వం బతుకులు బాగుచేస్తుందా...? ప్రాంతం బాగుచేస్తుందా అంటూ ప్రశ్నించారు. 20 రోజుల క్రితం జిల్లా స్థాయి అధికారులు కూడా పోలేపల్లి గ్రామంలో రైతులతో ప్రత్యేక సమావేశాలను ఏర్పాటు చేసి ప్రజల అభిప్రాయాలను సేకరించాలని సమావేశాలను ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో అధికారులతో, రాజకీయ నాయకులతో రైతులు వాగ్వివాదం చేసి ఇక్కడ ఎలాంటి సమావేశాలు పెట్టవద్దంటు ఆగ్రహంతో అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. ఏదేమైనా ఘటనలు చోటుచేసుకుంటే రైతుల బాధ్యతకాదంటు విన్నవించారు.

**నిఘా వర్గాలు ఏమి చెప్పాయి**

లగచర్ల , పులిచర్లతాండ, రోటిబండతాండ రైతులనుంచి ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని అధికారులు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అయితే గ్రామంలో ఏర్పాటు చేస్తే రైతులు ఆగ్రహంతో ఉన్నారని, అక్కడ పెడితే ఇబ్బందులు వస్తాయని భావించి లగచర్ల గ్రామ శివారులోని ఓ పొలంలో టెంట్‌లు వేసి బారికేడ్‌లను ఏర్పాటు చేసి పకడ్బందీగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఏర్పాటు చేశారు. దాదాపు 300 నుంచి 400 మంది పోలీసు బలగాలతో భద్రత కల్పించారు. సమావేశ ప్రాంగణానికి కలెక్టర్ వచ్చేసమయానికి రైతులు ఎవ్వరు రాకపోవడంతో అధికారులను ప్రశ్నించారు. ఇంతలోనే సురేష్‌రాజ్ అనే వ్యక్తి కలెక్టర్ వద్దకు వచ్చి సార్ ఫార్మా కంపెనీపై ప్రజాభిప్రాయ సేకరణ అని చెప్పి మీరెందుకు సార్ వచ్చారు, ఫార్మా కంపెని వాళ్లు కదా సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సింది అంటు కలెక్టర్‌ను ప్రశ్నించారు.

రైతుల అభిప్రాయం అని చెప్పి రైతులు లేని దగ్గర ఎందుకు సమావేశాలు పెట్టారని కూడా ప్రశ్నించారు. దీంతో కలెక్టర్ అధికారులకు ఆదేశాలిచ్చి రైతులు ఎక్కడ ఉంటే అక్కడికే పోదాము అని చెప్పడం జరిగింది. ఇక్కడే అసలు సిసలైన ట్విస్ట్ వచ్చింది. పోలీసు నిఘా వర్గాలు హెచ్చరించినట్లు గ్రామంలో రైతులు ఆగ్రహంతో ఉన్నారు. అక్కడికి పోతే పరిస్థితి కంట్రోల్ తప్పే అవకాశం ఉందని స్థానికంగా ఉన్న నిఘా అధికారులు పై అధికారులకు సమాచారం ఇచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. కాకపోతే నిఘా పోలీసు అధికారుల సమన్వయ లోపామా.. నిర్లక్ష్యమో తెలియదు కాని ఎలాంటి పోలీస్ బందోబస్తు లేకుండా రైతుల వద్దకు కలెక్టర్ వెళ్లడంతో కలెక్టర్ గోబ్యాక్ అంటు నినాదాలు చేస్తు ఆందోళనకారులందరు కలెక్టర్‌పైకి దూసుకువచ్చి ఆగ్రహంతో రెచ్చిపోయారు. లగచర్ల గ్రామానికి కిలో మీటర్ల దూరంలో ఏర్పాటు చేసిన సమావేశ ప్రాంగణం వద్దనే ఉన్న పోలీసు బలగాలు విషయం తెలియడంతో హుటాహుటిన గ్రామానికి చెరుకునే లోపే దాడులు, అల్లర్లు, కారు ధ్వంసాలు విధ్వంసమే జరిగిపోయింది. పోలీసుల వైఫల్యాలను ప్రతి ఒక్కరు వేలెత్తిచూపడంతో జీర్ణించుకోలేని పోలీసు ఉన్నాతాధికారులు రాత్రికి రాత్రే తాండాలలో, గ్రామాలలో వందల మంది పోలీసులు ప్రజలను భయభ్రాంతులకు గురి చేసి దొరికిన వారిని దొరికినట్లు అరెస్టులు చేసి స్టేషన్‌లకు తరలించారు.

**దాడులకు సూత్రధారులెవరు...?**

ఫార్మా కంపెని వద్దురో మహాప్రభు అంటే ఈ ప్రభుత్వం వినేటట్టు లేదని ఆగ్రహంతో ఉన్న రైతులు ఏమి చేయాలో అర్థం కాక నిరసనలు వ్యక్తం చేసి తమ ప్రాణాలు అయిన ఇవ్వడానికి సిద్ధం అయ్యారే తప్ప అధికారులపై దాడులు చేయాలనే ఉద్దేశం లేదని రైతులు తమ ఆవేదనను చెబుతున్నారు. సమావేశానికి వచ్చిన జిల్లా కలెక్టర్, అడిషినల్ కలెక్టర్, కడ అధికారి, రెవెన్యూ అధికారులను ఒక కుట్ర కోణంలో డైవర్ట్ చేసిన సురేష్‌రాజ్ అనే వ్యక్తి కలెక్టర్‌కు మాయ మాటలు చెప్పి గ్రామంలోకి రప్పించడం జరిగింది. కలెక్టర్‌తో పాటే సురేష్‌రాజ్ కూడా వెళ్లాల్సి ఉంది. కాని అతడు గ్రామంలోకి వెళ్లలేదంటు ఆరోపణలు పుకార్లుగా వినిపిస్తున్నాయి. అధికారులపై దాడులు జరుగుతుంటే ఏ ఒక్క వీడియోలో గాని, ఫోటోలో గాని ఎక్కడ కూడా కనిపించడం లేదంటున్నారు. అప్పటికే సురేష్‌రాజ్ మాజీ ఎంఎల్‌ఏ పట్నం నరేందర్‌రెడ్డితో దాదాపుగా 40 సార్లు ఫోన్‌లో సంభాషించినట్లు, పట్నం నరేందర్‌రెడ్డి కూడా ఈ విషయంపై కేటీఆర్‌కు దాదాపు 10 సార్లు ఫోన్‌లో మాట్లాడినట్లు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఈ దాడులు కాస్త, రైతులను అడ్డంపెట్టుకుని రాజకీయ కోణంలోకి తీసుకువెళ్లి అన్యం పుణ్యం ఎరుగని రైతుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారంటు ప్రజలు మండిపడుతున్నారు.

**21 మంది అరెస్టు**

లగచర్ల గ్రామంలో అధికారులపై జరిగిన దాడి కేసులో 21 మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. దాడులకు ముఖ్యసూత్రదారి కొడంగల్ మాజీ ఎంఎల్‌ఏ పట్నం నరేందర్‌రెడ్డిని ఎ1 గా చేర్చి 14 రోజుల పాటు చర్లపల్లి జైల్‌కు తరలించారు. సురేష్‌రాజ్‌తో పాటు దాడులకు పాల్పడిన వారు పరార్‌లో ఉన్నట్లు తెలుస్తుంది. వారి కోసం పోలీసులు 4 బృందాలుగా ఏర్పాడి గాలిస్తున్నట్లు సమాచారం. వీళ్ల అధికారులపై దాడులు చేయకపోతే లేదా పురికొల్పకపోతే ఎందుకు పరార్‌లో ఉన్నట్లు? సురేష్ రాజ్ పట్టుబడితే అసలు దొంగలు ఎవ్వరు అనేది బట్టబయలు అవుతుందా..? అందుకే పరార్‌లో ఉన్నాడా అంటు కొడంగల్‌లో జోరుగా చర్చలు సాగుతున్నాయి. దాడుల వెనుక ఎవ్వరు ఉన్న వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వార్నింగ్‌లు కూడా ఇచ్చినట్లు సమాచారం.

( ప్రజాపక్షం/కొడంగల్–ప్రత్యేక కథనం)

# వ్యక్తిగత వైరంగా మారిన రాజకీయ రణక్షేత్రం

రోజురోజుకు అధికార కాంగ్రెస్‌తో ప్రతిపక్ష బిఆర్ఎస్ వివాదాలు శృతిమించిపోతున్నాయి. నాయకుల మధ్య వ్యక్తిగత స్థాయిలో వైరం కొనసాగుతుండడంతో ఈ వ్యవహారం ఎటు పోతుందోననే ఆందోళన వ్యక్తమవుతోంది. తాజాగా వికారాబాద్ జిల్లా లగచర్లలో పబ్లిక్ హియిరింగ్‌కు వెళ్ళిన జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, డిప్యూటీ కలెక్టర్, కడా ప్రత్యేక అధికారి, డిఎస్‌పి ఇతర అధికారులపై దాడి చేసిన ఘటన యావత్‌తెలంగాణను దిగ్భ్రాంతికి గురి చేసింది. అధికారులను అడ్డుకోవడం, లేదా నిరసనలు తెలపడం పబ్లిక్ హియిరింగ్ సమయాలలో పరిపాటే. కానీ, దాడులకు దిగడం, వాహనాలపై పెద్ద పెద్ద రాళ్ళను విసరడం , అందులో కలెక్టర్ స్థాయి వ్యక్తిపై కూడా దౌర్జన్యం చేయడం వంటి దృశ్యాలు అందరికీ ఆందోళన కలిగించేవే. తెలంగాణలో ఇంతటి స్థాయి దాడి ప్రజలు ఎరుగరు. ముఖ్యమంత్రి స్వంత నియోజకవర్గం కొడంగల్‌లోని లగచర్లలో ఫార్మా కంపెనీ పెట్టేందుకు భూసేకరణకు సంబంధించి ఈ ఘటన చోటు చేసుకుంది. అయితే, ఇది యాదృచ్ఛికంగా జరిగిందా లేదా పథకం ప్రకారం జరిగిందా? అనేది ముందు ముందు తేలాల్సిందే. ఈ ఘటనలో పోలీసులు సాక్షాత్తు కొడంగల్ మాజీ ఎంఎల్‌ఏ, సిఎం రేవంత్ రెడ్డిపై ఓడిపోయిన పట్నం నరేందర్ రెడ్డిని ప్రధాన సూత్రధారిగా ఎ–1గా గుర్తించి కేసు పెట్టారు. కలెక్టర్‌ను లగచర్ల ఊరికి రప్పించి ఘటనకు కారకుడుగా భావిస్తున్న సురేశ్‌రాజ్ తమ నాయకుడేనని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు బాహాటంగా చెబుతున్నారు. ఈ వ్యవహారంలో రెండు అంశాలు ఇమిడి ఉన్నాయి. ఒకటి రైతుల భూములు లాగేసుకుంటున్నారనడం, మరొకటి అధికారులపై దాడి చేయడం. రెండింటిపై కూడా లోతుగా పరిశీలిన జరగాల్సిందే. ఫార్మా కంపెనీ కోసం భూములు తీసుకునే అంశంపై ముందుగా అక్కడ రైతాంగాన్ని ఒప్పించి, వారికి యుపిఎ హయాంలో తీసుకువచ్చిన భూ సేకరణ చట్టానికి అనుగుణంగా మేలైన పరిహారం ఉపాధి, పర్యావరణానికి భరోసా కల్పిస్తే మంచిదే. అలా కాకుండా బలవంతంగా లాక్కుంటే మాత్రం ఇబ్బందికరమే. ఇక రెండో అంశం ఉన్నతాధికారులపై దాడి. ఎలాంటి పరిస్థితులోనైనా ప్రభుత్వ అధికారులపై భౌతిక దాడులకు దిగడం అభ్యంతరకరం. దీనిని ఎవరు హర్షించరు. నిజంగా ప్రజల్లో ఆందోళన ఒక స్థాయికి చేరుకొని, అణిచివేత పెరిగిన సందర్భాలలో భావోద్వేగంతో , కట్టలు తెగిన ఆగ్రహంతో కొన్నిసార్లు ఇలాంటివి చోటు చేసుకోవచ్చు. వాటిని అర్థం చేసుకోవచ్చు. లగచర్ల విషయంలో బైట పడుతున్న అంశాలను పరిశీలిస్తే కుట్ర పూరితంగానే స్థానికులను ప్రేరేపించడంతో ఆ ఘటనకు దారితీసినట్లు నిర్ధారణ అవుతుంది. ఘటనలో కీలక పాత్ర పోషించిన సురేశ్‌కు గతంలో ఆ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన పట్నం నరేందర్ రెడ్డి మధ్య పదే పదే ఫోన్ సంభాషణలు జరిగినట్లు, బిఆర్ఎస్ అగ్రనేత కెటిఆర్‌తో కూడా ఫోన్ సంభాషణలు జరిగినట్లు పోలీసులు ధృవీకరిస్తున్నారు. ముఖ్యమంత్రికి ఆయన స్వంత నియోజకవర్గం నుంచే పతనం ప్రారంభమవుతుందని కెటిఆర్ పదే పదే చెబుతుండడంతో కుట్ర కోణాన్ని కాంగ్రెస్ వర్గాలు ఎత్తి చూపుతున్నా యి.

బిఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య తరచూ ఏదో ఒక వివాదం తలెత్తడం, అది పరాకాష్ఠకు పోతుండడం, కెటిఆర్ దూకుడుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యక్తిగత ఆరోపణలతో విరుచుకుపడుతుండడం, ఇవన్నీ కూడా ఆరోగ్యకరమైన రాజకీయ పరిణామాలకు సంకేతాలు కావు. హైడ్రా, మూసీ ప్రక్షాళన, డిఎస్‌సి, గ్రూప్ 1, అమృత్ పథకం




టెండర్లు, లగచర్ల , ఇలా నిత్యం ఏదో ఒక అంశంతో ప్రభుత్వాన్ని చికాకు పెట్టడమే బిఆర్ఎస్ లక్ష్యంగా పెట్టుకున్నట్లుంది. ప్రతిపక్ష పార్టీగా కచ్చితంగా ప్రజా సమస్యలను లేవనెత్తడం, ప్రభుత్వంపై విమర్శలు చేయడం బిఆర్ఎస్ హక్కు. దానిని ఎవరూ కాదనలేరు. కానీ, అది నిర్మాణాత్మకంగా ఉంటే బాగుంటుందనే అభిప్రాయం ప్రజల్లో ఉంది. నిన్నమొన్నటి వరకు తమ హయాంలో చేయని పనులను.. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వమే చేయడంలేదనే విధంగా పనిగట్టుకొని నిలదీయడం చూస్తుంటే విచిత్రంగా ఉంది. ఉదాహరణకు సర్పంచ్‌లకు బకాయిలు పడింది గత బిఆర్ఎస్ హయాంలోనే. వారికి చెల్లింపులు చేసేందుకు ఆలస్యమవుతుండడంతో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకే బకాయిలు పడినట్లుగా, వారిపై ఉరుముతుండడం చూస్తున్నాం. ఇటీవల ఫోన్ ట్యాపింగ్, ఫార్ములా ఈ రేస్, కాళేశ్వరం విచారణ తదితర అంశాలపై చర్యలకు ప్రభుత్వం వేగంగా పావులు కదుపుతుండడం కూడా బిఆర్ఎస్ నేత కెటిఆర్ దూకుడుకు కారణమని, ఆయన ఏదో ఒక అంశంతో ప్రభుత్వాన్ని ఇరకాటంలో పెట్టాలని, అందుకు లగచర్లలో శృతి మించి వ్యవహరించారని కాంగ్రెస్ వర్గాలు ఆరోపిస్తున్నాయి. ఫార్ములా – ఈ కార్ రేసుకు సంబంధించి స్వయంగా తానే ఆ కంపెనీకి రూ.52 కోట్లు చెల్లించాలని అధికారులను ఆదేశించినట్లు కెటిఆర్ ఒప్పుకోవడంతో ఆ కేసులో ఏసిబి విచారణకు గవర్నర్ నుంచి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి కోరింది. మరో వైపు టెలిఫోన్ ట్యాపింగ్ కేసులో కూడా దర్యాప్తు వేగం పెరిగింది. ఇవన్నీ కూడా ముంచుకు వస్తుండడంతో , తనను ప్రభుత్వం అరెస్టు చేసేందుకు సిద్ధమవుతుందని కెటిఆర్ బహిరంగంగానే చెబుతున్నారు. అందుకు సిద్ధమవుతున్నట్లుగా కూడా ప్రకటించారు. రైతుల అంశాలపై, ప్రజల అంశాలపై ఎక్కువ దూకుడు ప్రదర్శించడం ద్వారా ప్రజల్లో నానాలని, తద్వారా భవిష్యత్తులో ఏమి జరిగినా ప్రజల కోసం జరిగిందనే భావన కల్పించడంలోనే భాగంగా ఘటనలు జరుగుతున్నాయనే అభిప్రాయం పరిశీలకులలో వ్యక్తమవుతున్నది.

ఒకప్పుడు అధికార పక్షం, ప్రతిపక్షం ఎన్ని విమర్శలు, ఆరోపణలు చేసుకున్నా, వ్యక్తిగత స్థాయిలో సత్సంబంధాలు ఉండేవి. విమర్శలు కూడా విధానాలు, వైఖరులపైనే ఉండేవి. నేడు మాత్రం అది కరువవుతోంది. నాయకుల వైరం వ్యక్తిగత స్థాయికి దిగడంతో రాజకీయ యవనిక నిత్య రణరంగంగా మారింది. అధికారంలో ఉన్న వారు ప్రతిపక్షాలను వెంటాడి , వేధించి కేసులు పెడితే, వారి దిగిపోయి ప్రతిపక్షంలోకి వచ్చాక, అప్పటి వరకు వేధింపులు అనుభవించి అధికార పక్షంలోకి మారిన పార్టీ అదే తీరున వ్యవహరించే ప్రమాదం ఉంటుంది. ప్రతిపక్షం తాము నిన్న మొన్నటి వరకు చేసింది మరిచిపోయి, కొత్తగా ఇప్పుడే తప్పులు జరుగుతున్నట్లు ప్రవర్తిస్తున్నాయి. ఇవన్నీ ప్రతీకార, నిందాపూర్వక రాజకీయాలకు దారితీసి ఘర్షణ దిశగా సాగుతుంది. వీటికి సోషల్ మీడియా మరింత ఆజ్యం పోస్తుంది. ఈ పరిణామాలు కేవలం తెలంగాణలోనే కాదు ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలలో కూడా చోటు చేసుకుంటున్నాయి. ఎపిలో సోషల్ మీడియాలో గతంలో రాష్ట్ర స్థాయి రాజకీయ నాయకుల మీద, వారి కుటుంబాల మీద విచ్చలవిడిగా బూతు లు, కామెంట్లు చేసిన వారిపై నేటి ప్రభుత్వం కేసులు పెడుతోంది. నాడు కామెంట్లు చేసిన వారిలో కొందరికి తత్వం బోధపడి ఆలస్యంగానైనా తప్పు ఒప్పుకొని క్షమించమని వేడుకుంటున్నారు. అధికారమే పరమావధిగా సాగుతున్న రాజకీయాలు తిరిగి సైద్ధాంతిక, విధాన పునాదుల పట్టాలు ఎక్కకపోతే ప్రజాస్వామ్యానికే పెనుముప్పు.

# చంద్రబాబు సోదరుడు రామ్మూర్తినాయుడు మృతి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు కన్నుమూశారు. రామ్మూర్తి నాయుడు మృతితో నారా కుటుంబంలో విషాద ఛాయలు నెలకొన్నాయి. గురువారం ఆయనకు హార్ట్ అటాక్ రావడంతో ప్రాథకమి చికిత్స అనంతరం హైదరాబాద్‌లోని ఏఐజి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. సోదరుడి మరణవార్త తెలియడంతో మహారాష్ట్ర పర్యటనలో ఉన్న చంద్రబాబు నాయుడు హైదరాబాద్ చేరుకున్నారు. ఏపి మంత్రి నారా లోకేశ్ అంతకుముందే అన్ని కార్యక్రమాలను రద్దు చేసుకొని, హుటాహుటిన హైదరాబాద్‌కు చేరుకున్నారు. సాయంత్రం ప్రత్యే క విమానంలో రామ్మూర్తినాయుడు పార్థివదేహాన్ని రేణిగుంట తరలించారు. అక్కడి నుంచి ప్రత్యేక వాహనంలో నారావారిపల్లెకు తీసుకెళ్లనున్నారు. రామ్మూర్తినాయుడు 1952లో జన్మించారు. రామ్మూర్తి నాయుడికి భార్య ఇందిర, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో ఒకరు సినినటుడు రోహిత్, మరొకరు నారా గిరీశ్. 1994 లో రామ్మూర్తి నాయుడు చిత్తూరు జిల్లా చంద్రగిరి అసెంబ్లీ స్థానం నుంచి గెలుపొందారు. అనంతరం ఆయన అనారోగ్యంతో రాజకీయాల నుంచి విరామం తీసుకున్నారు. ఆదివారం నారావారిపల్లెలో ఆయన అంత్యక్రియలు నిర్వహించను న్నారు. మాజీ సిజెఐ ఎన్.వి.రమణ, సుజనా చౌదరి, హిందూపురం ఎంఎల్‌ఎ, సినినటుడు బాలకృష్ణ, నందమూరి కుటుంబ సభ్యులు, టిడిపి నాయకులు ఆస్పత్రికి వెళ్లి ఆయనకు నివాళులు అర్పించారు. తమ్ముడు నారా రామ్మూర్తినాయుడి కుమారులు నారా రోహిత్, గిరీశ్‌లను చంద్రబాబు అక్కున జేర్చుకుని ఓదార్చారు. తండ్రిని కోల్పోయి తీవ్ర విషాదంలో ఉన్న ఆ ఇద్దరు సోదరులకు పెదనాన్నగా ధైర్యం చెప్పారు.



## తమ్ముడి ఆత్మకు శాంతి కలగాలి చంద్రబాబు

'నా తమ్ముడు, చంద్రగిరి నియోజకవర్గం మాజీ ఎంఎల్‌ఎ నారా రామ్మూర్తి నాయుడు మమ్మల్ని విడిచి వెళ్లిపోయాడని బాధాతప్త హృదయంతో తెలియజేస్తున్నాను. రామ్మూర్తి నాయుడు ప్రజా జీవితంలో పరిపూర్ణ మనసుతో ప్రజలకు సేవలు అందించిన నాయకుడు. మా నుంచి దూరమై మా కుటుంబంలో ఎంతో విషాదాన్ని నింపాడు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటు న్నాను'అనిచంద్రబాబు నాయుడు ట్వీట్ చేశారు.

## సిఎం రేవంత్ రెడ్డి సంతాపం

మాజీ ఎంఎల్‌ఎ రామ్మూర్తి నాయుడు మృతి పట్ల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన ఆత్మకు శాంతి కలగాలని, వారి కుటుంబసభ్యులకుమనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు.

## పిన్ని, తమ్ముళ్లు ధైర్యంగా ఉండాలి లోకేశ్

'చిన్నాన్న రామ్మూర్తి నాయుడు మృతి తీవ్ర విషా దం నింపింది. ఆయనతో నా చిన్ననాటి అనుబంధం కళ్ల ముందు కదలాడుతోంది. కన్నీటితో నివాళులు అర్పిస్తున్నా. ఇన్నాళ్లూ ఆయన మాకు కనిపించే ధైర్యం, ఇకపై చిరకాల జ్ఞాపకం. ఆయన ఆత్మకు శాంతి కలగాలి. అంతులేని దుఃఖంలో ఉన్న నా సోదరులు, పిన్ని ధైర్యంగా ఉండాలని కోరుతున్నా' అని లోకేశ్ అన్నారు.

## ఎపి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

'ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోదరుడు, మాజీ ఎంఎల్‌ఎ నారా రామ్మూర్తి నాయుడు మరణించారని తెలిసి చింతిస్తున్నా. రామ్మూర్తి నాయుడు ఆత్మకు శాంతి చేకూరాలి. సోదర వియోగంతోబాధపడుతున్న సిఎం చంద్రబాబుకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా. మహారాష్ట్రలో ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఉండటంతోరామ్మూర్తినాయుడుఅంత్యక్రియలకు హాజరు కాలేకపోతున్నా. రామ్మూర్తి నాయుడు కుమారుడు రోహిత్, కుటుంబసభ్యులకు నా సంతాపం తెలుపుతున్నా' అని ఏపి ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు.

# మూసీ బాట పట్టిన బిజెపి



## రాత్రి అక్కడే బస చేసిన నాయకులు



ప్రజాపక్షం/హైదరాబాద్ : బిజెపి నాయకులు మూసీబాట పట్టారు. శనివారం మూసీ పరివాహక ప్రాంతంలో పలుబస్తీల్లో పర్యిటించిన నాయకులు స్థానికుల ఇళ్లలో భోజనం చేసి వారితో కలిసి రాత్రి అక్కడే నిద్ర పోయ్యరు. ఇందులోభాగంగా కేంద్ర మంత్రిబిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి అంబర్‌పేట్ నియోజకవర్గం గోల్నాక డివిజన్‌లోని తులసి రామ్‌నగర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా బస్తీవాసులు, బాధితులతో మాట్లాడి ఆ బస్తీలోనే రాత్రి బస చేశారు. రాజ్యసభ సభ్యులు డాక్టర్ లక్ష్మ ణ్ ఓల్డ్ మలక్‌పేట్ లోని శాలివాహన నగర్‌లో బస చేయగా, ఎంపి ఈటెల రాజేందర్ ఎల్‌బినగర్‌లోని ద్వారకపురం, గణష్‌నగర్‌లో పర్యటించి అక్కడే బస చేశారు. మొత్తం 20 బస్తీ ల్లో 20 మంది నాయకులు రాత్రి స్థానికుల ఇళ్లలోనే బసా చేశారు. కార్పొరేటర్లు, స్థానిక నాయకులు 8 జిల్లాలకు సంబంధించి బీజేపీ జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

# నూతన జాతీయ విద్యా విధానాన్ని తిరస్కరించాలి



## తెలంగాణలో కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలి : టిపిటిఎఫ్

ప్రజాపక్షం/హైదరాబాద్ : రాజ్యాంగ లక్ష్యాలకు భిన్నంగా ఉన్న నూతన జాతీయ విద్యా విధానంను రాష్ట్ర ప్రభుత్వం తిరస్కరించాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు కోరారు. మినిస్టర్ పిల్లలైనా, అటెండర్ పిల్లలైనా, కలెక్టర్ పిల్లలైనా, కార్మికుల పిల్లలైనాఒకేపాఠశాలలో చదువుకునే కామన్ స్కూల్ విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాలని వారు ప్రభుత్వానికీ విజ్ఞప్తి చేశారు. తెలంగాణ విద్యాకమిషన్ చైర్మన్ ఆహ్వానం మేరకు శనివారం తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టిపిటిఎఫ్)రాష్ట్ర కమిటీ ప్రతినిధులబృందం ఎస్‌సిఈఆర్‌టికార్యాలయంలో విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులతో భేటీ అయ్యారు. టిపిటిఎఫ్‌రాష్ట్ర కమిటీ నాయకులు విద్యా విధానంపై పలు ప్రతిపాదనలతో నివేదికను కమిషన్‌కు అందజేశారు.పాఠశాల కరికులంలో శాస్త్రీయ విద్యా విధానానికి అనుగుణంగా ఆధునిక శాస్త్ర సాంకేతిక రంగాలలో జరిగిన అభివృద్ధిని పాఠ్యాంశాలలో చేర్చాలని టిపిటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వై.అశోక్ కుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.నాగిరెడ్డి కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక టీచర్, ప్రాథమిక పాఠశాలకు ప్రధానోపాధ్యాయుల పోస్టును మంజూరు చేయాలన్నారు. పూర్వ ప్రాథమిక తరగతులను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేస్తూ పూర్వ ప్రాథమిక విద్య పై శిక్షణ పొందిన రెగ్యులర్ టీచర్లను నియమించాలని సూచించారు. మండల, జిల్లా, జోనల్ స్థాయిలో రెగ్యులర్ పద్ధతిలో వెంటనేపర్యవేక్షణాధికారులైనడిఈఓ, డిప్యూటీ ఈఓ, ఎంఈఓ పోస్టులు మంజూరు చేసి భర్తీ చేయాలని కోరారు.రాష్ట్ర బడ్జెట్లో విద్యకు కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని, విద్యార్థులకు పాఠ్య పుస్తకాల భారం తగ్గిస్తూ మార్పులు చేయడం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం స్నాక్స్ ఏర్పాటు చేయాలని వినవించారు. చివరగా ఆకునూరి మురళి మాట్లాడుతూ విద్యారంగంలో కీలక భాగస్వాములైన ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల అభిప్రాయాలను సేకరించి సిఫారసులు ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.

రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.రవీందర్ ఉపాధ్యాయ దర్శిని ప్రధాన సంపాదకులు ఎం.ప్రకాష్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు నన్నెబోయిన తిరుపతి, డి.శ్రీనివాస్, ఎపిటిఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కె.వేణుగోపాల్,టిపిటిఎఫ్‌మాజీ అధ్యక్షులు బి.కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అపోలో వైద్యుల నైపుణ్యంతో

# నవజాత శిశువుకు చికిత్స సక్సెస్




ప్రజాపక్షం / హైదరాబాద్ : నెలలు నిండకుండానే జన్మించిన నవజాత శిశువునకు పెద్ద కడుపు రంధ్రం కూడా తోడు కావడం, అతి తక్కువగా 760 గ్రాముల బరువుతోనే పుట్టడంతో ఆ బిడ్డకు వైద్యం చేయాలంటే ఎంతో నైపుణ్యం కావాల్సి ఉంటుంది. రాజ మోహన్ రెడ్డి, కవిత దంపతులకు పుట్టిన ఈ బిడ్డను జూబ్లీహిల్స్ అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్‌కు అంబులెన్స్‌లో తరలించగా అక్కడి వైద్యులు ఆ బిడ్డకు చికిత్స చేసి ఆరోగ్యంగా బిడ్డను డిశ్చార్జ్ చేశారు. ఈ సందర్భంగా అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ పీడియాట్రిక్ సర్జరీ నిపుణుడు డాక్టర్ కేలలతేందు కుమార్ మాట్లాడుతూ ఈ శిశువు చికిత్సలో ప్రతి అడుగు మాకు సవాలుగా నిలిచిందన్నారు. అత్యంత క్లిష్టమైన, అధిక ప్రమాదంలో ఉన్న శిశువుకు చికిత్స అందించడంలో ఉన్న నైపుణ్యం, నిబద్ధతకు ఈ కేసు ఒక ఉదాహరణ కూడా అని అన్నారు. అనంతరం అపోలో క్రెడిల్, చిల్డ్రన్స్ హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ నియోనటాలజీ, పీడియాట్రిక్స్ నిపుణుడు డాక్టర్ కృష్ణ స్వరూప్ రెడ్డి మాట్లాడుతూ శిశువు ఆరోగ్య పరిస్థితిని రియల్ టైమ్‌లో పర్యవేక్షించడం ద్వారా మెరుగైన చికిత్స ఫలితాలు సాధించగలిగామని చెప్పారు. ఈ సందర్భంగా నవజాత శిశువు తల్లిదండ్రులు రాజమోహన్ రెడ్డి, కవిత మాట్లాడుతూ తమ చిన్నారి ఆరోగ్యంఇప్పుడు ఎంతో బాగుందని అన్నారు. అందరికి కృతజ్ఞతలు తెలిపారు.

# ఎస్‌సి, ఎస్‌టిలకు అన్యాయం జరిగితే సహించను..



ప్రజాపక్షం/హైదరాబాద్: ఎస్‌సి, ఎస్‌టిలకు అన్యా యం జరిగితే ఉపేక్షించబోమని ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ ఛైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. అధికారులపై దాడికి పాల్పడాన్ని తీవ్రం గా ఖండిస్తున్నామని, లగచర్లలో త్వరలో పర్యటించనున్నట్లు ఆయన వెల్లడించారు. పోలీసులు తమను వేధిస్తున్నారని లగచర్ల బాధితులతో కలిసి బిఆర్‌ఎస్ నాయకులుఎస్,ఎస్‌టి కమిషన్‌కు ఛైర్మన్ శనివారం ఫిర్యాదు చేశారు. బాధిత మహిళలు తమపై పోలీసులు ఏ విధంగాఅఘయిత్యాలకుపాల్పడ్డారో కమిషన్‌కు వివరించారు. రైతులు దాడులు చేశారన్న కారణంతో అర్ధరాత్రి ఇంటిపైకి వచ్చి మహిళలను బూతులు తిట్టారని...లైంగికంగా వేధించారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ పోలీసులు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించారు. లగచర్లపై నిజానికి ఎస్‌సి, ఎస్‌టిలపైనే దాడి జరిగిందని ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌అన్నారు. ఎంఎల్‌ఎలు కోవలక్ష్మి, అనిల్ జాదవ్, నాయకులు, జాన్సన్ నాయక్, రూప్ సింగ్ ఉన్నారు.

# పోలీస్ బ్యాడ్జిల్లో మార్పులు

ప్రజాపక్షం/హైదరాబాద్: పోలీసు బ్యాడ్జిల్లో తెలంగాణ స్టేట్ పోలీసు (టిఎస్‌పి) స్థానంలో తెలంగాణ పోలీసు (టిజిపి), తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ (టిఎస్ఎస్‌పి) స్థానంలో తెలంగాణ స్పెషల్ పోలీస్ (టిజిఎస్‌పి), అలాగే టిజిపిఎస్ ఉండే విధంగా బ్యాడ్జిలను మార్చాలని హోంశాఖ కార్యదర్శి రవి గుప్తా శనివారం ఆదేశాలు జారీ.ఇక నుంచి క్యాప్‌పైన టిజిపిఎస్, డిఎస్‌పి, అదనపు ఎస్‌పి, ఎస్‌పిలకు భుజాలపై, బెల్ట్‌పై ఉండే బ్యాచ్‌లకు టిజిపిఎస్, ఎఎస్‌ఐ నుంచి సిఐ స్థాయి వరకు అధికారుల భుజాలు, బెల్డ్‌పై టిజిపిగా ముద్ర ఉంటుందిన రవిగుప్తా జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు.

# క్రమం తప్పకుండా నిరంతర విద్యుత్ అందించండి



## ఇంజనీర్లతో సందీప్ కుమార్ సుల్తానియా

ప్రజాపక్షం / హైదరాబాద్ : విద్యుత్ ఉద్యోగులు పక్కాగా పని చేస్తూ వినియోగదారులకు క్రమం తప్పకుండా 24X7 నిరంతర విద్యుత్ అందించాలని ఎనర్జీ సెక్రటరీ, జెన్ కో సిఎండి సందీప్ కుమార్ సుల్తానియా ఆదేశించారు. తెలంగాణ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ కొత్తగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు రత్నాకర్ రావు, సదానందంతో పాటు వారి కార్యవర్గ బృందం శనివారం విద్యుత్ సౌధలో ఎనర్జీ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియాను మర్యాదపూర్వకంగా కలిసి మొక్కలు, పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సందీప్ కుమార్ సుల్తానియా కొత్తగా ఎన్నికైన ఇంజనీర్స్ అసోసియేషన్ నాయకులను అభినందించి మాట్లాడుతూ ఉద్యోగులు విధి నిర్వహణలో అంకిత భావంతో పని చేయాలని సూచించారు. అన్నిరకాల వినియోగదారులకు నిరంతర విద్యుత్ అందించాలని కోరగా అందుకు అనుగుణంగా పనిచేస్తామని అసోసియేషన్ నాయకులు తెలిపారు. ఎనర్జీ సెక్రటరీని కలిసిన వారిలో అసోసియేట్ ప్రెసిడెంట్ జనప్రియ, అడిషనల్ సెక్రటరీ జనరల్ వెంకటేశ్వర్లు, గోపాల్ రావు, కిరణ్, సత్యనారాయణ రాజు తదితరులు ఉన్నారు.

# టిటిడి బోర్డు సభ్యులు జంగా కృష్ణమూర్తియాదవ్‌కు సన్మానం



ప్రజాపక్షం/హైదరాబాద్: తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు సభ్యులు, మాజీ ఎంఎల్‌సి జంగా కృష్ణమూర్తి యాదవ్‌ను వివిధ యాదవ సంఘాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శనివారం సన్మానించారు.అఖిల భారత యాదవ్ మహాసభ నాయకులు ఎం.గోపాల్ యాదవ్, యాదవ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎంబి కృష్ణ యాదవ్. తెలంగాణ ఉద్యోగ సంఘం అధ్యక్షులు డాక్టర్ మార్గం రమేష్. జూలూరి గౌరీ శంకర్. హనుమాన్ కేసరి గౌడ్ . ఎం వి ఎస్ నికేతన్ కుమార్ యాదవ్ నోబుల్ సురేష్ యాదవ్. వెంకట్ యాదవ్ పాల్గొన్నారు.

# వాటర్ ఫీజిబిలిటీ ధ్రువపత్రం జారీ సులభతరం

ప్రజాపక్షం/హైదరాబాద్ : నూతన భవన నిర్మాణదారులకు జలమండలి శుభవార్త చెప్పింది. కొత్తగా భవనాలు నిర్మించుకునే వారు జిహెచ్ ఎంసిఅనుమతుల కోసం సమర్పించాల్సిన వాటర్ ఫీజుబిలిటీ ధ్రువపత్రాన్ని జారీ చేసే ప్రక్రియను జలమండలి సులభతరం చేసింది. గ్రేటర్ పరిధిలోని నూతన భవనం నిర్మించాలంటే జిహెచ్ ఎంసిఅనుమతులుతప్పనిసరి.అనుమతుల కోసం భవన యజమానులు విద్యుత్ ఫీజుబిలిటీతో పాటు జలమండలి జారీ చేసే వాటర్ ఫీజుబిలిటీ ధ్రువపత్రం సమర్పించాలి. గతంలో ఈ సర్టిఫికెట్స్ పొందాలంటే జలమండలి సర్కిల్ కార్యాలయాల్లో జిజిఎం జారీ చేసేవారు. వివిధ కారణాల రీత్యా ఈ ప్రక్రియలో జాప్యం జరిగేది. దీన్ని నివారించి, ఆ ప్రక్రియను సులభతరం చేయడానికి ధ్రువపత్రాల జారీని జలమండలి కేంద్ర కార్యాలయంనుంచేచేపట్టేలా మార్పులు చేశారు. ఇందు కోసం వాటర్ ఫీజుబిలిటి ధ్రువపత్రాలు జారీ చేయడానికి జలమండలి ఒక కమిటీని ఏర్పాటు చేసింది. వినియోగదారుల నుంచి వచ్చిన దరఖాస్తులనుపరిశీలించి, ధ్రువపత్రాలు జారీ చేస్తుంది. ఈ ధ్రువపత్రాల కోసం వినియోగదారులు ముందుగా సంబంధిత తమ దగ్గరలోని సిజిఎంలకు దరఖాస్తులు సమర్పించాలి. వారు 6 రోజుల పాటు వాటిని పరిశీలించి, ఖైరతాబాద్‌లోని జలమండలి ప్రధాన కార్యాలయంలో ఉన్న కమిటీకి పంపిస్తుంది. సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వినియోగదారులు 30 రోజుల్లోగా సొమ్ము చెల్లించాల్సి ఉంటుంది. దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించిన అనంతరం నిర్దేశిత 5 రోజుల్లో (పని దినాలు) రెవెన్యూ విభాగ చీఫ్ జనరల్ మేనేజర్ (సిజిఎం) ధ్రువపత్రాల్ని జారీ చేస్తారు. దీని వల్ల భవనాలు నిర్మించుకునే వాళ్లకు పని, ధ్రువపత్రాలవిషయంలోఆలస్యంజరగకుండా ఉంటుంది. ఈ కమిటీ ద్వారా ఈ నెలలో ఇప్పటికే 19 వాటర్ ఫీజుబిలిటీ ధ్రువపత్రాలను జారీ చేశారు.

# ప్రేమించకపోతే చంపేస్తామంటూ..

ప్రజాపక్షం/ఎల్‌బినగర్: బీఎస్సీ నర్సింగ్ విద్యార్థికి ఓ యువకుడు ప్రేమించకపోతే చంపేస్తామంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమై, స్నేహం పేరుతో దగ్గరై పోటోలు తీసుకున్న యువకుడు సదరు యువతిని వేధింపులకు గురిచేస్తున్న సంఘటన హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, యువతి వివరాల ప్రకారం...నాగార్జునసాగర్ ప్రాంతానికి చెందిన చెరుకుపల్లి విజయ్ హైదరాబాద్‌లోని ఓ కాలేజీలో చదువుతున్నాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో హయత్ నగర్ ప్రాంతానికి చెందిన బీఎస్సీ నర్సింగ్ విద్యార్థితో పరిచయంఏర్పడింది. ప్రేమగా మార్చుకుని వేధింపులు మొదలు పెట్టాడు. ప్రేమించకపోతే కుటుంబ సభ్యులందరిని చంపుతామంటూ బెదిరించినట్టు యువతి పోలీసులకు తెలిపింది. ఈ నెల 14న యువతి కాలేజీ నుండి బయటకు వెళుతున్న క్రమంలో కళాశాలకు చేరుకున్న చెరుకుపల్లి విజయ్ బాధిత యువతిని నిర్మానుష్య ప్రాంతానికి తీసుకెళ్లి బెదిరించాడని యువతి తెలిపింది. చెరుపల్లి విజయ్‌తో తనతో పాటు తన కుటుంబ సభ్యులకు ప్రాణహాని ఉందని యువతి పోలీసుల ముందు వాపోయింది. యువతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు హయత్ నగర్ పోలీసులు తెలిపారు.

# క్రీడలతోనే మానసిక ఉల్లాసం



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి: 38వ తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ క్యోరుజి, 13వ పూమ్సే తైక్వాండో ఛాంపియన్‌షిప్ 2024 పోటీలను గచ్చిబౌలి బాలయోగి స్టేడియంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ కె.శివ సేన రెడ్డి, గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డిలు విచ్చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గం గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గచ్చిబౌలి జిఎంసి బాలయోగి ఇండోర్ స్టేడియంలో తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం 16 నుండి 17వ తేదీ వరకు నిర్వహించనున్న 38వ తెలంగాణ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్ క్యోరుజి,13వ పూమ్సే తైక్వాండో ఛాంపియన్‌షిప్ 2024 ఇక్కడ బాలాజీ బాలయోగి స్టేడియంలో నిర్వహించడం ఎంతో సంతోషకరంగా ఉందని తెలిపారు. తైక్వాండో, కరాటే, కుంపు,లాంటి క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు పిల్లల్లో మానసిక స్థైర్యాన్ని, అలాగే స్వీయ రక్షణ సామర్థ్యాన్ని పెంచుతాయని అన్నారు. ము ఖ్యంగా ఆడ పిల్లల తలిదండ్రులు ఇలాంటి క్రీడలు నేర్చుకునేలా ప్రోత్సహించాలని, నేటి పోటీ ప్రపంచంలో వి ద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించే విధంగా వి ద్యార్థుల తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు. తెలంగాణ తైక్వాండో అసోసియేషన్ అ ధ్యక్షులు సతీష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ కుమార్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# కరోనా కార్మికులను ఆదుకోవాలి

## జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ ఎస్.పంకజకు వినతి పత్రం అందచేసిన టిజిహెచ్‌ఎం ఇయు నేతలు



ప్రజాపక్షం/హైదరాబాద్ : కరోనా సమయంలో అత్యవసర పనుల కోసం ఎంటమలాజి విభాగంలో నియమించిన 202 మంది సిబ్బంది పట్ల మానవతదృక్పథంలో కనీస వేతనాలు, ఈఎస్ఐ, పిఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించాలని తెలంగాణ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కోరారు. జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ ఎస్.పంకజకు వినతిపత్రం అందచేశారు. అనంతరం యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ దేవదాస్, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్, మల్లేష్, భాస్కర్ మాట్లాడుతూ కరోనా సమయంలో వారు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజల ప్రాణాలు కాపాడేందుకు విధులు నిర్వహించారని గుర్తు చేశారు. కరోనా సమయం ముగిసిన తర్వాత వారిని ఎంటమలాజి విభాగంలో తక్కువ సిబ్బంది ఉండటంతో వారిని ఎంటమలాజి విభాగంలో కొనసాగిస్తున్నారని చెప్పారు. ఎంటమలాజి విభాగంలో విధులు నిర్వహిస్తున్న కరోనా కార్మికులకు గత ఐదు సంవత్సరాలుగా కేవలం రూ. 9 వేల జీతం ఇస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ మహానగరంలో జీవన వ్యయం పెరిగిపోయిందన్నారు. జిహెచ్‌ఎంసి వారికి ఇస్తున్న వేతనం కేవలం ఇంటి అద్దెకు కూడా సరిపోదన్నారు. నిత్యావసర వస్తువులు విపరీతంగా పెరిగిపోయాయని, పిల్లల స్కూల్ ఫీజులు, ఇతర ఖర్చులకు ఇచ్చే రూ.9 వేల వేతనం ఏమూలకు సరిపోవడం లేదన్నారు. ఉన్నతాధికారులు కరోనా కార్మికుల పట్ల మానవతదృక్పథంలో వేతనం పెంచి, ఇఎస్ఐ, పిఎఫ్ లాంటి సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.



## ఇసుక కొరత లేకుండా చూడాలి

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం / మహబూబ్ నగర్ ప్రతినిధి :** ఇసుక కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్, మైనింగ్ ఎడి, మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు తగు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గం లో జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి పనులకు, ఇంటి నిర్మాణాలకు సంబంధించి ప్రస్తుతం ఇసుక కొరత లేకుండా చూడాల్సిన బాధ్యత బీ పైన ఉందని రెవెన్యూ మున్సిపల్, మైనింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్ రెడ్డి, మైనింగ్ ఎడి సంజీవ్ కుమార్, మున్సిపల్ డిఇ బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

## రేపు డెడికేటెడ్ బిసి కమిషన్ రాక

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి :** స్థానిక సంస్థల వారీగా కల్పించే అవసరమైన రిజర్వేషన్ల దామాషా పేర్కొనే విషయంపై ఈ నెల 18న మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో డెడికేటెడ్ బిసి కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయేందిర బోయి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి డెడికేటెడ్ బిసి కమిషన్ చైర్మన్ బుసాని వెంకటేశ్వర రావు, కార్యదర్శి బి.సైదులు హాజరవుతున్నట్లు చెప్పారు. ఆయా కులాల స్థితిగతులపై డెడికేటెడ్ బిసి కమిషన్‌కు అభిప్రాయాలు వ్యక్తం చెయ్యవచ్చన్నారు. స్థానిక సంస్థలకు అవసరమైన రిజర్వేషన్లను దామాషా ప్రకారం కల్పించేందుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, పార్టీలు, బిసి సంఘాలు, ప్రజలు, సలహాలు, అభ్యర్థనలు, ఆక్షేపణలను కమిషన్‌కు సమాచారం మెటీరియల్, సాక్ష్యాలతో సమర్పించవచ్చని కలెక్టర్ ఈ ప్రకటనలో తెలిపారు.



## ఇంటింటి కుటుంబ సర్వే

**ప్రజాపక్షం/జడ్చర్ల :** సామాజిక ఆర్థిక విద్య ఉపాధి రాజకీయ , కుల సర్వే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే లో భాగంగా ఇవాళ 9 వ వార్డు కౌన్సిలర్ చైతన్య చౌహాన్ వారి కుటుంబ వివరాలను నమోదు చేసుకుని కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ జగన్ సూపర్వైజర్ కట్ట వెంకటేష్ డిపిఎం డిఆర్‌డిఎ పాల్గొన్నారు. ప్రజలు సహకరించాల్సిందిగా, గవర్నమెంట్ సూచించిన విధంగా సర్వేకి అందరూ సహకరించాలని సూచిన చేశారు.

## నేడు రెండో ఎఎన్ఎంల మహాసభ

**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** రంగారెడ్డిజిల్లా శంషాబాద్ ఎలైట్‌హోటల్ నందు ఈనెల 17న తెలంగాణ రాష్ట్రంలో నేషనల్‌హెల్త్ మిషన్‌నందు పనిచేస్తున్న రెండో ఎఎన్ఎంల ప్రథమ మహాసభలను జయప్రదం చేయాలని ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్ పిలుపునిచ్చారు. ఎఎన్ఎంలు అందరూ అధికసంఖ్యలో పాల్గొని సమస్యల పరిష్కారందిశగా ఈ మహాసభ ఉంటుందన్నారు. గత 17సంవత్సరాలుగా రెండో ఎఎన్ఎంలందరిని రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. కావున నాగర్‌కర్నూల్ జిల్లా నలుమూలల నుండి రెండో ఎఎన్ఎంలు అధిక సంఖ్యలోపాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



## సర్వేలో పూర్తి సమాచారం నమోదు

**ప్రజాపక్షం/వంగూర్ :** రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సమగ్రసర్వేలో తప్పనిసరిగా ప్రతి ఒక్కరూ పాల్గొని పూర్తి సమాచారాన్ని నమోదు చేయించుకోవాలని రాష్ట్ర వ్యవసాయ కమీషన్ సభ్యులు కెవిఎన్ రెడ్డి అన్నారు. శనివారం ఆయన స్వగ్రామమైన కొండారెడ్డిపల్లిలో ఇంటింటి సర్వేలో పాల్గొని గ్రామస్తులతో మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసమే ఇంటింటి సమగ్రసర్వే అన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా పూర్తిసమాచారాన్ని నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వేమారెడ్డి, బుజ్జకృష్ణారెడ్డి, పర్వతాలు, పంచాయతీ కార్యదర్శి క్రాంతికుమార్, ఏఈవో ప్రేమ్‌కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.



## ఘనంగా జాతీయ జర్నలిస్టు డే

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** కల్వకుర్తి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం జాతీయ జర్నలిస్టుడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి పత్రికా విలేకరులతో కలిసి కేక్‌కట్‌చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో జర్నలిస్టులపాత్ర ఎనలేనిదని , ప్రజల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తారని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు శ్రీధర్, కృష్ణయ్య, బాలయ్య, కస్తూరిశ్రీను, రామచందర్,శ్రీనివాసులు, రాజన్న, శివశంకర్, ఫయాజ్, భాస్కర్, హాజీ,అశోక్, రవిగౌడ్, కల్వకుర్తి మాజీసర్పంచ్‌లు ఆనంద్‌కుమార్, రాములు, భూపతిరెడ్డి, కౌన్సిలర్లు రాంరెడ్డి, ఎజాజ్ పాల్గొన్నారు.

## భక్తితో పులకరించిపోయిన భక్తులు

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజీ దగ్గర గల సుప్రసిద్ధమైన శైవక్షేత్రం శ్రీ కోటిలింగేశ్వర దత్తదేవస్థానం దగ్గర నూతనంగా నిర్మించిన ధ్యానమందిరంలో కార్తీక మాసం సందర్భంగా కోటిలింగాల ప్రతిష్టతో భక్తులు పులకరించి పోయారు. వీరశైవ ఆగమ పాఠశాల అధ్యాపకులు మాట్లాడుతూ ఎన్నో జన్మల పుణ్యఫలం వలన మీకు ఈ లింగ ప్రతిష్ట చేసే భాగ్యం దక్కిందని మీ వంశీకులందరూ పుణీతులౌతారని అన్నారు. అనంతరం ఆలయ కమిటీ అన్న ప్రసాద వితరణ చేశారు.

# రైతుల ఐక్యతకు సహకార సంఘాలే పునాది

### ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ప్రజాపక్షం/కల్వకుర్తి :** రైతుల ఐక్యతకు సహకారసంఘాలే పునాదిఅని ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి అన్నారు. 71వ అఖిలభారత సహకార వారోత్సవాలలో భాగంగా శనివారం కల్వకుర్తి పిఏసిఎస్ కార్యాలయంలో చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన వ్యవస్థాపక ఉద్యోగకల్పన, నైపుణ్యాభివృద్ధి ప్రోత్సహించడంలో సహకార సంఘాలపాత్రపై రైతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి హాజరై జ్యోతిప్రజ్వలన చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు మెరుగైన ప్రపంచం కోసం సహకారసంస్థల పాత్ర అమోఘమన్నారు. అదేవిధంగా రైతుల అభివృద్ధికోసం రాష్ట్రప్రభుత్వం ఎంతో కృషిచేస్తుందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ప్రణాళికబద్ధంగా అమలుచేస్తూ ముందుకు సాగుతుందని అన్నారు. రైతులు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అభివృద్ధిలో అందరూ భాగస్వాములుకావాలని ఆయన పిలుపునిచ్చారు. రూ.18వేల కోట్ల రుణ మాఫీ చేయడం జరిగిందని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రప్రగతే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. రైతుల అభివృద్ధే దేశాభివృద్ధి అని ఆయన పునరుద్ఘటించారు. అనంతరం తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ మేనేజింగ్ డైరెక్టర్ అన్నపూర్ణ మాట్లాడుతూ వికాసిత్‌భారత్ నిర్మాణంలో సహకారసంస్థల పాత్ర ఎంతో ఉందన్నారు. ఈనెల 14నుండి 20వరకు వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఆమె పేర్కొన్నారు. ప్రధానంగా సహకారసంస్థలు మార్పుకు కీలక ఏజెంట్లుగా వ్యవహరిస్తూ సమ్మిళితవృద్ధి, సుపరిపాలన స్థిరమైన అభివృద్ధి ప్రతిబింబిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ రిజిస్టర్ తెలంగాణ సహకార సంఘం పరిమళ, తుమ్మప్రసాద్, డిసిఓ మాడుగుల రఘునాథరావు, సూపర్‌ఇండెంట్ మధురావు, పిఏసిఎస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాజవర్ధన్ రెడ్డి, మున్సిపల్‌చైర్మన్ సత్యం, రంగాపూర్ పిఏసిఎస్ చైర్మన్ సురేందర్‌రెడ్డి, కల్వకుర్తి వైస్‌చైర్మన్ శ్యామ్, సిఇఓ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు , పిఏసిఎస్ డైరెక్టర్లు , వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు. అదేవిధంగా కల్వకుర్తి మండలపరిధిలోని రఘుపతిపేట, జీడిపల్లి గ్రామాలలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం కల్వకుర్తి పట్టణంలోగల ఐటిఐ కళాశాలను ఆకస్మికంగా తనిఖీచేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆయా గ్రామాల మాజీసర్పంచులు, ప్రజాప్రతినిధులు , అధికారులు పాల్గొన్నారు.

# పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు : కలెక్టర్

**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్ 3 పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నారాయణపేట జిల్లాలో 4024 మంది అభ్యర్థులతో పాటు, 15 మంది దివ్యాంగ అభ్యర్థులు గ్రూప్ 3 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పరీక్షలలో 4 ఫ్లయింగ్ స్క్వాడ్ , 45 మంది ఐడెంటిఫికేషన్ ఆఫీసర్లు , 4 రూట్ ఆఫీసర్లు, 13 మంది చీఫ్ సూపర్డెంట్లను నియమించినట్లు తెలిపారు. కలెక్టరేట్‌లోని ప్రజావాణి హాల్‌లో మానిటరింగ్ సెల్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పగడ్బందీగా పోలీస్ బందోబస్తు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పరీక్షా సమయానికి అభ్యర్థులు హాజరుకు ప్రత్యేకంగా అన్ని రూట్లలో బస్సులు అదనంగా నడపాలని ఆర్టీసీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అదేవిధంగా పోలీస్ శాఖ పూర్తిగా బందోబస్తును నిర్వహించాలని ఆదేశించారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద ప్రాథమిక చికిత్స కేంద్రానికి ఏర్పాటు చేయాలని సూచించారు. పరీక్ష కేంద్రాలకు మూడు కిలో మీటర్ల పరిధిలో అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని తెలిపారు.

**ఎస్పీ కార్యాలయంలో ...**

పరీక్షా కేంద్రాల వద్ద పటడిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్ష సమయానికి 2 గంట ముందే కేంద్రానికి చేరుకోవాలని, మానసికంగా ఎటువంటి ఆందోళన చెందకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ శివశంకర్ , గ్రూప్ 3 ఎగ్జామ్ , కోఆర్డినేటర్ శంకరయ్య, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, రాజు, కృష్ణదేవ్ , నరేష్ , రమేష్ , పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పటిష్ట బందోబస్తు : ఎస్పి

**వనపర్తి :** ఈ నెల 17, 18 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న గ్రూప్ 3 కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లను చేసినట్లు జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఒక ప్రకటనలో తెలియజేశారు. వనపర్తి జిల్లాలో మొత్తం 31 కేంద్రాల వద్ద సుమారుగా 200 మంది పోలీసు అధికారులు, సిబ్బందితో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లను చేసినట్లు తెలిపారు. పరీక్ష రాయడానికి పరీక్షా కేంద్రానికి వచ్చే అభ్యర్థులు ఉదయం 9.30 గంటలు లోపు మధ్యాహ్నం అయితే 14.30 గంటల లోపు హాజరు కావాలన్నారు. పరీక్షా కేంద్రాల మెయిన్ గేట్లను మూసివేయడం జరుగుతుంది. అభ్యర్థులు ఎటువంటి ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రంలోకి తీసుకొని రాకూడదని , అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఇతర శాఖల అధికారులతో సమన్వయం పాటిస్తూ పోలీస్ శాఖ పని పని చేస్తుందన్నారు. గ్రూప్ 3 పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఎటువంటి అపోహలకు, ఆందోళనకు గురికాకుండా పరీక్షకు హాజరు కావాలని కోరారు.



## ఎంపిని సన్మానించిన యాదవ సంఘం

**ప్రజాపక్షం / ధన్వాడ :** మండల పరిధిలోని గున్ముక్ష గ్రామంలో పార్లమెంట్ సభ్యులు డి.కె. అరుణను అఖిల భారత యాదవ సంఘం నాయకులు సన్మానించారు. ఈ నెల 25వ తేదీన అఖిల భారత యాదవ సంఘం తలపెట్టిన సదర్ సమ్మేళనానికి అఖిల భారత యాదవ మహాసభ జరగనుందన్నారు. ఈ కార్యక్రమానికి తప్పకుండా హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా నాయకులు , రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రఘువీర్ యాదవ్ , యాదవ , యువత సభ్యులు , మనివర్ధ్ యాదవ్ కుమార్ , అక్షయ్ కుమార్ యాదవ్ , గోపాల్ యాదవ్ , యాదవ మహాసభ సీనియర్ నాయకులు రామచంద్ర యాదవ్ , అంజి యాదవ్ , చిన్నయ్య యాదవ్ , చెన్నకేశవులు యాదవ్ , ఉషన్న యాదవ్ , తిరుపతి యాదవ్ , నాగులు యాదవ్ పాల్గొన్నారు.



## వసతి గృహాన్ని ప్రారంభించిన ఎంపి

**ప్రజాపక్షం / ధన్వాడ :** ధన్వాడ మండల పరిధిలోని గున్ముక్ష గ్రామంలో స్వయంభూ కడపరాయ దేవాలయం దగ్గర ఆ గ్రామ ఆలయ కమిటీ చైర్మన్ చిన్న గౌని శ్రీనివాస్ రెడ్డి తన సొంత డబ్బులతో భక్తులు దేవాలయం దగ్గర ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా ఉండాలని ఉద్దేశంతో వసతి గృహాన్ని నిర్మించి మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డి.కె. అరుణమ్మతో ప్రారంభోత్సవం జరిపించారు. ఆలయకమిటీ సభ్యులు , పూజారి నాగార్జున మేడంకి స్వాగతం పలికి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు దేవాలయ డెవలప్మెంట్ కొరకు అభ్యర్థించగా ఎంపీ సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో భక్తులు , కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు, వివిధ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## కలెక్టర్ సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో శనివారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ గ్రూప్ 3, పరీక్షల నిర్వహణ, వరి ధాన్యం, కొనుగోల్లు, సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేపై జిల్లా అధికారులతో సమీక్ష జరిపారు. ఆది, సోమవారాల్లో జరిగే గ్రూప్ 3 పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలలో అవసరమైనన్ని టార్పాలిన్లు, డిజిటల్ మైక్రో మీటర్లు, ఎలక్ట్రానిక్ కాంటాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. సర్వే సమగ్ర విచారాల డాటా ఎంట్రికి ఎంత మంది ఆపరేటర్లు అవసరమో గుర్తించి సోమవారం నుంచి డాటా ఎంట్రి ప్రక్రియను ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ బేన్ షాలం, ఆర్డీఓ రామచందర్ , జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.



## హామీలు వెంటనే నెరవేర్చాలి

**ప్రజాపక్షం/పెబ్బేరు :** కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం ఏర్పడిన టాడి కార్పొరేషన్‌కు తగిన నిధులు కేటాయించి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని పెబ్బేరు మండల గౌడ సంఘం అధ్యక్షులు మాచర్ల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. కల్లుగీత వృత్తిలో ప్రమాదాల నివారణకు ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. టాడీ కార్పొరేషన్ ఉద్దేశం వృత్తిలో అధునీకరణ పద్ధతులు తీసుకురావడం, ఉపాధి అవకాశాలు మెరుగుపర్చడం కానీ నిధులు కేటాయింపు సరిగా లేకపోవడంతో ఆ పని చేయడం లేదన్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో గీత కార్మికుల సంక్షేమం కోసం కేటాయించిన డబ్బులతో హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్‌లో నీరా కేఫ్ నిర్మించారన్నారు. ఇది రాష్ట్ర గీత కార్మికులందరి ఆసక్తి అన్నారు. ఇది టూరిజం శాఖ ఆధీనంలో ఉండటం ఏంటని ప్రశ్నించారు. వెంటనే టాడి కార్పొరేషన్‌కు అప్పగించాలని ప్రభుత్వాన్ని కోరారు. యాదాద్రి భువనగిరి జిల్లాలోని నందనంలో కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి తెచ్చిన యంత్రాలు , కట్టిన భవనం నిరుపయోగంగా ఉంటుందన్నారు. దీనిని వెంటనే పునరుద్దరించాలని అన్నారు. ప్రతి జిల్లాలో నీరా, తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు పెట్టి యువతీ యువకులకు ఉపాధి కల్పించాలన్నారు. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్రంలో వృత్తి చేసే వారందరికి ప్రమాద నివారణకు సేఫ్టీ కిట్టులు త్వరగా అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. దీనిపై అవగాహన కల్పించేందుకు కల్లుగీత కార్మిక సంఘం కృషి చేస్తుందన్నారు. ఈ తొమ్మిది నెలల కాలంలో వృత్తిలో ప్రమాదం జరిగిన వారికి ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా డబ్బులు 8 కోట్లు వెంటనే ఇవ్వాలని, 560 జీఓ ప్రకారం ప్రతి సోసైటీకి ఐదు ఎకరాల భూమి ఇవ్వాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలన్ని అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల గౌడ సంఘం అధ్యక్షుడు మాచర్ల శ్రీనివాస్ గౌడ్ , ఉపాధ్యక్షులు వజగౌని, ఉమేష్ గౌడ్ , కోశాధికారి రంగస్వామిగౌడ్ , బాలరాజ్ గౌడ్, ప్రభాకర్ గౌడ్ , సాయి తేజగౌడ్ పాల్గొన్నారు.



### గంజాయి, డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం

## సమాజాన్ని కాపాడుదాం

**ప్రజాపక్షం / పాన్‌గల్ :** గంజాయి డ్రగ్స్‌ను నిర్మూలిద్దామని, సమాజాన్ని కాపాడుదాం అని డివైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు గడ్డి కోపుల మహేష్ అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాక్య పాన్‌గల్ మండల కమిటీ, మండల కార్యదర్శి కమలాకర్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఐ శ్రీనివాసుతో గంజాయి డ్రగ్స్ నిర్మూలిద్దాం సమాజాన్ని కాపాడుదమనే కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థుల మేదస్సు ఆలోచనలు సమాజంలో విద్యార్థులు యువత చెడు మార్గాం వైపు వ్యాసనాలకు బానిస అవుతున్న పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. గంజాయి మాదక ద్రవ్యాలు అత్యంత ప్రమాదం అన్నారు. వాటికి అలవాటు పడిన వారు తమ ప్రాణఆలను కోల్పోయే ప్రమాదం ఉందని అన్నారు. సకల అనర్థాలకు ఆరాచకాలకు హత్యలకు ప్రేరణంగా నిలిచే గంజాయి డ్రగ్స్ వాడటం వంటి మత్తు వ్యాసనాలను దూరం చేయకుండా డ్రగ్స్ మారుమూల గ్రామాలకు పట్టణాలకు వ్యాప్తి చెందడం అత్యంత అందోళన కలిగించే విషయాలను అన్నారు. ఈ సమస్యకు స్వాస్థ పరిష్కారం దిశగా ప్రభుత్వం కఠిన చట్టాలను అమలు చేయాలని ప్రభుత్వాని కోరారు. మత్తు వదులు, యువత మేలుకో అంటూ డివైఎఫ్ఐ రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

### ధాన్యం నాణ్యతతో విక్రయించాలి : మంత్రి తుమ్మల

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** వరిధాన్యం విక్రయించేందుకు దళారులను రైతులు నమ్మి మోసపోవద్దని రాష్ట్ర వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం శ్రీశైలదైవదర్శనం చేసుకొని తిరుగుప్రయాణంలో హైదరాబాద్‌కు వెళుతుండగా మార్గమధ్యలో వెల్దండ మండలకేంద్రంలోని హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపైగల శ్రీవెంకటేశ్వరరైస్‌మిల్లులో ఆరబెట్టి ఉన్న వడ్లను మంత్రి తుమ్మలనాగేశ్వరరావు పరిశీలించారు. అనంతరం రైతులతో మంత్రి మాట్లాడుతూ గతంలోకంటే వ్యవసాయం లాభసాటిగా మారిందని రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకూడదని , ప్రభుత్వం ఏర్పాటుచేసిన వరికొనుగోలు కేంద్రాలలోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలనిరైతులకు సూచించారు. అదేవిధంగా ప్రభుత్వం సన్నవడ్లకు రూ.500ల బోనస్‌కూడా ఇస్తుందని రైతులు నాణ్యత ప్రమాణాలు పాటించి ధాన్యం విక్రయించాలని పేర్కొన్నారు. కొనుగోలుకేంద్రాల వద్ద ఎలాంటి సమస్యలు ఎదురైన వెంటనే అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఏపంటలను సాగుచేస్తున్నారని మంత్రి రైతులను అడిగి తెలుసుకున్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేస్తానని మాట ఇచ్చి మోసం చేసిందికాని కాంగ్రెస్‌ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతులకు ఏకకాలంలో 2లక్షల రుణమాఫీచేసి వారికి అండగా నిలిచారని అన్నారు. రైతన్న అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో కలీం, లక్ష్మయ్య, రామకృష్ణ, ఆనంద్‌కుమార్ ఉన్నారు.



## కేంద్రాలు తెరిచారు ... కొనడం మరిచారు

**ప్రజాపక్షం / పెబ్బేరు :** పెబ్బేరు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో ఏర్పాటు చేసినటువంటి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల బీఆర్ఎస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ సందర్భంగా రైతుల నుండి అడిగి తెలుసుకున్నారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి పది రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు ఎలాంటి వరి ధాన్యం కొనుగోలు జరగలేదని పైగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం క్వింటాలుకు 500 బోనస్ ఇస్తామన్నారు. ఇప్పటి వరకు ఇలాంటి ఆచరణ లేదని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం నోటి మాటలకు తప్ప చేతుల్లో చూపడం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, మండల నాయకులు, యువకులు, రైతులు బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాపక్షం / కొత్తకోట :** కొత్తకోట మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ చైర్మన్ ప్రశాంత్ సిడిసి చైర్మన్ పి. చంద్రశేకర్ రెడ్డి , మాజీ సిడిసి చైర్మన్ మూలమల్ల చంద్రశేఖర్ రెడ్డి పార్టీ అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మూలమల్ల వెంకటేశ్వర్ రెడ్డి , సింగిల్‌విండో డైరెక్టర్స్ జి. హరిచంద్రరెడ్డి, నీలవర్ధన్ రెడ్డి, ఎం. శ్రీనివాసులు , మాజీ ఎంపీటీసీ పి. రాములు నాయుడు, మూలమల్ల విక్రసింహారెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగరాజుయాదవ్ , కురుమూర్తి, ఎండి మహమూద్ , మున్నూరు, నర్సిములు, ఎండి. గఫార్ , హమాలీ సంఘం నాయకులు రామకృష్ణాపురం రైతులు పాల్గొన్నారు.




## చిన్నంబావి మండలంలో...

**ప్రజాపక్షం / చిన్నంబావి :** మండల కేంద్రంలోని రైతులు పండించిన ధాన్యం రైతుల ముగింటానే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. మండల కేంద్రంలో మహిళా సంఘాల ఆద్వర్యంలో ప్రారంభించారు. పెద్దదగడ గ్రామం చిన్న దగడగ్రామం , మియాపూర్ గ్రామాలలో వానకాలం ఖరీఫ్ 2024 /25 సెర్ప్ ఐకెపి వరి పంట కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ బగ్గారి నర్సింహరెడ్డి ప్రారంభించారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ రాంచంద్రారెడ్డి , కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కొత్త కళ్యాణ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏ గ్రేడ్ వడ్లకు క్వింటాల్‌కు రూ. 2320 , కామన్ గ్రేడ్ వడ్లకు క్వింటాల్‌కు రూ. 2300ల చొప్పున కాంగ్రెస్ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతు ప్రభుత్వం అని ప్రతి రైతుకు న్యాయం చేకేరాల పని చేస్తుందని అన్నారు.ఈ కార్యక్మరంలో మండల అధ్యక్షులు బి. చంద్రశేఖర్ యాదవ్ , మండల నాయకులు బీచుపల్లి యాదవ్ , తేజరెడ్డి, డిపిఎం బాషా నాయక్ , ఏపిఎం మద్దిలేటిగా మండల మహిళా సమాఖ్యధ్యక్షురాలు ఇంద్ర రెడ్డి, బుక్ కీపర్ నర్సింహ, పెద్ద దగడ, చిన్న దగడ, మియాపూర్ , గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## పదోన్నతితో మరింత బాధ్యత

### ఎస్పీ యోగేష్ గౌతమ్

**ప్రజాపక్షం / నారాయణపేట ప్రతినిధి :** నారాయణపేట జిల్లా పోలీస్ హెడ్ క్వాటర్స్‌లో కానిస్టేబుల్ గా విధులు నిర్వర్తిస్తున్న పిసి నం. 2799 రాములు హెడ్ కానిస్టేబుల్‌గా ప్రమోషన్ పొంది శనివారం జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎస్పీ హెచ్‌సి ర్యాంక్ పట్టీలును తొడిగి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో పదోన్నతి ఉత్సాహంతో పాటు మరింత బాధ్యత పెంచుతుందని విధి నిర్వహణలో ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ మరింత ఉత్సాహంగా పని చేస్తూ ప్రజలకు మంచి సేవలు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-3కి 50 పరీక్ష కేంద్రాలు



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్: గ్రూప్3 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. శనివారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 17,18 తేదీల్లో జరగనున్న గ్రూప్3 పరీక్షల అధికారులు ఉదయం 7 గంటలకు పరీక్ష కేంద్రాలను చేరుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా 50 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని 16,543 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరు కానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణ కోసం 19 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 10 జాయింట్ రూట్ అధికారులు, 54 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 208 మంది ఐడెంటిఫికేషన్ అధికారులను నియామకం చేసినట్లు చెప్పారు. 17వ తేదీ ఉదయం, మధ్యాహ్నం పరీక్షలు ఉంటాయని తెలిపారు. పరీక్ష పూర్తి అయ్యే వరకు బయటికి పంపవద్దని, బయోమెట్రిక్‌తో అభ్యర్థులు హాజరు కావాలని సూచించారు. నిశిత పరిశీలన తరువాత అనుమతి ఇవ్వాలన్నారు. పరీక్ష కేంద్రంలో సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు.

## విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్: గ్రంథాలయ 57వ జాతీయ వారోత్సవాల్లో భాగంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు శనివారం పర్యావరణంపై ప్లాస్టిక్ ప్రభావం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బి బాలమ్మ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సంఘం కార్యదర్శి ప్రవీణ్ కుమార్, గ్రంథాలయ అధికారి వద్ద శ్యాంసుందర్ రెడ్డి, లైబ్రేరియన్ ఎంవి రంగారావు, కె విజయభాస్కర్, పి సృజన, ఉపాధ్యాయులు చారి, సుమతి, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, జివి, విశ్వనాథ చారి పాల్గొన్నారు.

## 18న ఎస్‌కెఎం రాష్ట్ర సదస్సు



ప్రజాపక్షం/సూర్యాపేట: ఈనెల 18న హైద్రాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కెఎం) రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్లు ఎఐకెఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్, టిఎస్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కంబాల శ్రీనివాస్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి దండా వెంకట్ రెడ్డి, తెలంగాణ రైతాంగ సమితి జిల్లా కార్యదర్శి నల్లడ మాధవరెడ్డిలు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మద్దతు ధర అమలు చేయడంతో పాటు వరి పంటకు రూ. 500ల బోనస్ చెల్లించాలన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా నవంబర్ 15 నుంచి డిసెంబర్ 15 వరకు జరిగే సదస్సులు, సెమినార్, ప రచార క్యాంపియన్‌లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బూర వెంకటేశ్వర్లు, ఎఐకెఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు కునుకుంట్ల సైదులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాల తనిఖీ



ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్: మండలంలోని గాంధీనగర్ శివారులో ఏర్పాటు చేసిన ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం జిల్లా ఎస్‌పి సన్ ప్రీత్ సింగ్ తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న రైతులతో మాట్లాడారు. కొనుగోలు జరుగుతున్న తీరును నిర్వహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు నిర్వహకులు సౌకర్యాలు కల్పించాలన్నారు. రైతులు తాము పండించిన ధాన్యంను ఆరబెట్టి తీసుకవచ్చి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను పొందాలన్నారు. ధాన్యం కొనుగోలులో ఇతరుల మాటలు నమ్మి ఆందోళనకు గురికావదన్నారు. తమ సమస్యలను ఉంటే సంబంధిత శాఖ అధికారుల దృష్టికి తీసుకవస్తే పరిష్కారం చేస్తారని చెప్పారు. రైతులు రోడ్లపై ధాన్యం ఆరబెట్టడంతో రాత్రుల్లో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. దయచేసి రైతులు రోడ్లపై ధాన్యం ఆరబెట్టవద్దని కోరారు. ఆయన వెంట స్పెషల్ బ్రాంచ్ సిఐ వీరరాఘవులు, రూరల్ సిఐ సురేందర్ రెడ్డి, ఎస్ఐ బాలు నాయక్ ఉన్నారు.

## ఇథనాల్ కంపెనీ నిర్మాణం చేపట్టొద్దని రైతుల వినతి

ప్రజాపక్షం/వడ్డేపల్లి: రాజోలి మండలం కు చెందిన రైతులు ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి , ఎమ్మెల్యే విజయుడుకు ఇథనాల్ కంపెనీ నిర్మాణం చేపట్టవద్దని వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ రాజోలి 2009 లో వచ్చిన వరదల కారణంగా ప్రజలు రైతులు తీవ్ర నష్టాలను చవిచూడడం జరిగింది. ప్రస్తుతం ఇథనాల్ కంపెనీ నిర్మాణం చేయడం ద్వారా 1.పెద్దధన్వాడ, 2.చిన్నధన్వాడ, 3.నసనూరు 4.మాన్‌దొడ్డి 5.చిన్న తంద్రపాడు,6.నౌరోజీ క్యాంపు,7.వేణి సోంపురం, 8.కేశవరం,9.తుమ్మిళ్ల, 10.పచ్చర్ల, 11.తనగల, 12పెద్ద తాంద్రపాడు, 13. రాజోలి గ్రామాల రైతులు తమ పంట పొలాలు బీడు భూములుగా మారే అవకాశం ఉంది. ఈ ఫ్యాక్టరీ నిర్మాణం చేపట్టడం వల్ల పంట పొలాలు కలుషితమై ప్రజలు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉంది. ప్రజల జీవన విధానం ప్రమాదంలో నెట్టివేయబడుతుందని రైతులు ఎమ్మెల్సీ , ఎమ్మెల్యేకు వివరించారు. అలంపూరు నియోజకవర్గం ప్రజల సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి న్యాయం చేయాలని ఎమ్మెల్సీ , ఎమ్మెల్యేను ప్రజలు రైతులు కోరారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుని వెళ్లి న్యాయం జరిగే విధంగా చూస్తానని ఎమ్మెల్సీ ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజోలి మండలంలోని వివిధ గ్రామాల రైతులు ప్రజలు పాల్గొన్నారు.



# మూసీపై బిజెపి కొత్త డ్రామాలు

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



ప్రజాపక్షం/యాదగిరిగుట్ట : మూసీపైన బీజేపీ నేతలు కొత్త డ్రామాలు మొదలు పెట్టారని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మండిపడ్డారు. ఈ సందర్భంగా యాదగిగుట్ట పట్టణంలోని తన కార్యాలయంలో మాట్లాడుతూ మూసి పునరుజ్జీవ కార్యక్రమాన్ని అడ్డుకోవడానికి బీఆర్ఎస్ తో కుట్రలు చేస్తున్నారన్నారు. మూసీ బాధితులతో కలిసి ఒక రోజు రాత్రి ఉంటామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అనటం సిగ్గుగా ఉందని కానీ మూసి మురికిలో అనేక దశాబ్దాలుగా నిరుపేదలు ఉంటున్నారన్నారు. మురికి కంపులో, దోమల మధ్య రోగాల బారిన పడి విధి లేక ప్రజలు అక్కడే నివాసముంటున్నారన్నారు. మూసి కంపులో మూడు నెలలు ఉండాలని మా సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్, బీజేపీ నేతలకు ఛాలెంజ్ విసిరారని తెలిపారు. కిషన్ రెడ్డి మాత్రం ఒక రాత్రి షో చేయడానికి మీడియా ప్రచారం కోసం వెళ్తున్నారని, ఒక రాత్రి ఉండి మీరు ఏం సాధిస్తారు. అని ప్రశ్నించారు. దోమతెరలు, ఫ్యాన్లు, మాస్కులు లేకుండా ఆరు బయట బీజేపీ నాయకులు నిద్ర పోవాలని చాలెంజ్ విసిరారు. మీడియా కోసమే కిషన్ రెడ్డి, బీజేపీ నాయకులు షో చేస్తున్నారన్నారు. మూసి బాధితులపైన మీకు ఏ మాత్రం ప్రేమ ఉన్నా మూసి పునరుజ్జీవ ప్రాజెక్టుకు సహకరించాలన్నారు. మూసి పునర్జీవం కావాలి కాని ఎవరిని అక్కడి నుంచి ఖాళీ చేయించవద్దని కిషన్ రెడ్డి అర్థం లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. సబర్మతి, నమామీ గంగే కార్యక్రమాల కోసం అక్కడ ఎవరిని ఖాళీ చేయించలేదా..? అని ప్రశ్నించారు. గుజరాత్‌లో 40 వేల కుటుంబాలను తరలించారని, మరెందరికో పునరావాసం కల్పించకుండా మోసం చేసిన ఘనత మీది అన్నారు. కిషన్ రెడ్డికి ఏ మాత్రం సికింద్రాబాద్, హైదరాబాద్ ప్రజలపైన ప్రేమ ఉన్నా మూసీ ప్రక్షాళనకు సహకరించాలన్నారు. కేంద్రంతో మాట్లాడి మంచి కార్యక్రమానికి నిధులు తీసుకురావాలన్నారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి చేస్తున్న కుట్రను ప్రజలు అర్థం చేసుకోవాలని, మూసి ప్రక్షాళనకు అడ్డం ఎవరొచ్చినా ఊరుకునేది లేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మండిపడ్డారు.

# తెలంగాణ కోసం లక్ష్మణ్‌బాపూజీ పదవి త్యాగం

### విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంఎల్‌ఏ బాలునాయక్



ప్రజాపక్షం/దేవరకొండ: తెలంగాణ కోసం 1969లో మంత్రి పదవిని కూడా తృణప్రాయంగా వదిలేసిన నిబద్ధత కలిగిన రాజకీయ వేత్త కొండా లక్ష్మణ్ బాపూజీ అని దేవరకొండ ఎంఎల్‌ఏ నేనావత్ బాలునాయక్ అన్నారు. శనివారం పట్టణ పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో బస్టాండ్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన స్వంతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి కొండా లక్ష్మణ్‌బాపూజీ కాంస్య విగ్రహాన్ని అఖిల భారత నిత్య అన్నదాన సత్రం, మార్గదర్శకులు చిలువేరు కాశీనాథ్‌తో కలిసి ఎంఎల్‌ఏ బాలునాయక్ ఆవిష్కరించారు. బాపూజీ త్యాగాలు భవిష్యత్ తరాలకు తెలియాలని, విలువలకు కట్టుబడిన వ్యక్తిగా జీవితాంతం అదే విలువలతో బతికారని ఆయన సేవలను కొనియాడారు. మలి దశ తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారులకు కొండా లక్ష్మణ్ బాపూజీ అండగా ఉన్నారనే విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 1952లో బాపూజీ రూపొందించిన సహకార సంఘాలు దేశంలోనే ప్రప్రథమం కావడం విశేషం, చేనేత ఉత్పత్తుల క్రయ విక్రయాల కోసం 1952లో హైకోర్టును ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్ల నర్సింహా, అఖిల భారత సంఘం అధ్యక్షులు కండగట్ల స్వామి, భద్రాచలం పద్మశాలి అన్నసత్రం అధ్యక్షులు బోసిక యాదగిరి, పద్మశాలి సంఘం అధ్యక్షులు కృష్ణయ్య, కార్యదర్శి రాఘురాములు, కోశాధికారి శ్రీనివాస్, వేంకటేశ్వర్లు, వెంకటయ్యగౌడ్, పిఏసిఎస్ చైర్మన్ శ్రీశైలం, రుక్మారెడ్డి, వెంకటేశ్‌గౌడ్, చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు వీరమోహన్, చేనేత సహకార సంఘం అధ్యక్షులు నర్సింహా, చంద్రమౌళి, యాదయ్య, జగదీష్, శ్రీనివాసులు, శైలజ, పుష్పలత, అంజన్, ఆంజనేయులు, లక్ష్మి, మురళి పాల్గొన్నారు.

# గంజాయి రహిత జిల్లాగా మార్చుదాం

### యువత, విద్యార్థులు గంజాయి బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలి: కలెక్టర్ ఎం.హనుమంత రావు



ప్రజాపక్షం/యాదాద్రి : యువత, విద్యార్థులు గంజాయి బారిన పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ ఎం.హనుమంత రావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం మినీ మీటింగ్ హాల్‌లో గంజాయిపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర, స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ గంగాధర్, రెవిన్యూ జిల్లా అదనపు కలెక్టర్ వీరారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులు ఉద్దేశించి మాట్లాడుతూ జిల్లాలో గంజాయిపై ఉక్కుపాదం మోపాలని, జిల్లాను గంజాయి రహిత జిల్లాగా మార్చాలని, గంజాయి మీద దృష్టి పెట్టి, యువతను, విద్యార్థులను గంజాయి, ఇతర మత్తు పదార్థాల నుండి కాపాడాలన్నారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు బానిస కాకుండా అమ్మే కేంద్రాల మీద ప్రత్యేక దృష్టి పెట్టాలని, జిల్లా అంతట నిఘా పెట్టి, కొనే వాళ్ళు లేకుంటే అమ్మే వాళ్ళను గుర్తిస్తే నియంత్రణ చేయొచ్చు అన్నారు. యువతకు వాటి వల్ల కలిగే నష్టాలపై వివరించాలని, ఎక్కువగా పాఠశాలలు, కళాశాలలు ఉన్న చోట నష్టాలపై ఎక్కువ ఫోకస్ పెట్టాలని అన్నారు. గంజాయి చాలా ప్రమాదకరమైనదని భవిష్యత్తును అంధకారంలోకి తీసుకువెళ్తుందనే విషయాలను యువతకు తెలియజేయాలని, గ్రామీణ ప్రాంతాల్లో యువకులు గంజాయికి బానిసవకుండా చూడాలన్నారు. హైరిస్క్ ప్రాంతాల్లో గట్టిగా ఉండి అవసరమైన కేసులు నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాకు సరిహద్దు రాష్ట్రాల నుండి గంజాయి పదార్థాలు రాకుండా అన్ని చెక్ పోస్టలలో గట్టి నిఘా పెంచి పటిష్ఠ చర్యలు చేపట్టాలని, జిల్లాలో గంజాయి పంట సాగు గుర్తించి ధ్వంసం చేసి కేసులను నమోదు చేయాలని పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ అధికారులకు సూచించారు. తల్లిదండ్రులు రోజువారి పిల్లల స్థితిగతులను పరిశీలన చేయాలని కోరారు. డిప్యూటీ పోలీస్ కమిషనర్ రాజేష్ చంద్ర మాట్లడుతూ.. జిల్లా అంతటా గట్టి నిఘా ఉంచామని, జిల్లాలోని పాఠశాలలు, కళాశాలల్లో గంజాయి, మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలపై యువతకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి, రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, ఎక్సైజ్ సూపర్నెంట్ సైదులు, జిల్లా పంచాయతీ అధికారి సునంద, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సమసమాజ స్థాపన కోసం పోరాటం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ః దోపిడీ లేని వ్యవస్థ కోసం సమ సమాజ స్థాపన కోసం నాడు స్వాతంత్ర పోరాటంలో అగ్రభాగంలో నిలిచి పోరాడిన పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీరస్వామి అన్నారు. నల్లగొండ పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూఆయన పాల్గొని మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26వ తేదీన కాన్పూర్ లో సిపిఐ ఆవిర్భావించి బ్రిటిష్ ప్రభుత్వం కు వ్యతిరేకంగా పోరాడి ఎన్నో నిర్బంధాలను కుట్రలను జైలు జీవితాలను ఎదుర్కొని త్యాగలు చేసిన గొప్ప చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని గుర్తు చేశారు. పాలకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతరం ప్రజలను చైతన్యం చేస్తూ అనేక పోరాటాలకు నాయకత్వం వహిస్తుందన్నారు. నల్లగొండ జిల్లా కేందంలో డిసెంబర్ 30వ తేదీన జరిగే బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఇందిరమ్మ,ఇండ్లు రేషన్ కార్డులు,వృద్ధులకు,వికలాంగులకు పింఛన్ పెంచాలని డిమాండ్ చేశారు. టౌన్‌లో రోడ్లను మరమ్మతు చేయాలన్నారు. ఈ సమావేశంలోటౌన్ కార్యదర్శి గాదెపాక రమేష్ , సీనియర్ నాయకులు ముండ్ల ముత్యాలు,కె ఎస్ రెడ్డి,ఎస్‌కె మదర్, విశ్వనాధుల లెనిన్ బాబు,ఎస్ వీరయ్య, విజయ్ పుట్టమేల సుజాత,జొరిగల విజయ్,కే కౌసల్యాలు తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి : ఉజ్జిని



ప్రజాపక్షం/చింతపల్లి : నల్లగొండ జిల్లాలో అసంపూర్ణంగా ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు అన్నారు. మండల పరిధిలోని వింజమూరు, మాల్ వెంకటేశ్వరనగర్, రోటిగడ్డ తండా, చింతపల్లి గ్రామాలలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) గ్రామ శాఖ సమావేశాలను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరిరావు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలన్నారు. ప్రభుత్వాలు ఏవైనప్పటికీ ప్రజల పక్షాన నిలిచేవి కమ్యూనిస్టు పార్టీలే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడం కోసం కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. నల్లగొండ జిల్లాలో పెండింగ్లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందించాలని యాదగిరిరావు డిమాండ్ చేశారు. రైతులకు షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, రైతుబంధును వెంటనే ఖాతాలో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులు పండించిన వడ్లకు బోనస్ ఇవ్వాలని అన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సిపిఐ ఘనంగా నిర్వహించే శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్‌రావు, లక్ష్మయ్య, పెద్దయ్య, పరశురాములు, సైదులు, పాప, సీతారాం, కృష్ణ, సునీత, కోటమ్మ, రామ్‌చంద్, గోవింద్, తావూరియా పాల్గొన్నారు.

## స్కాలర్‌షిప్, ఫీజు బకాయిలు విడుదల చేయాలని ఆర్‌డిఓ ఆఫీస్‌కు తాళం



ప్రజాపక్షం/భువనగిరిరూరల్: భువనగిరి ఆర్‌డిఓ ఆఫీస్ ఎస్సి,ఎస్టి,బిసి,ఈబిసి, మైనార్టీ విద్యార్థులకు ప్రభుత్వం చెల్లించాల్సినటువంటి ఫీజు రీయింబర్స్ స్కాలర్షిప్ రూ.7,500 కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని బీసీ విద్యార్థి రాష్ట్ర ఉపాధ్యక్షులు పల్లగొర్ల మోదీరాందేవ్, గిరిజన విద్యార్థి సంఘం నాయకుడు నుణావత్ అరుణ్, ఎడ్ల మహలింగం యాదవ్ ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి ఆర్‌డిఓ కార్యాలయాన్ని ముట్టడించి ఆఫీస్‌కు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు. వేలాది మంది విద్యార్థులు ర్యాలిగా వచ్చి గేట్లు దూసుకొని ఆర్‌డిఓ ఆఫీస్‌ను ముట్టడించారు. పోలీసులకు విద్యార్థులకు తోపులాటతో ఆర్‌డిఓ ఆఫీస్ రణరంగంగా మారింది. గిరిజన విద్యార్థి, బీసీ విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఆర్డిఓ ఆఫీస్‌లో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నుణావత్ అరుణ్‌నాయక్, బీసీ యువజన సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ ఎడ్ల మహలింగం, పసుల శివ, ఎండి ఆమన్, శివమణి, భూక్య బాలాజీ నాయక్, రామ్ చరణ్, చందు, మనీషా, సాయి కుమార్, విజయేందర్, శ్రీకర్, నవీన్, అఖిల్ పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్య పెంచాలి

### మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి

ప్రజాపక్షం/మునుగోడుః ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య బోధనతో పాటు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పన కూడా చేపడితేనే ప్రభుత్వ పాఠశాలలో సంఖ్య పెరుగుతుందని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సూచించారు.నియోజకవర్గ కేంద్రంలోని వ్యక్తిగత క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలో ఉన్న విద్యాశాఖకు చెందిన డీఈవో, ఎంఈఓ లు, విద్యా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో మండలాల వారిగా ఎన్ని పాఠశాలలు ఉన్నాయి వాటిలో విద్యార్థుల సంఖ్య ఎలా ఉంది, మౌలిక సదుపాయాలు ఏ రకంగా ఉన్నాయి, ఉపాధ్యాయులు ఎంతమంది ఉన్నారు, ప్రభుత్వ పాఠశాలల్లో రోజురోజుకు విద్యార్థుల సంఖ్య తగ్గడానికి గల కారణాలు తదితర అంశాలపై చర్చించారు. ప్రభుత్వ పాఠశాలను పటిష్టం చేయడానికి నియోజకవర్గ వ్యాప్తంగా ప్రతి మండలాలలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఒకే కాంపౌండ్ లో చదివే విధంగా మెరుగైన మౌలిక సదుపాయాలతో ప్రభుత్వ పాఠశాలను అభివృద్ధి చేస్తానని, దానికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు.మొదటి విడతగా 30 నుండి 40 ప్రభుత్వ పాఠశాలల ను మెరుగైన మౌలిక సదుపాయాలతో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో ఉమ్మడి నల్గొండ జిల్లా డిసిసిబి అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్ రెడ్డి తో పాటు, వివిధ మండలాల నాయకులు, డిఈఓ బిక్షపతి, చండూరు, మునుగోడు, నాంపల్లి, మర్రిగూడ, గట్టుపల్ మండలాల ఎంఈవోలు, కాంప్లెక్స్ ల హెడ్మాస్టర్లు పాల్గొన్నారు.



## అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

### మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్: అర్హులైన జర్నలిస్టులను గుర్తించి అందరికీ , ఇళ్ల స్థలాలు వచ్చేలా కృషి చేస్తానని మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి హామీ ఇచ్చారు. శనివారం మీడియా అకాడమీ చైర్మన్ హోదాలో తొలిసారి నల్లగొండ జిల్లా కు విచ్చేసిన శ్రీనివాస్ రెడ్డిని ప్రెస్ క్లబ్ బృందం జాతీయ పత్రికా దినోత్సవ సందర్భంగా సాదరంగా ఆహ్వానించి శాలువాతో సత్కరించింది. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలంటూ, అందుకు మీడియా అకాడమీ తరపున రాష్ట్ర ప్రభుత్వంతో చర్చించి తగిన చొరవ చూపాలని శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులను గుర్తించి అందరికీ న్యాయం చేస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా జర్నలిస్టులకు ఇళ్లస్థలాలపై ప్రభుత్వం ఒక పాలసీని రూపొందిస్తుందని ఆ మేరకు కచ్చితంగా నల్లగొండ జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు అందజేసే ప్రక్రియ ఉంటుందని చైర్మన్ తెలిపారు. ఈ కార్యక్రమం లో ప్రెస్ క్లబ్ అధ్యక్షులు చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కోశాధికారి గుండాల యాదగిరి, కార్యవర్గ సభ్యులు అశోక్ రెడ్డి, ఉపేందర్, సాధత్ అలీ, పుప్పాల మట్టయ్య, బజరంగ్ ప్రసాద్, కనకయ్య, భాస్కర్, ప్రేమ్ కుమార్, కంది శీను, బాలరాజు, కృష్ణ, వెంకటేశ్వర్లు,శేఖర్, హరిప్రసాద్, వెంకట్, అచ్యుతారావు, ప్రసాద్, రమేష్, కుశలవ చారి తదితరులు పాల్గొన్నారు.

## సర్వేలో వివరాలు నమోదు చేసుకోవాలి



ప్రజాపక్షం/దేవరకొండ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసుకోవాలని ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా అన్నారు. శనివారం మండలంలోని పల్లె నర్సింహా స్వగ్రామం పడమటి పల్లి లో ఆయన ఇంటి వద్ద తన కుటుంబ సభ్యుల వివరాలను సర్వే ఎన్యూమరేటర్ల వద్ద నమోదు చేసుకున్నారు. ఈ సందర్భంగా పల్లె నర్సింహా మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న సమగ్ర సర్వేకు ప్రజలందరూ సహకరించి తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు ప్రజలు సర్వేలో కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేసుకోని సంక్షేమ పథకాలు పొందాలని సూచించారు. సర్వేపై వస్తున్న ఊహగానాలు ప్రజలు నమొద్దని అన్నారు. ప్రజా ప్రభుత్వంలో కళాకారులకు గుర్తింపు కార్డులు ఇచ్చి సంస్కృతిక శాఖలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వేముల సునీత, ఎన్యూమరేటర్ సునిత, రామకృష్ణ, గ్రామ ప్రజలు పల్లె లాలమ్మ, పల్లె భారీములు, భారీములు, గౌస్, రమేష్, జంగమ్మ, అయోధ్య, తిరుపతయ్య, నారయ్య తదితరులు పాల్గొన్నారు.

## లక్ష మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలును అదిగమించిన నల్లగొండ జిల్లా

ప్రజాపక్షం/నల్లగొండ: ఈ వానకాలం ధాన్యం కొనుగోలు లో భాగంగా ఇప్పటి వరకు నల్గొండ జిల్లాలో లక్ష మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. లక్ష మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యంతో పాటు, 4900 క్వింటాళ్ల సన్న ధాన్యం సైతం కొనుగోలు చేశామని ,ధాన్యం అమ్మిన రైతులకు ఇప్పటివరకు 109 కోట్ల రూపాయలు వారి ఖాతాలలో జమ చేసినట్లు ఆమె వెల్లడించారు. ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకుగాను, ప్రతిరోజు తనతో పాటు ,అదనపు కలెక్టర్, పౌర సరఫరాల శాఖ అధికారులు తనిఖీ చేస్తున్నారని, అంతేగాక ప్రత్యేక అధికారి సైతం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలును ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. రైతులు కొనుగోలు కేంద్రానికి తెచ్చిన ధాన్యాన్ని తక్షణమే అమ్ముకునేందుకు నాణ్యత ప్రమాణాలతో ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వం నిర్దేశించిన మద్దతు ధరను పొందవచ్చని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని కొనుగోలు కేంద్రాలలో అవసరమైన సౌకర్యాలని ఉన్నాయని ,ఇప్పుడు ఎలాంటి వర్షాలు లేనందున ధాన్యం కొనుగోలు ఊపందుకుందని ఆమె వెల్లడించారు .కొనుగోలు కేంద్రాల నిర్వహకులు సైతం కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని త్వర త్వరగా కొనుగోలు చేసి మిల్లులకు పంపించాల్సిందిగా ఆమె పునరుద్ఘాటించారు.

## బాల్య వివాహాలపై అవగాహన

ప్రజాపక్షం / అయిజ : మండల పరిధిలోని కస్తూర్బా శనివారం పాఠశాలలో బాల్య వివాహాలపై జిల్లా జడ్జి ఘంటా కవితా దేవి సెక్రెటరీ డిస్ట్రిక్ట్ అథారిటీ జోగులాంబ గద్వాల జల్లా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న వయస్సులో పెళ్ళిళ్ళు చేస్తే అనేక అనర్థాలకు దారితీస్తుందని చివరికి ప్రాణాలు పోయే అవకాశం లేకపోలేదని అన్నారు. బాల్య వివాహాలపై చిన్నారు. వారి తల్లి దండ్రులు అవగాహణ కలిగి ఉండాలని వారికి తెలిపారు. అలాగే విద్యపై వారికి పలు సూచనలు చేశారు. అనంతరం సినీ డైరెక్టర్ ఎన్.శంకర్ పెళ్ళి రోజు సందర్భంగా విద్యార్థినీలకు పుస్తకాలు పంపిణి చేశారు. సేవా దాతృత్వం కలిగి ఉండి చదువుకునేందుకు పేదవారికి అండగా నిలుస్తూ ఆర్థిక సహాయం చేస్తున్న పుస్తకాల దాత చింతకుంట విష్ణును ఆమె అభినందించారు. నేటి సమాజానికి అనుగుణంగా లఘు చిత్రాలు షార్ట్‌ఫిల్మ్ డైరెక్టర్ (ఉరి) లఘుచిత్ర పోస్టర్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం బాల్య వివాహాలపై తీస్తున్న లఘు చిత్రాన్ని అందరూ ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి జడ్జి రాజేందర్,చైల్డ్ వెల్ఫేర్ కమిటి సభ్యురాలు జయభారతి,బాలల సంహరక్షణ సభ్యులు రవి,కంచుపాడు మాజీ సర్పంచు శేషన్‌గౌడు, కస్తూర్బా పాఠశాల స్పెషల్ ఆఫీసర్ బసమ్మ,పివి నర్సింహా,వెంకట్రాములు,బాలికలు తదితరులు పాల్గొన్నారు.



## అలరించిన కథక్, కూచిపూడి నృత్యాలు



ప్రజాపక్షం/ శేరిలింగంపల్లి : మాదాపూర్ శిల్పారామంలో వారాంతపు కార్యక్రమాల లో భాగంగా కథక్,కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. కథక్ నాట్య గురువులు సంజుక్త ఘోష్ శిష్య బృందం మొదటగా బెంగాలీ సంస్కృతి సంప్రదాయ రవీంద్రనాథ్ టాగోర్ పాటలకి రవీంద్ర నృత్య ప్రదర్శన,కథక్ నృత్యంలో గురు వందన,శివ స్తోత్రం,శివ తాండవం,జయంతి దేవి చాముండే అంశాలను ఆరాత్రిక,శ్రియ,యశస్వి, రిథమ్, నిషిక,వందన, శుభశ్రీ,శతాబ్ది,మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.

# మహానగరి

## కాంగ్రెస్ హయాంలో సకల మతస్తులది అగ్రస్థానం



ప్రజాపక్షం/సరూర్ నగర్: తెలంగాణ రాష్ట్ర పునాది అభివృద్ధిలో కాంగ్రెస్ ప్రభుత్వం యొక్క ముందస్తు ప్రణాళికలే అభివృద్ధికి చిహ్నాలుగా మారాయని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సకల మతస్తులది అగ్రస్థానమేనని తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ నేత చిలుక ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మహేశ్వరం నియోజకవర్గం, ఆర్ కెపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ ఫేజ్ 1, లోని బాప్టిస్ట్ చర్చ్ మరమ్మతుల కోసం రూ.25 వేలను ఉపేందర్ రెడ్డి విరాళంగా అందజేశారు.

## కాలనీల అభివృద్ధే ప్రజాప్రతినిధుల లక్ష్యం



ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ : కాలనీలను అభివృద్ధి చేయడమే ప్రజాప్రతినిధుల లక్ష్యమని మల్కాజ్‌గిరి ఎంపి ఈటల రాజేందర్, ఎల్‌బి నగర్ ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. శనివారం బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని హరిహరపురం కాలనీలో రూ.46.50లక్షలతో సీసీ రోడ్డు, శ్రీరాం నగర్ కాలనీలో నూ.26లక్షలతో సీసీ రోడ్డు, శ్రీపురం కాలనీ ఫేస్2లో రూ.54.20 లక్షల వ్యయంతో వాకింగ్ ట్రాక్, చైన్‌లింక్ ఫెన్సింగ్‌తో పాటు పార్కు పనులను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి కాలనీలకు మౌలిక సదుపాయలు కల్పిస్తామని, కాలనీల వాసులకు అవసరమైన రోడ్డు, మంచి నీరు, భూగర్భ డ్రైనేజీ, ట్రంక్ లైన్, విద్యుత్ దీపాలు పలు సమస్యలు తీర్చామని, మరికొన్ని సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ డివిజన్ అధ్యక్షులు కటికరెడ్డి అరవిందర్‌రెడ్డి, బిజెపి నాయకులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కొంతం నవజీవన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రావు, నీలం రాజశేఖర్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

**హయత్ నగర్‌లో....** హయత్ నగర్ డివిజన్‌లోని సూర్య నగర్ కాలనీ, ఇన్ఫర్మేషన్ కాలనీ, సత్యనారాయణ కాలనీ, వెంకటేశ్వర కాలనీ, మహా గాయత్రి నగర్, కుమ్మరి కుంట, సుష్మా సాయి నగర్‌లో దాదాపు 3 కోట్ల పలు అభివృద్ధి కార్యక్రమాలను ఎల్‌బి నగర్ ఎంఎల్‌ఎ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, హయత్ నగర్ డివిజన్ కార్పొరేటర్‌తో కలిసి పనులను ప్రా రంభించారు.

## 18 నుండి 23 వరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరాహార దీక్షలు..

ప్రజాపక్షం/యాచారం : అసరా పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 18 నుండి 23 వరకు తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల ముందు రిలే నిరహార దీక్షలు నిర్వహిస్తున్నామని విహెచ్‌పిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ళ జంగయ్య అన్నారు. శనివారం యాచారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ అసరా పెన్షన్లను పెంపు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నిరెత్తినట్లుగా వ్యహరిస్తుందని అగ్రహం వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో దివ్యాంగులు ఇచ్చిన హమీని అమలు చేయడంలో నిమ్మకు నిరెత్తినట్లుగా వ్యహరిస్తుందని అగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలు కావస్తున్నా నేటికి అమలు చేయక పోవడంలో అంతర్యమేమిటన్నారు. 18 నుండి జిల్లా కలెక్టర్ కార్యాలల్లో నిరహర దీక్షలు చేస్తున్న సందర్భంగా పెన్షన్ దారులకు ఎలాంటి ఇబ్బంది జరిగిన ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాటను నేరవేర్చక పోతే నవంబర్ 26న లక్షలాది మంది పింఛన్ దారులతో చలో హైద్రాబాద్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ అసరా పెన్షన్లు పెంచే వరకు అందోళన ఉధృతం చేస్తామని పెన్షన్ దారులందరు పెద్దేత్తున హజరు కావాలని అన్నారు.

## కొత్త వాహన చట్టాలపై డ్రైవర్లకు అవగాహన



ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్: కొత్త మోటర్ వాహన చట్టాలపై డ్రైవర్లు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని షాద్‌నగర్ ఎసిపి రంగస్వామి సూచించారు. శనివారం షాద్‌నగర్‌లో ట్యాక్సి డ్రైవర్లకు, వాహనాల యాజమానులకు నూతనంగా వచ్చిన బిఎన్ఎస్ కొత్త వాహన చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎసిపి రంగస్వామి మాట్లాడుతూ డ్రైవర్లకు లైసెన్స్‌లు లేకుండా వాహనాలకు ఇన్సురెన్స్ లేకుండా రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మద్యం సేవించి వాహనాలను నడిపిస్తే డ్రైవర్ లైసెన్స్‌లను రద్దు చేయడంతో పాటు యాజమానులకు పదేళ్ళ పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుందని సూచించారు. వాహనాలకు సంబంధించిన ఇన్సూరెన్స్ ప్రాధాన్యత, ఇన్సురెన్స్ వలన కలిగే ప్రయోజనాలు, అదే విధంగా థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్ ప్రయోజనాల గురించి వారికి వివరించారు. వాహనాల్లో అనుమతికి మించి ప్రయాణికులను తీసుకువస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమం లో పట్టణ సిఐ విజయ్‌కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎంవిఐ వాసు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్ఐ తదితరులు పాల్గొన్నారు.

## సమగ్ర సర్వే పూర్తి చేయాలి



ప్రజాపక్షం/నందిగామ: తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ సర్వేను ప్రతిష్టాత్మకంగా తీసుకొని పూర్తి చేసేందుకు కృషి చేయాలని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, టిపిసిసి సభ్యుడు బాబర్‌ఖాన్ సూచించారు. శనివారం షాద్‌నగర్ మున్సిపాలిటి పరిధిలోని ఫరూఖ్‌నగర్ లో నిర్వహిస్తున్న కుల గణన సర్వేలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు బాబర్‌ఖాన్ ఇంట్లో మున్సిపల్ అధికారులు సర్వే నిర్వహించారు. ఈ సందర్భం గా బాబర్‌ఖాన్ మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వం చేపట్టిన స మగ్ర సర్వేలో కాంగ్రెస్ నేతలు పాల్గొని ముందుకు తీసుకువెళ్ళాలని సూ చించారు. ఇప్పటికే షాద్‌నగర్ మున్సిపాలిటిలో సగం వరకు సర్వే పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.

## కష్టపడి చదివినప్పడే రాణింపు

ప్రజాపక్షం/షాబాద్ : విద్యార్థులు కష్టపడి చదివినప్పుడే అన్ని రంగాల్లో రాణిస్తారని మండల విద్య అధికారి లక్ష్మ ణ్ అన్నారు. శనివారం షాబాద్ మండల పరిధిలోని తిమ్మారెడ్డి గూడ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అనంతరం పాఠశాల విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు చేసిన సంస్కృతిక కార్యక్రమాలను చూసిన ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఇవో లక్ష్మ ణ్ మాట్లాడుతూ.. విదార్థులు భావి భారత నిర్మాతలుగా భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలిచేవిధంగా తయారు కావాలని సుచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధన్ రెడ్డి, జ్యోస్న, మాజీ సర్పంచ్ శంకుతల పాండు, జిల్లా పిఆర్‌టీయూ అధ్యక్షులు మహేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కొత్త మహిళా స్వయం సహాయక గ్రూపుల ఏర్పాటుపై దృష్టి

### పురపాలక, పట్టణాభివృద్ధి శాఖముఖ్య కార్యదర్శి ఎం.దాన కిషోర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : కొత్త స్వయం సహాయక సంఘాల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారించాలని పురపాలక పట్టణాభివృద్ధి శాఖ ముఖ్యకార్యదర్శి దాన కిషో ర్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలలో సభ్యత్వం లేని అర్హులైన మహిళలను గుర్తించి, కొత్త ఎస్‌హెచ్‌జి గ్రూపులను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఎంఏయుడి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో శనివారం ఆయన జిహెచ్‌ఎంసి, మె ప్మా అధికారులతో స్వయం సహాయక సంఘాల బ్యాం కు లింకేజీ లక్ష్యసాధన, కొత్త గ్రూపుల ఏర్పాటు, ఎంట ర్ ప్రెన్యూర్ షిప్ కార్యకలాపాల అభివృద్ధి తదితరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్త మహిళా సంఘాల ఏర్పాటు తో పాటు పాత సంఘాలను పటిష్ట పరిచేందుకు ప్రాధాన్యత నివ్వాలని సూచించారు. మహిళలను స్వయం స హాయక సంఘాలలో చేరడానికి ప్రోత్సహించాలని, ఇ ప్పటికీ సభ్యులుగా లేని మహిళలను గుర్తించాలన్నారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధి సాధించడంలో మహిళల భాగస్వామ్యం కీలకమన్నారు. స్వయం సహాయక సం ఘాల ఏర్పాటుతో మహిళా ఆర్థిక స్వాలంబనకు, మహిళల అభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

**నెలకు రూ.200 కోట్ల రుణాలు అందించాలి**

స్వయం సహాయక సంఘాలకు నిర్దేశిత లక్ష్యాల మేరకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణ సదుపాయం కల్పించాలన్నారు. లక్ష్య సాధనకు నెలవారీ కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని, జిహెచ్‌ఎంసి బ్యాంకు లింకేజీ ద్వారా నెలకు కనీసం రూ. 200 కోట్ల రుణాలు అందించాలన్నారు. మెచ్యూరిటీ ఎస్‌హెచ్‌జి గ్రూపులలో బిజినెస్ ఓరియంటేషన్ తీసుకురావాలన్నారు. మహిళలను వ్యాపారాల వైపు దృష్టి సారించేలా ప్రోత్సహించాలని సూచించారు. బ్యాంకర్స్‌తో వర్క్ షాప్ ఏర్పాటు చేయాలన్నారు. ఎంటర్ ప్రెన్యూర్ షిప్ అభివృద్ధికి స్థానిక ఎన్‌జిఓలను, సివిల్ సొసైటీ ఆర్గనైజేషన్‌లను గుర్తించాలన్నారు. డి.సి, పిడిల స్థాయిలో ఎన్‌జిఓల మ్యాపింగ్ జరగాలని తెలిపారు. డిసెంబర్ 7, 8, 9వ తేదీలలో ట్యాంక్ బండ్ వద్ద నిర్వహించే కార్నివాల్ కోసం కార్యక్రమాల నిర్వహణకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిహెచ్‌ఎంసిలోని యుసిడి విభాగాన్ని పటిష్టం చేసేలా చర్యలు చేపట్టాలని దాన కిషోర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సిడిఎంఎ డైరెక్టర్ శ్రీదేవి, ఎంఎయుడి డిప్యూటీ సెక్రెటరీ ప్రియాంక, జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ (యుసిడి) చంద్రకాంత్ రెడ్డి, జాయింట్ కమిషనర్ వెంకటేశ్వరరావు, మెప్మా స్టేట్ మిషన్ కోఆర్డినేటర్స్ పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఇక సిల్ట్ ఛాంబర్లు తప్పనిసరి..!

### వాణిజ్య భవనాలతోపాటు నివాస సముదాయాలకు సైతం
### బహుళ అంతస్తు భవంతుల సీవరేజీపై జలమండలి దృష్టి
### నిర్మాణానికి డిసెంబర్ చివరి వరకూ గడువు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డు వరకు విస్తరిస్తున్న హైదరాబాద్ మహా నగరంలో భారీగా ఉత్పన్నం అవుతున్న మురుగు నీరు, డ్రైనేజీ పైప్‌లైన్‌ల ద్వారా కరగని వ్యర్థాలు లేకుండా సాఫీగా పరుగెత్తించేందుకు జలమండలి శక్తి యుక్తులు ఒడ్డుతోంది. బోర్డు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 90 రోజులు సీవరేజీ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా మ్యాన్‌హోల్ టు మ్యాన్‌హోల్ డీసిల్టింగ్‌లో డ్రైనేజీ పైప్ లైన్‌ల నుంచి బయటపడుతున్న కరగని వ్యర్థాలు మురుగు ప్రవాహానికి అడ్డుపడి అవి ఓవర్‌ఫ్లో అవుతున్నట్లు జలమండలి గుర్తించింది. మురుగు నీటిలో కరగని వ్యర్థాలను ఎక్కడికక్కడే కట్టడి చేసేందుకు చర్యలకు ఉపక్రమిస్తోంది. ప్రధానంగా మురుగునీరు అధికంగా ఉత్పన్నమయ్యే హోటల్స్, రెస్టారెంట్స్, హాస్టల్స్, హాస్పటల్స్, మాల్స్, బేకరీలు తదితర బహుళ అంతస్తుల భవనాలతో పాటు, బహుళ నివాస సముదాయాల సీవరేజీ కనెక్షన్‌లపై దృష్టి సారించింది. బహుళ అంతస్తుల భవన సముదాయంలో ఉత్పన్నయ్యే మురుగు నీరంతా ముందుగా సిల్ట్ ఛాంబర్‌లో చేరుతుంది. అందులో ఏవైనా ఘనపదార్థాలుంటే, అక్కడ వడబోతతో అవి అక్కడే నిలిచి కేవలం మురుగు నీరు మాత్రమే డ్రై నేజీ పైప్‌లైన్‌లో కలుస్తుంది. డ్రైనేజీలో మురుగు ప్రవాహానికి ఎలాంటి ఆటంకం ఉండదని బోర్డు భావిస్తోంది. ఇందుకోసం మురుగు అధికంగా ఉత్పన్నమయ్యే బహుళ అంతస్తులు, వాణిజ్య భవనాల సీవరేజ్ కనెక్షన్లకు సిల్ట్ ఛాంబర్లు తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకుంది. బహుళ అంతస్తు భవనాల వినియోగదారులు మురుగు కనెక్షన్‌లకు సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోకుంటే కఠినంగా వ్యవహరించాలని జలమండలి యోచిస్తోంది. ప్రధానంగా వాణిజ్య, బహుళ అంతస్తుల భవన సముదాయాల సీవరేజీ పైప్‌లైన్‌లోనే అధికంగా మురుగులో కరగని వ్యర్థాలైన ఆహార పదార్థాలు, ప్లాస్టిక్ బాటిళ్లు, కొబ్బరి బొండాలు, బట్టలు, నాప్కిన్స్, డైపర్స్, ఇతర ప్లాస్టిక్ ఉత్పత్తులు మ్యాన్ హోళ్లలో ఉండటం జలమండలి గుర్తించింది. అలాంటివి రాకుండా వాటిని సిల్ట్ ఛాంబర్‌లకే పరిమితం చేసి, మురుగు నీరు మాత్రమే పైప్‌లైన్‌లో కలిసే విధంగా చర్యలు తీసుకోవాలని భావిస్తోంది. అందులో భాగంగానే సిల్ట్ ఛాంబర్లు లేని కొన్ని భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేసి, తక్షణమే వాటిని నిర్మించుకోవాలని వినియోగదారులకు సూచించనుంది. ఇప్పటికే కొన్నివాణిజ్య భవనాల్ని గుర్తించి నోటీసులు జారీ చేయగా, మిగితా భవనాలకు సైతం నోటీసులు జారీ చేసే పనిలో నిమగ్నమైంది. ఈ ఏడాది డిసెంబర్ చివరి నాటి వరకు సీవరేజీ కనెక్షన్‌లకు సిల్ట్ చాంబర్లు నిర్మించుకునే విధంగా గడువు విధించాలని భావిస్తోంది. అప్పటి వరకు సిల్ట్ ఛాంబర్లు నిర్మించుకోకుంటే, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భావిస్తోంది.

## ఎల్‌బినగర్ నియోజకవర్గంలో అక్రమ నిర్మాణాలకు ప్రజాప్రతినిధులు, అధికారులే కారణం

### సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్రాచారి



ప్రజాపక్షం/సరూర్ నగర్: ఎల్‌బినగర్ నియోజకవర్గంలో ప్రజాప్రతినిధులు, జిహెచ్‌ఎంసి అధికారుల, అండదండలతో యథేచ్ఛగా అక్రమ వ్యాపార సముదాయాల నిర్మాణా లు చేస్తున్నారని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,అందోజు రవింద్రాచారి ఆరోపించారు. శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో నియోజకవర్గంలో పలు డివిజన్‌లలో అక్రమ నిర్మాణ వ్యాపార సముదాయాలపై జిహెచ్‌ఎంసి ఎల్బీనగర్ సర్కిల్ జోనల్ కమిషనర్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రవీంద్రచారి మాట్లాడుతూ ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో అక్రమ వ్యాపార సముదాయాలు, పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న వాటిపై టౌన్ ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణాలు ఏంటో అర్థం కావడం లేదన్నారు. సామాన్యుడు 100 గజాలలో ఇళ్ల నిర్మాణాలు చేసుకుంటే వారిపై జిహెచ్‌ఎంసి టౌన్ ప్లానింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు చోటామోటా లీడర్లు ఇబ్బందులకు గురుజేస్తున్నారని అన్నారు. నియోజకవర్గం లో కోకోల్లలుగా ఉన్నటువంటి పరిస్థితులు వాస్తవం, శివారు ప్రాంతాలైన, మన్సూరాబాద్, హయత్ నగర్, బిఎన్ రెడ్డి, నాగోల్, వనస్థలిపురం డివిజన్‌లే కాకుండా అనేక డివిజన్‌లలో అక్రమ వ్యాపార సముదాయాల నిర్మాణాలవుతున్నాయని తెలిపారు. జిహెచ్‌ఎంసికి రావలసినటువ టి పర్మిషన్ల ద్వారా వచ్చే ఆదాయం కూడా లక్షల్లో గండి పడుతున్న వైనం మరి దీన్ని ఏ ఉద్దేశంతో అటు జిహెచ్‌ఎం సి అధికారులు చూసి చూడనట్టుగా వ్యవరిస్తున్నారో, అర్థం కావడం లేదన్నారు. అక్రమ వ్యాపార సముదాలపై వెంట నే చర్యలు తీసుకుని ప్రజల ఇబ్బందులను పరిష్కరించాలని, ప్రభుత్వాధికారులను కోరుతున్నాం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎల్బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి సామిడి, శేఖర్ రెడ్డి, సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నర్సింహ్మా, హయత్ నగర్ మండల కార్యదర్శి శేషరాజు, పల్లి శ్రీదేవి, సహయ కార్యదర్శులు బోయపల్లి, రాములు గౌడ్, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఫుడ్ ఇన్‌స్పెక్టర్లూ.. మీరెక్కడ?

### 62 శాతం హోటళ్లలో గడువు తీరిన ఆహార పదార్థాలు
### గత కొంతకాలంగా హైదరాబాద్ రెస్టారెంట్లలో ఫుడ్ పాయిజనింగ్ ఘటనలు



ప్రజాపక్షం/హైదరాబాద్: ఆహారం విషయంలో హైదరాబాద్ కు ఎంతటి ఘనచరిత్ర ఉందో అందరికీ తెలుసు. హైదరాబాద్ బిర్యానీ, హలీం, మొఘలాయి వంటకాలు... ఇలా హైదరాబాద్ ఖ్యాతి అంతర్జాతీయస్థాయికి చేరింది. అయితే, గత కొంతకాలంగా భాగ్యనగరం పేరు, ప్రఖ్యాతులు మసకబారుతున్నాయి. కొన్ని హోటళ్లలో ఫుడ్ పాయిజనింగ్ జరగడం, అధికారుల తనిఖీల్లో కుళ్లిన చికెన్, పాడైపోయిన ఆహార పదార్థాలు బయటపడడం వంటి ఘటనలే అందుకు కారణం. కొన్ని చోట్ల బిర్యానీల్లో బొద్దింకలు, ఇతర జీవులు కూడా దర్శనమిచ్చాయి. గత రెండు నెలల కాలంలో నగరంలో 84 శాతం ఫుడ్ పాయిజనింగ్ కేసులు నమోదయ్యాయంటే పలు హోటళ్లు, రెస్టారెంట్లలో నాణ్యతా ప్రమాణాలు ఎలా ఉన్నాయో అర్థమవుతోంది. దాంతో కొన్ని రెస్టారెంట్లలో భోజనం అంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వీటన్నింటికీ పరాకాష్ఠగా... నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో జాతీయస్థాయిలో చేపట్టిన ఓ సర్వేలో హైదరాబాద్ చివరిస్థానంలో నిలిచింది. కల్తీ ఆహారానికి సంబంధించి భారత్ లోని 19 మేజర్ సిటీల్లో క్రైమ్ రికార్డ్స్ బ్యూరో సర్వే చేపట్టింది. ఆహార నాణ్యత ప్రమాణాలను ప్రాతిపదికగా తీసుకుని చేపట్టిన ఈ సర్వేలో హైదరాబాద్ కు అట్టడుగు స్థానం దక్కింది. దారుణమైన విషయం ఏమిటంటే... హైదరాబాద్‌లోని 62 శాతం హోటళ్లలో గడువు తీరిన ఆహార పదార్థాలు వినియోగిస్తున్నారట.నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో సర్వేతో జిహెచ్‌ఎంసి ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు అలర్ట్ అయ్యారు. హైదరాబాద్‌లో ఫాస్ట్‌ఫుడ్‌సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లలో దాడులకు సిద్ధమవుతున్నారు.

## సమన్వయంతో పనిచేసి జిల్లా అభివృద్ధికి కృషి చేద్దాం

### కొండా విశ్వేశ్వర్ రెడ్డి



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: అధికారులు,ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పనిచేసి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి కృషి చేద్దామని దిశ కమిటీ చైర్మన్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో చేవెళ్ల ని యోజకవర్గ పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన వివిధ శాఖల జిల్లా అధికారులతో జిల్లా అభివృద్ధి, సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రం గారెడ్డి జిల్లాకు అన్ని సదుపాయాలు, సౌకర్యాలు, వనరులు ఉన్నందున జిల్లాను అన్ని రంగాలలో ప్రథమ స్థానంలో ఉంచాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ప్రజా ప్రతినిధులతో మున్సిపాలిటీలలో, గ్రామపంచాయతీలలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లు లేని పాఠశాలలను గుర్తించి వెంటనే మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని సూచించారు. ఏర్పాటు చేసిన మరుగుదొడ్లను విద్యార్థులు వినియోగించేలా చూడాలని తెలిపారు. జిల్లాలోని బస్తీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో, జిల్లా ఆరోగ్య కేంద్రాలలో ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలని జిల్లా వైద్యాధికారిని ఆదేశించారు.జిల్లాలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు డయాలసిస్ పరికరాలను ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉంచి మెరుగైన వైద్యం అందించాలని తెలిపారు. సమావేశంలో భాగంగా పంచాయితీ రాజ్, ఆర్ అండ్ బి, ఉపాధి హామీ, విద్యుత్, మిషన్ భగీరథ, జాతీ య రహదారులు, భూగర్భ జలాలు,సిపి ఒ ,గిరిజన సంక్షేమ శాఖ, వివిధ శాఖలకు సంబంధించి తదితర అంశాలపై సమీక్షించారు. కేంద్ర ప్రభుత్వం అందించే నిధులను సద్వినియోగం చేసుకునేలా చూడాలని చైర్మన్ సూచించారు.ఈ సమావేశంలో షాద్ నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్,జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, అడిషనల్ కలెక్టర్(లోకల్ బాడీస్) ప్రతిమ సింగ్ ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్,హెచ్.ఎమ్.డబ్ల్యూ డిసి, ఈ.డి.మయంక,జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీలత, జిల్లా అధికారులు తదితలురు పాల్గొన్నారు.

## ప్రజా పాలన విజయోత్సవాలకు సకల ఏర్పాటు



ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి: ప్రజా పాలన విజయోత్సవాల సందర్భంగా జిల్లాలో ప్రజాపాలన కళా యాత్రను విజయవం తం చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి తెలిపారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులచే నవంబర్ 19 నుండి డిసెంబర్ 07 వరకు ప్రజాపాలన కళా యాత్ర చేపట్టాలని ప్రభుత్వం సంకల్పించడం జరిగిందని,దీనికి సంబంధించి సన్నాహక ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు.తెలంగాణ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల పైన కళాయాత్ర బృందం ప్రోఫసర్ అలేఖ్య పుంజల, అంతడుపుల నాగరాజు రాష్ట్రమంతా పర్యటిస్తారని,వీరు రంగారెడ్డి జిల్లా షాద్ నగర్‌లోని సాయిరాజ్ గార్డెన్‌లో నవంబర్ 17న ఆదివారం ప్రజా విజయోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహిస్తారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా యంత్రాంగం,జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ విజయోత్సవాల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా షాద్ నగర్ శాసన సభ్యులు వీర్లపల్లి శంకర్,నృత్య అకాడమీ చైర్మన్‌లు పాల్గొంటారని తెలిపారు. రంగారెడ్డి జిల్లా యంత్రాంగం,జిల్లా పౌర సంబంధాల శాఖ ఆధ్వర్యంలో పని చేస్తున్న సాంసృతిక సారథి కళాకారులచే జిల్లాలోని వివిధ మండలాలు, గ్రామ పంచాయితీలలో రెండు టీములుగా ఈ నెల 19వ తేదీ నుండి డిసెంబర్ 07 వరకు గ్రామాల్లో తిరుగుతూ ఆరు గ్యారంటీలపై అవగాహన కల్పిస్తూ ప్రజాపాలన ప్రజా విజయోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని వివరించారు.ఈ నెల 19వ తేదీ నుండి ప్రారంభమయ్యే విజయోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశించారు.

## గోల్డెన్ ఒరియల్ అపార్ట్ మెంట్‌లో.. అగ్ని ప్రమాదం



ప్రజాపక్షం/నార్సింగి: మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పుప్పాలగూడ బిఆర్‌సి ఎదురుగా ఉన్న గోల్డెన్ ఓరియోల్‌లో భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గోల్డెన్ ఒరియల్ అపార్ట్ మెంటులో ఉన్న ఓ ప్లాట్‌లో షార్ట్ సర్క్యూట్‌తో ఒక్కసారిగా మంటలు చెలరేగి గ్యాస్ సిలిండర్ పేలి భారీ ఎత్తున మంటలు వ్యాపించి ప్రమాద తీవ్రత మరింత పెరిగింది. అపార్ట్మెంట్ ప్లాట్‌లో ఉంటున్న ఐదుగురు పరిగెత్తుకుంటూ బయటకు వచ్చి తన ప్రాణాలను దక్కించుకున్నారు. అపార్ట్మెంట్ వాసులు, స్థానికులు పోలీసులకు ఫైర్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించగా పోలీసులు,అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజన్‌తో రంగంలోకి దిగి 3 ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను గంట పాటు శ్రమించి మంటలను అదుపు చేయడంతో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అపార్ట్మెంట్ వాసులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఫ్లాట్ లో ఉన్న సామాగ్రి పూర్తిగా దగ్ధమైందని సుమారు.50 లక్షల విలువ చేసే సామాగ్రి బూడిద అయిందని స్థానికులు తెలియజేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## గ్యారంటీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలం

### రంగారెడ్డి జిల్లా సిపిఐ కార్యదర్శి పాలమాకుల జంగయ్య



ప్రజాపక్షం/శేరిలింగంపల్లి : మాదాపూర్‌లోని సిపిఐ కార్యాలయంలో చందు యాదవ్ అధ్యక్షతన భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ శేర్లింగంపల్లి మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా రంగారెడ్డి జిల్లా సిపిఐ కార్యదర్శి పాలమాకుల జంగయ్య విచ్చేసి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చినటువంటి ఆరు గ్యారెంటీలను అమలు చే యడంలో విఫలమయ్యారని అన్నారు. శేరిలింగంపల్లి లో ఇల్లు లేని నిరుపేదలు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కి 1200 మంది కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో అప్లికేష న్లు చేసుకున్నారు. కానీ వారికి ఇప్పటివరకు ప్రభుత్వం తరఫున ఇండ్లు అందించలేదని వారికి ఇండ్లు వచ్చేవరకు పోరాడుతామన్నారు. నియోజకవర్గం లో ఉన్నటువంటి ప్రతి ఒక్కరికి సొంతింటి కలలను నెరవేర్చే వరకు భారత కమ్యూనిస్టు పార్టీ ఎప్పటికప్పుడు పోరాటాలూ చేస్తూ ఉంటామన్నారు. రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ శేర్లింగంపల్లి నియోజకవర్గంలో వచ్చే స్థానిక కార్పొరేటర్ ఎలక్షన్ లో. పది కార్పొరేటర్ స్థానాల్లో పోటీ చేస్తామని అందుకు సిపిఐ నాయకులు సిద్ధంగా ఉండాలని తెలిపారు. శేరిలింగంపల్లి సిపిఐ కార్యదర్శి రామకృష్ణ, దళిత కుల పోరాట సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటస్వామి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## వారికే ప్రభుత్వ ఉద్యోగాల్లో కీలక బాధ్యతలు : వీర్లపల్లి



ప్రజాపక్షం/షాద్‌నగర్: సర్కారు విద్యను అభ్యసించిన వారే నేడు వివిధ ప్రభుత్వ శాఖల్లో కీలక బాధ్యతలు వహిస్తున్నారని, క్రమ శిక్షణకు మారుపేరు సర్కారు బడులే అన్న విషయాన్ని గ్రహించాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన భవన నిర్మాణానికి కొత్తూరు, నందిగామ మాజీ ఎంపిపి మంచనపల్లి ప్రియాంక శివశంకర్ గౌడ్ రూ.5లక్షల చెక్కును విరాళంగా ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, అందుకు ఉమ్మడి మండలాల మాజీ ఎంపిపిలు ముందుకు వచ్చి విరాళం ఇవ్వడం సంతోసంగా ఉందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే విధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఎమ్మెల్యే స్వయంగా సొంత ఖర్చులతో నిర్మించేదుకు శక్తి ఉన్నప్పటికి ప్రజలందరిని భాగస్వాములు చేయాలనే లక్ష్యంతోనే ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్ వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు జాంగారి నరసింహా యాదవ్, జమృద్‌ఖాన్ తదితరులు ఉన్నారు.

# మహానగరి

## సమగ్ర సర్వేలో తప్పులు ఉండొద్దు



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో తప్పులు లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అన్నారు. శని వారం శామీర్‌పేటలో సమగ్ర కుటుంబ సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇంటింటికి తిరిగి సేకరిస్తున్న వివరాలు తప్పులు లేకుండా సరైన వివ రాలను ప్రొఫార్మాలో పొందుపరుచాలని చెప్పారు. తహాశీల్దార్ యాదగిరిరెడ్డి, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

## ఉద్దెమర్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** మూడుచింతలపల్లి మండలం ఉద్దెమర్రి శ్రీ విష్ణు శివాలయంలో శ్రీ ముక్తేశ్వర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి శిబిరానికి విశేష స్పందన లభించింది. ట్రస్ట్ ఫౌండర్ ముత్తు గీతాంజలి మాట్లాడుతూ ప్రజలకు ఉచితంగా సేలందించేందుకు ట్రస్ట్ ఎల్లవేళల కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఉమా మహేశ్వరి, సభ్యులు రవీందర్‌గౌడ్, రాజిరెడ్డి, రమేష్, మాజి ఎంపిటిసి దోసకాయల వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు 19న కౌన్సెలింగ్



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** మేడ్చల్ జిల్లాలో స్టాఫ్ నర్సు ఉద్యోగాలకు గాను ఎంపికైన అభ్యర్థులు19న ధృవీకరణ పత్రాల పరిశీలనతో పాటు కౌన్సిలింగ్ ఉంటుందని జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డా.రఘునాథ స్వామి తెలిపారు. దీని కోసం అభ్యర్థులు తమ ఒర్జినల్ ధృవీకరణ పత్రాలు. స్థానికతకు సంబంధించిన ధృవపత్రాలను తీసుకొని రావాలన్నారు.

## వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరమ్ నూతన కమిటీ



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** తెలంగాణా నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ మేడ్చల్ జిల్లా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ ఫోరమ్ ఎన్నికలు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో శనివారం జరిగాయి. నూతన కమిటీ అధ్యక్షుడిగా ఘట్‌కేసర్ హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఎం.మాణిక్యం, కార్యదర్శిగా కుత్బుల్లాపూర్ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ కె.కమలదాస్, కోశాధికారిగా నాగారం హాస్టల్ వెల్ఫేర్ అధికారి ఈ తిరుపతయ్య, ఉపాధ్యక్షుడిగా బహదూర్‌పల్లి హాస్టల్ వెల్ఫేర్ అధి కారి వి.నరసింహ, జాయింట్ సెక్రటరీగా ఈసిఐఎల్ హాస్టల్ వెల్ఫేర్ అధికారి యు.జ్యోతి, ఆర్గనైజింగ్ సెక్రటరీ కూకట్‌పల్లి హాస్టల్ వెల్ఫేర్ అధికారి కె.రాఘవేంద్ర, ప్రచార కార్యదర్శిగా ఘట్‌కేసర్ హాస్టల్ వెల్ఫేర్ అధికారి జి.శ్రవణ్, ఇసి సభ్యుడిగా కేశవరం హాస్టల్ వెల్ఫేర్ అధికారి పి.శ్రీనివాస్, ఈసి సభ్యురాలిగా మేడ్చల్ హాస్టల్ వెల్ఫేర్ అధికారి కె.వెంకటలక్ష్మి లు ఎన్నికయ్యారు.

## విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వద్దు

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** విచ్చలవిడిగా భవన నిర్మాణాలకు అధికారులు అనుమతిస్తుం డటంతో వర్షపు నీరు రహదార్లపైకి చేరి ప్రమాదకరంగా తయార వుతున్నాయని, ఇలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు సరైన చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి సూచించారు. నేరేడ్‌మెట్ డివిజన్‌లోని స్వర్ణాంధ్ర ఫేస్2, రామా ఫ్రండ్స్ అసోసియేషన్, గోల్ఫ్ ప్రైడ్ హోమ్స్, నందనవనం కాలనీ, విల్లా గార్డెన్స్ కాలనీ సభ్యులతో జిహెచ్‌ఎంసి ఎస్‌ఈ రత్నాకర్‌తో కల్సి సమావేశమయ్యారు. ఈ విషయమై తాను త్వరలో జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్‌తో కలిసి పర్యటించి శాశ్వత పరిష్కార దిశగా కృషి చేస్తానన్నారు.

## సర్దార్ పటేల్ నగర్‌లో కార్పొరేటర్ పర్యటన



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** డివిజన్ ప్రాంతాల్లో ఎలాంటి సమస్య లున్నా తన దృష్టికి తీసుకొని రావాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. శనివారం సర్దార్ పటేల్ నగర్‌లో జిహెచ్ ఎంసి డిఈ మహేష్, ఏఈ నవీన్, రమేష్, శ్రీనివాసగౌడ్, రాములు, సుబ్బారావు, శ్రీకాంత్, శ్రీనివాసరెడ్డి, తదితరులతో కలి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఈ ప్రాంతంలో నూతనంగా నిర్మించిన కమ్యూనిటీ హాలును పరిశీలించిన వెంటనే దాన్ని బస్తీ అసోసియేషన్‌కు అప్పగించాలన్నారు.అదే విధంగా కంట్రాక్టర్‌కు ఇవ్వాల్సిన బిల్లును జాప్యం లేకుండా చెల్లించాలని అధికారులను కోరారు.

## జలమండలి జిఎంను కలిసిన నాచారం కార్పొరేటర్



**ప్రజాపక్షం/ఉప్పల్:** నాచారం డివిజన్‌లోని పలు భూగర్భ డ్రైనే జీ, మంచినీటి సమస్యలపై నాచా రం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ శనివారం జల మండలి జిఎం సంతోష్‌తో సమీ క్షించారు.ప్రధానంగా కొన్ని సిమె ంటు రోడ్డు నిర్మాణ పనులు భూగర్భ డ్రైనేజీ సరిగ్గా లేకపోవడం వల్ల ఆగి పోయాయని తక్షణమే అలాంటి వాటికి నిధులు మంజూరు చేయాలని కా ర్పొరేటర్ కోరారు. ఈ రెండు వీధుల్లోని భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయాలని, జలమండలి జనరల్ మేనేజర్ సంతోష్ ని కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ కోరారు.

## మేడ్చల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్‌గా బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి నియామకం



**ప్రజాపక్షం/దుండిగల్ :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా బొంగునూరి శ్రీని వాస్‌రెడ్డి నియమితులయ్యారు. కాంగ్రెస్ పార్టీ విధే యు డుగా పేరు తెచ్చుకున్న ఆయన పార్టీ బలోపేతానికి ఎనలేని సేవలు చేశారు. కష్టపడిపని చేసే వారికి తగిన గుర్తింపు వస్తుందని ఆయన పేర్కొన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ప్రజాపక్షం/చర్లపల్లి :** విద్యుత్ మరమ్మతులు,చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఏఇ బాబురావు తెలిపారు.చర్లపల్లి సబ్ స్టేషన్ 11 కెవి గెయిల్ ఫీడర్‌ను 8 గంటల నుండి 12 గంటల వరకు నిలిపివేయడంతో గెయిల్ మెయిన్ రోడ్, చంగి చెర్ల మెయిన్ రోడ్,గాంధీ నగర్ కొద్ది ప్రాంతంలో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని, వినియోగదారులు సహకరించాలని బాబురావు తెలిపారు.

చర్లపల్లి పారిశ్రామికవాడ ఫేస్2లో.... విద్యుత్ మరమ్మతులు,చెట్ల కొమ్మల తొలగింపు కార ణంగా ఆదివారం విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని ఎఇ బాల్‌రాజ్ తెలిపారు. చర్ల పల్లి సబ్ స్టేషన్ 11 కెవి ఎంఐసి ఎలక్ట్రానిక్ ఫీడర్‌ను 8 గంటల నుండి 12 గంటల వరకు నిలిపివేయడంతో మణికంఠ, కెజిఆర్, స్వాగత్, నాగార్జున పాలిమర్స్, ఎస్‌వికె ఫార్మా ఇండస్ట్రీ, 11 కెవి సురానా ఫీడర్‌ను 1 గంటల నుండి 4.30 గంటల వరకు నిలిపి వేయడంతో సురానా, కెజిఆర్2, ఏపిఎల్,క్వాలిటీ ఫోర్జ్,ఎంఐసి ఎలక్ట్రానిక్, టివిఎస్, ఎస్‌డిఎల్ ఇండస్ట్రీస్‌లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

## పేద దళితులభూమిని కబ్జాచేస్తే దాడులు తప్పవ్

బోడుప్పల్ కాలనీల ఫడరేషన్ చైర్మన్ రాపోలు రాములు హెచ్చరిక



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచర్లలో పేద దళితులకు చెందిన భూమిని కొంతమంది భూస్వాములు కబ్జాలు చేసుకుని బెదిరింపులకు పా ల్పడుతున్నారని, అలాంటి వారి ఆటలు ఇక సాగవని బోడుప్పల్ కార్పొరేషన్ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య చైర్మన్ రాపోలు రాములు హెచ్చరించారు. ఈ మేరకు పేద దళితుల వినతి మేరకు శనివారం ఫడరేషన్ నేతలు చెంగిచర్ల కబేలా సనిసేవంలోని దళితుల భూమిని పరిశీలించారు. ఈ సందర్భంగా రాపోలు రాములు మాట్లాడుతూ, కొంతమంది రా జకీయ నాయకుల అండతో దళితులను బెదిరింపులకు గురి చేసి భూకబ్జాలకు పాల్పడు తున్నారని, వీరి ఆక్రణలు ఇకపై చెల్లవని హెచ్చరించారు. దక్షిత కౌలు చట్టప్రకారం సర్వే నంబర్ 34 పార్ట్ లో వారసత్వంగా సంక్రమించిన దళితులైన బంటు కుటుంబానికి చెందిన భూములను కొంతమంది పలుకుబడి కలిగిన నాయకుల అండతో కబ్జాలకు పాల్పడుతూ విక్రయాలు చేస్తున్నారన్నారు. కోర్టు పరిధిలో ఉన్న సదురు స్థలంలో ఎలాంటి నిర్మాణాలను చేపట్టకుండా నిరోధించాల్సిన మున్సిపల్, రెవిన్యూ అధికారులు డబ్బులకు కక్కుర్తి పడి కబ్జాదారులకు సహకరిస్తున్నారన్నారు. రక్షిత కౌలు చట్టప్రకారం బంటు కుటుంబ వార సులకు అన్ని విధాలుగా హక్కులు ఉన్నా దళితులన్న కారణంగా కొంతమంది స్థానిక రాజ కీయ పార్టీలకు చెందిన నేతలు వారినిబెదిరింపులకు గురి చేసి నిర్మాణాలను ప్రోత్సహ స్తున్నారని రాపోలు రాములు ఆరోపించారు. రెవిన్యూ రికార్డుల ప్రకారం అన్ని విధాల హక్కులు కలిగి ఉన్న పేద దళితులకు న్యాయం జరిగే వరకు బోడుప్పల్ కాలనీ సంక్షేమ సంఘాల సమాఖ్య సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. అవసరమైతే సియంను, మంత్రిని, డిజిపి, కలెక్టర్లను కలిపి చట్టపరంగా దళితులకు రావాల్సిన భూమి వారికే దక్కే విధంగా పోరాటం చేస్తామన్నారు. అనంతరం బంటు కుటుంబ వారసులు మాట్లాడుతూ, చట్ట ప్రకారం తమకు దక్కాల్సిన భూమిని స్థానికంగా ఉన్న కొంతమంది రాజకీయ నాయకుల సహకారంతో కబ్జాలు చేస్తున్నారని తమ భూమిని దక్కించుకునేందుకు ఇరవై సంవత్సరాలుగా న్యాయస్థానంలో పోరాటం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బంటు కుటుంబ వారసులు, సమాఖ్య వైస్ చైర్మన్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షులు అబ్రహం లింకన్, ప్రతినిధులు నర్సయ్య, రాంబాబు గౌడ్ పాల్గొన్నారు.

## 27న భగత్ సింగ్ మేనల్లుడు పర్యటన

సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసుఫ్



**కుత్బుల్లాపూర్/ప్రజా పక్షం :** ఈ నెల 27న కుత్బుల్లా పూర్ మండల పరిధి జగద్గిరి గుట్ట , గాజులరామారం లో భగత్ సింగ్ మేనల్లుడు పర్యటనను విజయవంతం చేయాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు యూసుఫ్ అన్నారు. శనివారం అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో జగద్గిరి గుట్ట లో జరిగిన పోస్టర్ ఆవిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. భగత్‌సింగ్ పుట్టిన కుటుంబంలో పుట్టి ఆయన వారసత్వాన్ని లక్ష్యాలను ప్రజలకు తెలియజేస్తున్న వారి మేనల్లుడు ప్రొఫెసర్ జగన్మోహన్ సింగ్ మన ప్రాంతానికి వస్తున్నారని అందరూ పాల్గొని జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి అఖిల భారత యువజన సమాఖ్య కార్యదర్శి వెంకటేష్ అధ్యక్షత వహించగా యువజన నాయకులు బాబు, రాంరెడ్డి, సిపిఐ కార్యదర్శి ఉమామహేష్, సహాయ కార్యదర్శి దుర్గయ్య, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/నాగారం :** మున్సిపాలిటీలో అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శనివారం నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు పరిధిలోని సుచిత్ర కాలనీలో 15 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో సిసి రోడ్డు పనులకు చైర్మన్ స్థానిక కౌన్సిలర్ గోక కళావతితో శంకుస్థాపన చేశారు. నాయకులు,కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

**టౌన్ ప్లానింగ్ సిబ్బందితో కమిషనర్ సమావేశం :** నాగారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి ఎల్ఆర్ఎస్ 2020పై టౌన్ ప్లానింగ్ సిబ్బందితో సమావేశం నిర్వ హిం చారు. ఎల్ఆర్ఎస్ 2020 ప్రక్రియ గూర్చి మాట్లాడుతూ ధరఖాస్తులను ప్రక్రియను కమీషనర్ పరిశీలించి వేగవంతం చేసి డిశంబర్ నెల వరకు పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఇందులో మేనేజర్ చంద్రశేఖర్,టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ కోసం కష్టపడ్డవారిని కలుపుకోవడం లేదు




**ప్రజాపక్షం/నవాబుపేట్ :** 2014లో కాంగ్రెస్ పార్టీ నుండి ఎమ్మెల్యేగా కాలే యాదయ్య గెలిపిస్తే బిఆర్‌ఎస్ పార్టీ అధికారంలోకి రాగానే బిఆర్‌ఎస్ పార్టీలోకి వెళ్లారు.పది సంవత్సరాలు బిఆర్‌ఎస్‌లో ఉన్నారు.ఇప్పుడు 2024 లో బిఆర్‌ఎస్ పార్టీ నుండి గెలిచి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తిరిగి కాంగ్రెస్ లోకి వచ్చారు. ఎమ్మెల్యే యాదయ్య బిఆర్ ఎస్ ప్రజల హామీలు రాజకీయాలకు అతీతంగా సామాన్య ప్ర జలకు సేవలు అందించాలి. కానీ అలాచేయ కుండా ఎమ్మెల్యేతో పాటు 2014 నుంచి ఇప్పటివరకు వారితో తనతో నడిచిన అనుచరులకు, కార్యకర్తలకు దళిత బంధు, బీసీ బంధు మైనారిటీ బంధు, అని చె ప్పుకుంటూ పోతే ప్రభు త్వం నుంచి వచ్చే ఏవై నా పథకాలు, పదవులు ఆయ న అనుకునే వాళ్ళకి కట్టబెట్టడంజరుగుతుంది. కానీ ఒక్క సామాన్య ప్రజానీకానికి ఇవ్వలేరు. ఇప్పుడు కాంగ్రెస్ లోకి వచ్చిన వెంటనే మండల మా ర్కెట్ కమిటీనివారి అనుచరులు బిఆర్‌ఎస్ గుంపుకు కట్టబెట్టారు. కాంగ్రెస్‌జెండా మోసిన కార్యకర్తలకు ఇందిరమ్మ కమిటీలో మండల నామినేట్ పోస్టుల్లో కూడా మొదటినుండి కాంగ్రెస్ కోసం కష్టపడ్డ వారిని కలుపుకోవ ట్లేదని వినికిడి. ఇక నుండైనా పార్టీ కోసం కష్టపడ్డా కార్యకర్తలు అందరం కలిసి మనగోడు అధిష్టానం పెద్దలకు విని పిద్దామని కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు శివప్రసాద్ అన్నారు.

## నర్సింగ్ కాలేజీకు తాత్కాలిక ఏర్పాట్లు



**ప్రజాపక్షం/ కొడంగల్ :** కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో నర్సింగ్ కాలేజ్ ఏర్పాటుకు మున్సిపల్ కమిషనర్ బలరాం నా యక్ తాత్కలిక ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. వారు మాట్లాడుతు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గ కొడంగల్ మెడికల్ హబ్‌గా మారనుంది. ఈ క్రమంలోనే మెడికల్ కాలేజ్, నర్సింగ్ కాలేజ్, పారామెడికల్ వంటి కాలేజ్‌లు అందుబాటులోకి రానున్నయి. నర్సింగ్ కాలేజ్ నిమిత్తం ఇప్పటికే మొదటి విడత, రెండవ విడతల వారిని అడ్మిషన్‌లు ప్రారంభమయ్యాయని అందుకు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తాత్కలిక ఏర్పాట్లను చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మున్సిపల్‌సీనియర్‌అసిస్టెంట్ ఆంజనేయులు సిబ్బంది తదితరులున్నారు.

## కలెక్టర్‌పై దాడి హేయమైన చర్య



**ప్రజాపక్షం/కోట్‌పల్లి:** వికారాబాద్ జిల్లా లగచర్లలోఫార్మాకంపనీ భూ సేకరణ కోసం వెల్లిన వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అడిషనల్ కలె క్టర్ లింగ్యానాయక్, కడా ప్రత్యేకా ధికారి వెంకట్‌రెడ్డి, కొడంగల్ తహాసీల్దారు విజయ్ వెల్లిన అధికారులపై లగచర్ల గ్రామాస్తులు కలెక్టర్ డౌన్‌డౌన్ అంటు నిరసన వ్యక్తం చేస్తు... అధికారులను రాళ్లు, కర్రలతొ దాడి చేశారు. ఈ దాడిని నిరసిస్తూ కోట్‌పల్లి రెవెన్యూ అధికారులు కార్యాలయాన్ని బంద్ చేసిన విధులను బహిష్కరించారు. అధికా రులపై చేసిన దాడిపై ప్రభుత్వం స్పందించి బాధులపై చర్యలు తీసుకోవాలని, అప్పటి దాక నిధులకు రామని డిమాండ్ చేశారు.

## ప్రకడ్బందీగా గూప్-3 పరీక్షలు

జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి** వికారాబాద్ జిల్లా లో గ్రూప్ 3 పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ సం బంధిత అధికారులను అదేశించారు.జిల్లా అధికారులతో కలిసి పరీక్ష ఏర్పాట్లపై సమిక్ష సమావేశం నిర్వహించారు. అదివారం నిర్వహించే పరీక్షలు జిల్లాలో 31 కేంద్రాలో ఏర్పాటు చేశామన్నారు. వికారాబాద్‌లో14,తాండూర్‌లో11,పూడుర్‌లో ఒక సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ వికలంగులకు కొరకు 2 కేంద్రలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని పరీక్ష కేంద్రల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తు జిరాక్స్ సెంటర్లను మూసి వేయ్యలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్‌పి రవీందర్‌రెడ్డి ,మాట్లాడుతూ పరీక్ష కేంద్రల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు.ఈ సమావేశంలో ఆర్‌డిఓవాసుచంద్ర, నరేందరరెడ్డి పాల్గొన్నారు.

## దివ్యాంగులకు జిల్లా స్థాయి ఆటల పోటీలు

శిశు,దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారిని కృష్ణవేణి

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని బ్లాక్ గ్రౌండ్‌లో జిల్లా దివ్యాంగుల అటల పోటీలను , మహిళ , శిశుసంక్షేమా,దివ్యాంగుల శాఖ అధ్వర్యంలో డిసె ంబర్ 3న అంతర్జతీయ దివ్యాంగులందరికీ జిల్లా స్థాయిలో అటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దివ్యాంగుల తమకళ్లపై తమే నిలబడాలనే అత్మస్థైర్యానికి ఇలాంటి ఆట పోటీలు ఉపయోగపడుతాయన్నారు. 10నుండి 16 సంవత్సరాలు , 17నుండి 54సంవత్సరాలు గా ను రెండు విభగాలుగా విభజించి పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మంలో కాంతారావు, రజిత, జహీరుద్దీన్ , రాములు , సంగమేశ్వర్ , వెంకటేష్ , ఆశాలత , సురేష్ నాయక్ , శ్రీనివాస్ నరేష్ పాల్గొన్నారు.

## పీర్జాదిగూడలో వేద స్పెషాలిటీ ఉచిత వైద్య శిబిరం

పాల్గొన్న మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి



**ప్రజాపక్షం/బోడుప్పల్ :** ఆయుర్వేదం అంటే కేవలం వైద్య పద్ధతి కాదు, ఇది మన జీవన శైలిని మార్చే మార్గం అని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి అన్నారు. పేదలు, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఆయుర్వేద వైద్యం అందించడమే లక్ష్యంగా ఏర్పాటు చేసిన వేద స్పెషాలిటీ యుర్వేదిక్ ఆసుపత్రి 4వ వార్షికోత్సవం సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 25వ డివిజన్ శ్రీ సాయి నగర్ కమ్యూనిటీ హాల్ నందు ఏర్పాటు చేసిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి ప్రారంభించారు. హెల్త్ క్యాంప్ లో జనరల్ మెడిసిన్స్, బీపి, మధుమేహం,ఆర్థోపెడిక్,కార్డియాలజీ, గ్యాస్ట్రో,ఈ.ఎన్.టి తదితర పరీక్షలు నిర్వహించి ఉచిత ఆయుర్వేద మందులను పంపిణీ చేశారు. జక్క వెంకట్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ దొంతిరి హరిశంకర్ రెడ్డి తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాల నీల అధ్యక్ష కార్యదర్శులు రవీంద్ర చారి, హరిందర్ యాదవ్, రవీందర్ రెడ్డి,విజయ్, మధు సూదన్, మోహన్ రెడ్డి, రాజు, వైద్యులు డా౹౹ జయచందర్, డా.ఎస్. అజయ్ దుర్గ ప్రసాద్, డా.బి.శివ, డా.విరాజిత, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్-3 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



**ప్రజాపక్షం/తాండూరు :** రెండు రోజుల పాటు తాం డూరులో జరగనున్న గ్రూప్ 3 పరిక్షలు నిర్వహణకు పక డ్బందిగా ఏర్పాట్లు చేస్తున్నట్లు తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ తెలిపారు. ఈ నెల 17, 18న నిర్వహించనున్న గ్రూప్3 పరీక్షలను నిఘానీడలో కొనసా గుతాయని తెలిపారు. గ్రూప్3 పరిక్షలను దృష్టిలో ఉంచుకుని తాండూర 11కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పరీక్షలు ఉదయం 10గంటల నుండి మధ్యహ్నం 1230గంటల వరకు సాగుతుందని తెలిపారు. పరీక్షకు హాజరయ్యే వారు గంట ముందుగానే పరిక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పరిక్ష కేంద్రాల వద్ద 144సెక్షన్‌ను పక్కగా అమలు చేయాలని సూచించారు.

## నేడు గోశాలలో కార్తీక దీపోత్సవం

గోశాల సేవా సమితి అధ్యక్షులు పట్లోళ్ళ బాల్‌రెడ్డి



**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరులో గోశాలలో ఈ నెల 17న కార్తీక దీపోత్సవ కా ర్యక్ర మాన్ని నిర్వహిస్తున్నట్లు తాండూరు గోశాల సేవా సమి తి అధ్యక్షులు ఎంఎసి చైర్మన్ పటోళ్ళ బాల్‌రెడ్డి ఓ ప్రకటనలో కోరారు. తాండూరు గోశాలలో ఈ నెల 17న సాయంత్ర 5గంటలకు గోపూజ, దిపోత్సవ కార్యక్రమం నిర్వహిస్తునట్లు తెలిపారు. కావున భక్తులు అధిక సంఖ్యలో పాల్గోని కార్తీ దీపోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

## కోట్‌పల్లిలో పేకాట రాయుళ్ళ అరెస్టు

**ప్రజాపక్షం/కోట్‌పల్లి:** కోట్‌పల్లి మండల కేంద్రంలో 9 మంది పేకాట ఆడుతూ పోలీసులకు పట్టుబడ్డ సంఘటన శనివారం చోటుచేసుకుంది. మండల కేంద్రంలోని కుమ్మరి లాలప్ప షాపు ముందు రోడ్డు పక్కన మధ్యాహ్నం 1గంట సమయంలో పేకాట ఆడుతున్నట్లు పోలీ సులకు సమాచారం అందుకున్న పోలీసులు పేకాట స్థావరాలపై దాడి చేసి వారిని అదుపులోకి తీసుకుని అరెస్టు చేసిన్నట్లు ఎస్ఐ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ పేకా ట ఆడితే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు. ఎక్కడ పేకాట ఆడిన పోలీసులకు సమాచారం అందించాలని ఆమే తెలిపింది.

## సామాజిక న్యాయంపై నల్సార్ ప్రత్యేక దృష్టి

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే



**ప్రజాపక్షం/శామీర్‌పేట :** అట్టడుగు వర్గాలకు సామాజిక న్యాయం చేకూర్చుటకు ప్రత్యేక దృష్టి సారించి రాజ్యా ంగ వాదం, చట్ట బద్ధత న్యా యాన్ని నొక్కి చెప్పే నాణ్యమై న న్యాయ విద్య ను అందిం చడానికి నల్సార్ న్యాయ విశ్వ విద్యాలయం నిరంతరం కృషి చేస్తుందని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, నల్సార్ యూనివర్శిటి ఆఫ్ లా చాన్సలర్ జస్టిస్ అలోక్ అరాధే అన్నారు. శనివారం డైరక్టరేట్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యూకేషన్ నల్సార్ అందించే ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్ ప్రోగ్రామ్ 2024 బ్యాచ్‌కు అర్హత పొందిన అభ్యర్థులకు డిగ్రీలు, అడ్వా న్స్‌డ్ డిప్లమాలను ప్రదానం చేయడానికి స్నాతకోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అలోక్ అరాధే మాట్లాడుతూ 1989 నుంచి దూరవిద్య క్రమంగా పెరుగుతుందని నల్సార్ ఈ రంగంలో తనదైన పాత్రను పోషిస్తుందని, నల్సార్ ఓపెన్ డిస్టెన్స్ లెర్నింగ్‌లో వి ద్యార్థుల నమోదులో దాదాపు 50 శాతం మంది మహిళలు ఉన్నారని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ స్నాతకోత్సవంలో 1255 డిగ్రీలు, డిప్లమాలు అందజేశారు. 287 మంది గ్రాడ్యుయేట్లు హాజర య్యారు. ఈ కార్యక్రమంలో నల్సార్ న్యాయవిశ్వ విద్యా లయం వైస్ చా న్సలర్, ప్రొ. కృష్ణదేవరావు, ప్రొఫెసర్ వాసంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేశ నిర్మాణంలో పత్రిక పాత్ర కీలకం

**ప్రజాపక్షం/కోట్‌పల్లి:** దేశ నిర్మాణానికి ముఖ్య భూమిక పోషించడంలో పత్రికలు కీలక పాత్రను కలిగి ఉందని ఇంటర్నేషనల్ హూమెన్ రైట్స్ కమీషన్ యూత్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ అన్నారు. నవం బర్ 16న జాతీయ పత్రిక దినోత్సవం సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు, ప్రభుత్వాలకు వారధులుగా స్వచ్ఛమైన సమా జ నిర్మాణానికి పునాదులు వేసి నాలుగొ స్తంబంగా నిలువడం గొప్ప పరిణామమన్నారు.

## ఆర్డివోను మర్యాదపుర్వకంగా కలిసిన ఎంసి చైర్మన్

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** కీసర ఆర్‌డివో సైదులు, ఇన్స్‌పెక్టర్ వెంకటయ్యను మేడ్చల్ మార్కె ట్ కమిటీ చైర్మన్ నర్సింహ్మా యాదవ్ శనివారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాలతో ఘనంగా సన్మానించారు. వారితో వివిధ అంశాలపై చర్చించారు. మూడు చింతలపల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, న్యాయవాది శేఖర్‌రెడ్డి, ఐలయ్య యాదవ్, భద్రయ్య, నర్సారెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## నాగారం మున్సిపల్ సాధారణ సమావేశంలో ఈటల

**ప్రజాపక్షం/నాగారం :** మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్న పాలకవర్గానికి మల్కాజ్ గిరి పార్లమెంటు సభ్యులు ఈటల రాజేందర్ ధన్యవాదాలు తెలిపారు.శనివారం నాగారం ము న్సిపాలిటీ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అధ్యక్షతన సాధారణ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎంపి ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా విచ్చేశారు.ఈ సమావేశంలో 20 వార్డులకుగాను 7 కోట్ల 8 లక్షల రూపాయల నిధులతో సిసి రోడ్డు,అండర్‌గ్రౌండ్ పనులు,ఇతర పనులకు తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈటల రాజేందర్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో నాగారం మున్సిపాలిటీ అభివృద్ధికి పార్టీల కు ఆతీతంగా కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ భాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్,కౌన్సిలర్లు కౌకుట్ల అనంత్‌రెడ్డిగూడురు సబితా అంజనేయులు గౌడ్, లావణ్య శ్రీనివాస్, కళావతి,నాగేష్, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడ

# రోహిత్, గిల్ ఔట్..!



సొంతగడ్డపై న్యూజిలాండ్ చేతిలో ఘోర పరాజయాన్ని చవిచూసిన భారత్ మరో టెస్టు సిరీస్ సమరానికి సిద్ధమవుతోంది. నవంబర్ 22 నుంచి ఆస్ట్రేలియాతో అయిదు టెస్టుల సిరీస్ ఆడనుంది. వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (2024–25)లో టీమిండియాకు ఇదే చివరి సిరీస్. ముచ్చటగా మూడోసారి డబ్ల్యూటిసి ఫైనల్‌కు చేరాలంటే రోహిత్ సేనకు ఈ సిరీస్ అత్యంత కీలకం. అయితే రోహిత్‌తో పాటు శుభ్‌మన్ గిల్ కూడా పెర్త్ టెస్టుకు అందుబాటులో ఉండట్లేదని తెలుస్తోంది. మ్యాచ్ సిమ్యులేషన్‌లో స్లిప్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా గిల్ బొటనవేలుకు గాయమైంది. స్కానింగ్‌లో ఫ్రాక్చర్ అయినట్లుగా తెలిసిందని సమాచారం. టాప్ ఆర్డర్‌లో రోహిత్, గిల్ లేకపోవడం టీమిండియాకు కోలుకోలేని ఎదురుదెబ్బే. బ్యాకప్ ఓపెనర్ అభిమన్యు ఈశ్వరన్ కంగారూల గడ్డపై తేలిపోవడం భారత జట్టును మరింత కలవరపెడుతోంది. ఈ నేపథ్యంలో మరో బ్యాటర్‌ను తొలి టెస్టుకు ఎంపికచేయాలని బిసిసిఐ భావిస్తోంది. దేవదత్ పడిక్కల్, రుతురాజ్ గైక్వాడ్‌లలో ఒకరిని జట్టులోకి తీసుకోవాలని చూస్తోంది. భారత్ 'ఎ' జట్టు తరపున పడిక్కల్ ఫర్వాలేదనిపించాడు. అంతేగాక మ్యాచ్ సిమ్యులేషన్‌లో జస్‌ప్రీత్ బుమ్రాను సైతం పడిక్కల్ సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. మరోవైపు రుతురాజ్ గైక్వాడ్ మ్యాచ్ సిమ్యులేషనల్‌లో మెరుగైన ప్రదర్శన చేశాడు. అశ్విన్ బౌలింగ్‌లో రెండు సిక్సర్లతో సహా నాలుగు సిక్సర్లు బాదాడు.

**భారత జట్టు:** రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, శుభ్మన్ గిల్, అభిమన్యు ఈశ్వరన్, విరాట్ కోహ్లి, సర్ఫరాజ్ ఖాన్, వాషింగ్టన్ సుందర్, నితీశ్ కుమార్ రెడ్డి, రవీంద్ర జడేజా, రవిచంద్రన్ అశ్విన్, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్, ధ్రువ్ జురెల్, జస్‌ప్రీత్ బుమ్రా, మహ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ, హర్షిత్ రాణా, ఆకాశ్ దీప్.



## రోహిత్‌కు శుభాకాంక్షల వెల్లువ

టీమ్ఇండియా కెప్టెన్ రోహిత్ శర్మ మరోసారి తండ్రైన సందర్భంగా అతడికి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. క్రికెటర్లు సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, సంజూ శాంసన్ హిట్ మ్యాన్‌కు స్పెషల్ విషెష్ తెలిపారు. ఈ ముగ్గురు మాట్లాడిన వీడియోను బీసీసీఐ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. రోహిత్‌కు కుమారుడు పుట్టడం పట్ల తిలక్ వర్మ సంతోషం వ్యక్తం చేశాడు. హిట్‌మ్యాన్‌కు విషెస్ తెలుపుతూ కాస్త ఎమోషనల్ అయ్యాడు. 'నేను చాలా సంతోషంగా ఉన్నాను రోహిత్ భాయ్. ఈ క్షణం కోసమే ఎదురు చూశాం. ఒకటి, రెండు రోజుల తర్వాత డెలివరీ అయ్యుంటే నేను పక్కనే ఉండేవాడిని. చాలా ఎగ్జైటింగ్‌గా ఉన్నాను. తొందరగానే వచ్చి కలుస్తాను' అని తిలక్ వర్మ పేర్కొన్నాడు. 'లిటిల్ బాయ్ కోసం చిన్న ప్యాడ్లు, సైడ్ ఆర్మ్, బ్యాట్‌తో సిద్ధంగా ఉండాలి' అని రోహిత్ కు సూర్యకుమార్ యాదవ్ స్పెషల్ విషెష్ చెప్పాడు. 'చెట్టా (అన్నయ్య), అతని కుటుంబం చాలా సంతోషంగా ఉండాలి' అని రోహిత్‌కు శాంసన్ శుభాకాంక్షలు తెలియజేశాడు. రోహిత్ శర్మ మరోసారి తండ్రి అయ్యాడు. అతడికి రెండో సంతానం కలిగింది. హిట్ మ్యాన్ భార్య రితికా సజ్దే శుక్రవారం రాత్రి మగబిడ్డకు జన్మనిచ్చింది. దీంతో రోహిత్ శర్మ కుటుంబంలో సంబరాలు మొదలయ్యాయి. అయితే ఈ జంటకు ఇప్పటికే ఓ కుమార్తె ఉంది.

## ఐపిఎల్ మెగా వేలంలో 13ఏళ్ల కుర్రాడు

### ఎవరు దక్కించుకున్నా సంచలనమే!




ఐపిఎల్ ఇప్పటివరకు అనేక రికార్డులు, అద్భుతాలు నమోదు అవ్వడం చూశాం. అయితే క్యాష్ రిచ్ లీగ్ చరిత్రలోనే ఈసారి ఓ వండర్ క్రియేట్ అయ్యే ఛాన్స్ ఉంది. అదేంటో కాదు, 2025 మెగా వేలంలో ఓ 13ఏళ్ల కుర్రాడు తన పేరును రిజిస్టర్ చేసుకున్నాడు. అంతేకాకుండా ఐపిఎల్ బోర్డు షార్ట్ లిస్ట్ చేసిన ప్లేయర్ల లిస్ట్‌లో ఆ కుర్రాడి పేరు కూడా అందులో ఉంది. రూ.30 లక్షల బేస్‌ప్రైజ్‌తో ఆ కుర్రాడు వేలంలో దిగనున్నాడు. దీంతో అంత చిన్న కుర్రాడిని వేలానికి ఎంపిక చేయడం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. ఇక ఈసారి అతడిని ఏ ఫ్రాంచైజీ దక్కించుకున్నా అది సంచలం కానుంది. మరి ఆ కుర్రాడు ఎవరు? ఎక్కడ నుంచి వచ్చాడ? అన్న ప్రశ్నలు క్రికెట్ అభిమానుల్లో మెదులుతున్నాయి. బీహార్‌కు చెందిన వైభవ్ సూర్యవంశీ 2011లో జన్మించాడు. అంటే ప్రస్తుతం అతడి వయసు 13ఏళ్లు. తాజ్‌పుర్ గ్రామానికి చెందిన వైభవ్ నాలుగేళ్ల వయసులోనే బ్యాట్ పట్టాడు. చిన్న వయసులోనే కుమారుడికి క్రికెట్‌పై ఇష్టాన్ని గ్రహించిన వైభవ్ తండ్రి సంజీవ్ సూర్యవంశీ ప్రత్యేకంగా మైదానాన్ని తయారు చేయించాడు. మరో నాలుగేళ్లకే సమస్తిపుర్‌లోని క్రికెట్ అకాడమీలో చేర్పించాడు. అక్కడ రెండేళ్లపాటు శిక్షణ పొందిన అతడు అండర్ 16 జట్టులోకి వచ్చేశాడు. అప్పటికి వైభవ్ వయసు కేవలం 10 ఏళ్లే కావడం గమనార్హం. ఆ వయసులోనే బిహార్ స్టేట్ లెవెల్ టోర్నీ అన్నింట్లోనూ వైభవ్ అదరగొట్టాడు. ఆ తర్వాత వినూ మన్కడ టోర్నీలో రాణించాడు. దీంతో బీహార్ క్రికెట్ బోర్డు దృష్టి ఆకర్షించాడు. అలా 2024లోనే బీహార్ తరఫున ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో అడుగుపెట్టాడు. ఆ తర్వాత టీమ్ఇండియా అండర్ 19 జట్టుకు కూడా ఎంపికయ్యాడు. ప్రస్తుతం 2024–25 రంజీలోనూ ఆడుతున్నాడు. లెఫ్ట్ హ్యాండ బ్యాటరైన వైభవ్ దూకుడుగా ఆడడం అతడి స్పెషల్. కాగా, నవంబర్ 24, 25 తేదీల్లో జెడ్డా (సౌదీ అరేబియా) వేదికగా నిర్వహించనున్నారు. ఈ వేలంలో ఉండనున్న అతిపిన్న వయస్కుడు వైభవ్ కాగా, అతి పెద్ద వయస్కుడిగా ఇంగ్లాండ పేసర్ జేమ్స్ అండర్సన్ (42ఏళ్లు) ఉండనున్నాడు.




రీల్

## ఓజి కోసం రమణ గోగుల..

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కెరీర్ లో చాలా మంది సంగీత దర్శకులతో వర్క్ చేసి ఉండొచ్చు కానీ తన కల్ట్ ఫ్యాన్స్ కి మాత్రమే తెలుసు పవన్ సినిమాల్లో సంగీత దర్శకుడు రమణ గోగుల కాంబినేషన్ అంటే ఏంటి అనేది. తన కెరీర్ స్టార్టింగ్ లో వచ్చిన సినిమాల్లో పవన్ కి పర్ఫెక్ట్ గా సింక్ అయ్యిపోయే గొంతుతో స్టైలిష్ అండ్ సాలిడ్ బీట్స్ తో రమణ గోగుల ఇచ్చిన ట్రీట్ ఇప్పటికీ రిఫ్రెషింగ్ గా అనిపిస్తుంది. అయితే అన్నవరం వరకు సాగిన పవన్, రమణ గోగుల జర్నీ ఆ తర్వాత మళ్ళీ సెట్ కాలేదు. మరి అట్లీస్ట్ ఒక్క సాంగ్ అయినా కూడా ఇద్దరి కాంబినేషన్ లో ఇపుడు పడితే బాగుంటుంది అని చాలా మంది అనుకుంటున్నారు. మరి దీనిపై బ్లాస్ట్ కి ఇపుడు ఫ్యాన్స్ సిద్ధం కావాల్సిందే అని చెప్పాలి. ఇపుడు పవన్ చేస్తున్న అవైటెడ్ భారీ సినిమా ఓజి కోసం థమన్ ప్లానింగ్స్ చేస్తున్నాడు .రీసెంట్ గానే ఓజి కోసం రమణ గోగుల గారితో సాంగ్ పాడించాలని ట్రై చేస్తున్నట్టుగా రివీల్ చేసాడు. మరి ఇది కానీ నిజం అయితే మ్యూజిక్ లవర్స్ కి పవన్ ఫ్యాన్స్ కి పెద్ద పండుగే అని చెప్పి తీరాలి. ఇక దీనితో పాటుగా పవన్ వారసుడు అకిరా ప్రెజెన్స్ కూడా ఈ సినిమాలో ఉంటుంది అని తెలిపాడు. అయితే అకిరా నటుడుగా కాకుండా పియానో ట్యూన్ వర్క్ అందిస్తాడని తెలిపాడు. దీనితో ఓజి మాత్రం ఇపుడు మరింత స్పెషల్ గా మారిపోయింది అని చెప్పాలి.

## తుంబాడ్ నుంచి సీక్వెల్స్..

ఇండియన్ సినిమా దగ్గర ఉన్నటువంటి ఆల్ టైం కల్ట్ హారర్ థ్రిల్లర్ సినిమా ఏదన్నా ఉంది అంటే అది హిందీ చిత్రం తుంబాడ్ అని చెప్పొచ్చు. మరి ఈ చిత్రం అప్పట్లో ఫ్లాప్ అయినప్పటికీ ఇపుడు మళ్ళీ రీ రిలీజ్ కి తీసుకొచ్చిన ఈ సినిమా అప్పుడుకి మించి భారీ వసూళ్లు అందుకుంది. మరి ఈ రీ రిలీజ్ తోనే మేకర్స్ దీనికి సీక్వెల్ ని కూడా అనౌన్స్ చేసి ఓ రేంజ్ లో ఫ్యాన్స్ ని ఎగ్జైట్ చేశారు. ఇక ఈ సీక్వెల్ పై లేటెస్ట్ గా దర్శకుడు అనీల్ రాహి బార్వె సాలిడ్ అనౌన్సమెంట్ ఇచ్చారు. దీనితో ఈ క్రేజీ థ్రిల్లర్ కి ఒకటి కాదు రెండు సీక్వెల్స్ ఉంటాయని కన్ఫర్మ్ చేశారు. తన తుంబాడ్ నుంచి రెండో భాగం ఈ రానున్న 2026 లో మొదలవుతుంది అని తెలిపారు. దీనితో ఫ్యాన్స్ మాత్రం ఓ రేంజ్ లో ఎగ్జైట్ అవుతున్నారు. ప్రస్తుతం అయితే ఈ టాలెంటెడ్ దర్శకుడు నెట్ ఫ్లిక్స్ లో భారీ వెబ్ సిరీస్ రక్త బ్రహ్మాండ అనే సిరీస్ ని చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ సిరీస్ లో స్టార్ హీరోయిన్ సమంత సహా బాలీవుడ్ ప్రముఖులు నటిస్తున్నారు.



## మలయాళ డైరెక్టర్‌కు ఓకే చెప్పిన నాని..?



న్యాచురల్ స్టార్ నాని ప్రస్తుతం వరుస సినిమాలను లైన్‌లో పెడుతూ బిజీగా ఉన్నాడు. ఇప్పటికే ఆయన దర్శకుడు శైలేష్ కొలనుతో 'హిట్3' సినిమాలో నటిస్తూ బిజీగా ఉన్నాడు. ఈ సినిమాను వచ్చే వేసవి కానుకగా రిలీజ్ చేసేందుకు మేకర్స్ రెడీ అవుతున్నారు. ఈ సినిమాతో పాటు దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో కూడా ఓ సినిమాను స్టార్ట్ చేశాడు నాని. అయితే, ఈ రెండు సినిమాలతో పాటు దర్శకుడు సుజీత్‌తోనూ ఓ సినిమా చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడు నాని. ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా త్వరలోనే ఉండనుందని తెలుస్తోంది. కాగా, ఇప్పుడు ఓ మలయాళ దర్శకుడికి నాని గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా సినీ సర్కిల్స్‌లో టాక్ వినిపిస్తోంది. మలయాళంలో మంచి కంటెంట్ ఉన్న సినిమాలను తెరకెక్కించిన దర్శకుడు విపిన్ దాస్ నాని కోసం ఓ కథను రెడీ చేసి వినిపించాడట.దీనికి నాని కూడా గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లుగా వార్తలు వినిపిస్తున్నాయి. అయితే, నాని ప్రస్తుతం కమిట్ అయిన సినిమాలన్నీ కూడా పూర్తి చేసిన తరువాతే నాని ఈ మలయాళ దర్శకుడితో సినిమాను పట్టాలెక్కిస్తాడని తెలుస్తోంది. మరి దీనిపై అధికారిక ప్రకటన వచ్చే వరకు అయితే వెయిట్ చేయాల్సిందే.

## సిబ్బందికి ఫైర్ సేఫ్టీపై అవగాహన కార్యక్రమం



**ప్రజాపక్షం / హైదరాబాద్:** అగ్నిప్రమాదాలు, ఫైర్ సేఫ్టీ పట్ల అవగాహన పెంచేందుకు ఫైర్ సర్వీసెస్ డిపార్ట్‌మెంట్ శనివారం డాక్టర్‌బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో ఎస్‌పిఎఫ్ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. గతంలో తెలంగాణ స్పెషల్ పోలీసుల రక్షణలో ఉన్న సచివాలయం భద్రతను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఎస్‌పిఎఫ్‌కు అప్పగించింది. అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ జి.వి.ప్రసాద్, స్టేషన్ ఫైర్ ఆఫీసర్లు జన్య, ఎ.యాదయ్య, ప్రాథమిక అగ్నిమాపక అవగాహన, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు, ఫిక్స్డ్ ఫైర్ ఇన్‌స్టాలేషన్లను ఎలా ఉపయోగించాలనే అంశాలను భద్రతా సిబ్బందికి వివరించారు. ఫైర్ సేఫ్టీతో సహా అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ప్రజలను తరలించే విధానాల గురించి అగ్నిమాపక అధికారులు ఎస్‌పిఎఫ్ సిబ్బందికి తెలియజేశారు. బ్రొంటో స్కై లిఫ్ట్ (బిఎస్ఎల్) ద్వారా టెర్రస్ నుండి ఎలా రక్షించాలో, శ్వాస వ్యాయామాలు, కృత్రిమ శ్వాసక్రియతో కూడిన పద్ధతిని సిబ్బందికి ప్రదర్శన ద్వారా వివరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ దేవదాస్, ఎస్‌పిఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

## సిఆర్ గొప్ప మానవతావాది

(మొదటి పేజీ తరువాయి)

కేంద్రంగా పని చేస్తున్న చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్ సేవలను నూతన ఆంధ్రప్రదేశ్లో విజయవాడ కేంద్రంగా విస్తరణ చేయనున్నట్లు వెల్లడించారు. కమ్యూనిస్టు ప్రభావం లేకుండా సీఆర్ ఫౌండషన్ పేరుతో చారిటబుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళా సాధికారత, గ్రంథాలయం, కళా కేంద్రం ద్వారా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.
సిపిఐ ఎపి రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ నమ్మిన సిద్ధాంతం కోసం తుది శ్వాస వరకు ధైర్యంగా నిలబడిన వ్యక్తి చంద్ర రాజేశ్వర రావు అన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేత సందర్భంగా లౌకికవాదానికి దేశ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారని చెప్పారు. సీఆర్ ఫౌండేషన్కు సీఆర్డీఏ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ చంద్ర రాజేశ్వరరావు త్యాగాలు, నిరాడంబరతను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. మహాత్మ గాంధీ ఆశయాలను ఆచరించి చూపిన నేత సీఆర్ అన్నారు. దేశం కోసం పాతతరం త్యాగాలు చేసిందని, నేటి తరం దేశాన్ని త్యాగం చేస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్ర రాజేశ్వరరావుతో తనకు, తన కుటుంబానికి ఉన్న అనుబంధాన్ని, సీఆర్ జీవిత విశేషాలను వివరించారు. మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ కొందరు చరిత్రను మార్చటానికి జన్మిస్తారని సీఆర్ ఆ కోవకు చెందుతారని చెప్పారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టి, ఉన్నత విద్యను అభ్యసించి వాటన్నింటినీ కాదని దేశ సమైక్యత కోసం పని చేశారని తెలిపారు. మౌలిక అంశాలపై రాజీపడకుండా ఏకాభిప్రాయంతో పనిచేస్తే స్వాతంత్ర్యం నిలుస్తుందన్నారు. నేడు ప్రజాస్వామ్యాన్ని, న్యాయవ్యవస్థను కాలరాస్తూ కార్పోరేట్లకు దేశ సంపదను దోచిపెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలో చంద్ర రాజేశ్వర రావు పేరుతో స్ఫూర్తి విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రముఖ వైద్యులు డాక్టర్ జి.సమరం మాట్లాడుతూ సాంఘిక విప్లవ కారుడు, సమసమాజ నిర్మాణం కోసం పరితపించిన నాయకుడు సీఆర్ అన్నారు. సీఆర్ ఫౌండేషన్కు తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు.
ముందుగా చంద్ర రాజేశ్వరరావు చిత్ర పటానికి నేతలు పుష్పాంజలి ఘటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రనాయక్ సీఆర్ వీలునామా గీతాన్ని ఆలపించారు. అతిథులకు సీఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు ముప్పాళ్ళ నాగేశ్వరరావు స్వాగతం పలికారు. ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట రెడ్డి వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, కంభంపాటి అజయ్, కార్యదర్శి పిడికిటి సంధ్యాకుమారి, పీజె చంద్రశేఖరరావు, కోశాధికారి వి.చెన్నకేశవరావు, కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, మానం ఆంజనేయులు, డాక్టర్ రజనీ, జోస్యుల కల్పన తదితరులు పాల్గొన్నారు.

## తీరుమార్చుకోని పామాయిల్ కంపెనీల అనుమతులు రద్దు

### పామాయిల్ కంపెనీల పనితీరు పురోగతిపై సమీక్షలో మంత్రి తుమ్మల



**ప్రజాపక్షం / హైదరాబాద్:** ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ విషయంలో తమ వైఖరి మార్చుకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే ఆయిల్ కంపెనీల అనుమతులు రద్దు చేసి, టిజి ఆయిల్ ఫెడ్‌కు కేటాయిస్తామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హెచ్చరించారు. పురోగతి చూపించని ఆయిల్ కంపెనీలపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. 2025 చివరి నాటికి ప్రతి ఆయిల్ కంపెనీ వారికి కేటాయించిన జోన్లలో ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయాల్సిందేనని మంత్రి తేల్చి చెప్పారు. పామాయిల్ కంపెనీల పని తీరు పురోగతిపై శనివారం సంబంధిత అధికారులతో మంత్రి సమీక్షించారు. ఆయిల్ పామ్ సాగును లాభసాటిగా చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, ఆయిల్ పామ్ సాగు విస్తీర్ణంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో ఉంచాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఇందుకోసం కావాల్సిన అన్ని రకాల చర్యలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. ఇప్పటికే 64,040 హెక్టార్లలో ఆయిల్ పామ్ ప్లాంటేషన్ చేసినట్లు చెప్పారు. "202425 ఆర్థిక సంవత్సరంలో లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలనే లక్ష్యాన్ని పెట్టుకోగా ఇప్పటివరకు 25,470 ఎకరాల్లో ప్లాంటేషన్ పూర్తి చేసుకున్నాం. ఆయిల్ పామ్ కంపెనీలు వారికి కేటాయించిన జోన్లలో ఆయిల్ పామ్ ప్రాసెసింగ్ కర్మాగారాల ఏర్పాటుకు వివిధ సంస్థలు తక్షణమే చర్యలు చేపట్టాలి. ప్రతీ కంపెనీ నర్సరీని కలిగి ఉండాలి. అత్యధికంగా నూనే శాతాన్ని ఇచ్చే వంగడాలను, గ్యానోడెర్మలాంటి వ్యాధులను తట్టుకునే వంగడాలను, తక్కువ ఎత్తు పెరిగే పొట్టి రకాలకు సంబంధించిన నాణ్యమైన మొక్కలను తెప్పించుకుని నర్సరీలలో పెంచి రైతులకు సరఫరా చేయాలి. ప్రస్తుతం టన్ను పామ్ ఆయిల్ గెలల ధర రూ.6000 లకు పైగా పెరిగిందని, త్వరలోనే టన్ను ధర రూ.20వేలు దాటే అవకాశం ఉంది" అని మంత్రి అధికారులకు వివరించారు.

## ప్రధానమంత్రి నియామకం

(మొదటి పేజీ తరువాయి)

శాస్త్రీయ పద్ధతులలో శాఖల కేటాయింపు ఉంటుంది" కానీ డిప్యూటీ మంత్రులసంఖ్య ఎక్కువగా ఉండవచ్చు, ఎందుకంటే ముఖ్యమైన పెద్దశాఖ ల బాధ్యతలు పూర్తి చేయడానికి వీరి అవసరం ఉంది" అని ఎన్‌పిపి సీనియర్ అధికార ప్రతినిధి తిల్విన్ సిల్వా శనివారంనాడు పాత్రికేయులకు చెప్పారు. శ్రీలంకలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక ఇప్పటివరకూ ముగ్గురు మంత్రులతోనే ప్రభుత్వం నడుస్తున్నది.
శ్రీలంకలో అంతర్గత రాజకీయ సంక్షోభం ఓ కొలిక్కి వచ్చాక మొదటిసారి ఈ ఏడాది సెప్టెంబరులో జరిగిన ఎన్నికల్లో వామపక్ష మార్క్సిసు కూటమి నాయకుడు దిస్సనాయకే అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. 2010 అధ్యక్ష ఎన్నికల్లో మహింద రాజపక్షకు 60.33 శాతం ఓట్లురాగా, ఈసారి తక్కువ ఓటింగ్ జరిగినాగానీ దిస్సనాయకేకు 61.56 శాతం ఓట్లు వచ్చాయి. మొత్తం 168 పోలింగ్ డివిజన్లకుగాను 152 డివిజన్లను అత్యధికంగా ఎన్‌పిపి గెలుచుకుంది. పోల్చి చూస్తే, ఇంతకుముందు రాజపక్ష ప్రభుత్వం 136 డివిజన్లు మాత్రమే గెలుచుకుంది. అదేవిధంగా మొత్తం 22 జిల్లాలో అత్యధికంగా 21 జిల్లాలను ఎన్‌పిపి కూటమి గెలుచుకుంది. అంతకుముందు రాజపక్ష ప్రభుత్వం అత్యధికంగా 19 జిల్లాలను గెలుచుకుంది. కాగా పార్లమెంటులో ఎన్‌పిపి అత్యధికంగా 159 స్థానాలు గెలుచుకోగా 2020లో రాజపక్ష ప్రభు త్వం 145 స్థానాలు గెలుచుకుంది. పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజారిటీ రావాలంటే 150 స్థానాలు గెలుచుకోవాలి. కానీ ఎన్‌పిపి మరో తొమ్మిది స్థానాలు ఎక్కువే గెలుచుకుంది.

## టిజిసెట్ 2024 ఫలితాలు విడుదల

### 1884 మంది అభ్యర్థులు ఉత్తీర్ణత



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి తెలంగాణ రాష్ట్ర అర్హత పరీక్ష టిజి సెట్ 2024 ఫలితాలు శనివారం విడుదలైయ్యాయి. ఈ ఫలితాలను ఓయూ ఉపకులపతి ప్రొఫెసర్‌కుమార్ మొలుగారంతో కలిసి ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్టారెడ్డి విడుదల చేశారు. ఈ పరీక్షకు మొత్తం 33, 494 మంది దరఖాస్తు చేసుకోగా 26, 294 మంది పరీక్షలను రాశారు. ఇందులో 1884 (7.17 శాతం) మంది అర్హత సాధించినట్లు అధికారులు వెల్లడించారు. అర్హత సాధించిన అభ్యర్థుల్లో మహిళాలు (49.79 శాతం), పురుషులు (50.21 శాతం ) మంది ఉన్నట్లు తెలిపారు. ఫలితాలకోసం అభ్యర్థులు టిజిసెట్ అధికారిక వెబ్‌సైట్ www.telanganaset.org లో చూసుకోవచ్చని సభ్యకార్యదర్శి ప్రొఫెసర్ నరేష్ రెడ్డి తెలిపారు. దరఖాస్తు నంబర్, పుట్టిన తేదీ ఎంటర్ చేయటం ద్వారా ఫలితాలను చూసుకోవచ్చని వెల్లడించారు. పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు త్వరలోనే వెరిఫికేషన్ ప్రక్రియ చేపడతామని ఇందుకు సంబంధించిన సమాచారాన్ని వెబ్ సైట్ నుంచి డౌల్ లోడ్ చేసుకోవచ్చని వివరించారు. టిజిసెట్‌లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఓయూ ఉపకులపతి ఆచార్య కుమార్ మొలుగారం శుభాకాంక్షలు తెలిపారు. ఉన్నత విద్యారంగంలో బోధన చేసే అత్యంత నైపుణ్యం కలిగిన వారిన ఎంపిక చేయటంలో ఈ పరీక్షకు ఎంతో ప్రాధాన్యతను ఉందన్నారు. పరీక్ష నిర్వహణ, మూల్యాంకన ప్రక్రియలో పారదర్శకత ఉండేలా టీజీ సెట్ బృందం, ఉస్మానియా విశ్వవిద్యాలయం చేస్తున్న కృషిని ఉన్నత విద్యామండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి అభినందించారు.
ఈ కార్యక్రమంలో టీజీ సెట్ 2024 ప్రక్రియలో భాగస్వాములైన పాలమూరు విశ్వవిద్యాలయ వైఎస్ ఛాన్సలర్ ప్రొఫెస ర్ జిఎన్. శ్రీనివాస్, ఓయూ సైన్స్ విభాగం డీన్ ప్రొఫెసర్ కరుణ సాగర్, ఆచార్య విజయ, కేయూ ప్రొఫెసర్ కె రాజెందర్, మైసూర్ విశ్వవిద్యాలయంలోని వాణిజ్య విభాగం ప్రొఫెసర్ కె. నాగేంద్రబాబు, యోగివేమన విశ్వవిద్యాలయ జియాల జీ విభాగం ప్రొఫెసర్ వి.సునిత ఓయూ విసి ఓఎస్‌డి ప్రొఫెసర్ జితేంద్ర కుమార్ నాయక్, ప్రొఫెసర్ మురళీకృష్ణ, ప్రొఫెసర్ నగేశ్, ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్, ప్రొఫెసర్ గంగాధర్ పాల్గొన్నారు.

## రెచ్చగొడుతున్నారు

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. గడిచిన 11నెలలుగా ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తూ, అభివృద్ధిలో దూసుకుపోతున్నామని వెల్లడించారు. క్షేత్ర స్థాయిలో మన పనీతిరు ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రతిపక్షం సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలు చేస్తున్నప్పటికి నిజమైన లబ్ధిదారులకు ప్రజా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. వారు ఎన్ని అప్రజాస్వామిక పనులు చేసినా కాంగ్రెస్ మాత్రం ప్రజాస్వామిక పద్ధతిలోనే ముందుకు వెళుతుందన్నారు. ఈ నెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాపై వరాల జల్లు కురిపించనున్నట్లు పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ ప్రకటించారు. అదే విధంగా నగరంలోనూ అనేక అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, ఎంపీలు కడియం కావ్య, పోరిక బలరాం నాయక్, ప్రభుత్వవిప్ రామచంద్రు నాయక్, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, రేవూరి ప్రకాష్ రెడ్డి, కేఆర్ నాగారాజు, గండ్ర సత్యనారాయణ రావు, డాక్టర్ మురళి నాయక్, మేయర్ గుండు సుధారాణి, జిల్లా పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి స్వర్ణ, పైడాకుల అశోక్, ప్రకాష్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ మార్నెని రవీందర్ రావు, కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామ్ రెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, టీపీసీసీ నాయకులు, రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com